# మనం
జనం కోసం అక్షర యజ్ఞం..

హైదరాబాద్ - గురువారం 2 ఏప్రిల్ 2026 | సంపుటి: 10 | సంచిక: 86 | పేజీలు:12 | వెల రూ.5

HYDERABAD | KARIMNAGAR | NIZAMABAD | NALGONDA | MAHABUBNAGAR | WARANGAL | KHAMMAM | GUNTUR | TIRUPATI | KURNOOL | ELURU | VISHAKAPATNAM | ANANTHAPURAM | KADAPA


## హెల్మెట్ లేకుంటే మా ఊరికి రావొద్దు!




2

## ఏనుగులు, గుర్రాలపైనుంచి తాటకి వధ



2



## మోడీ, విజయన్ ఇద్దరూ ఒక్కటే

### కేరళంలో సీఎం రేవంత్, మంత్రులు పొంగులేటి, ఉత్తమ్

### రోడ్ షోలు, కార్నర్ మీటింగ్‌లతో తెలుగు ప్రజలతో మమేకం

### ఎన్నికల ప్రచారంలో బిజీబిజీ

హైదరాబాద్, ఏప్రిల్ 1 (మనంబ్యూరో): త్వరలో అసెంబ్లీ ఎన్నికలు జరుగనున్న కేరళం రాష్ట్రంలో తెలంగాణం వినిపిస్తోంది. స్టార్ క్యాంపెయినర్లుగా సీఎం రేవంత్ రెడ్డి సహా మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, పొంగులేటి శ్రీనివాసరెడ్డి కాంగ్రెస్ అభ్యర్థుల పక్షాన విస్తృతంగా ప్రచారం నిర్వహిస్తున్నారు. ముఖ్యంగా కేరళం రాష్ట్రంలోని తెలుగు ప్రజలు ఎక్కువగా నివసించే ప్రాంతాలైన త్రివేండ్రం, అలప్పుజ, ఎర్నాకుళంలో సీఎం రేవంత్ రెడ్డి విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి తెలుగులో ప్రసంగించి అక్కడి ఓటర్లను ఆకట్టుకున్నారు. కార్నర్ షోలు, రోడ్ షోలతో ప్రజలతో మమేకమై కేరళంలో ఎప్పటి నుంచో అధికారంలో ఉన్న పినరయ్ విజయన్ ప్రభుత్వంపై సీఎం రేవంత్ వాడి వేడి విమర్శలు గుప్పించారు. ప్రధాని మోడీ, విజయన్‌కు తేడా ఏమీ లేదనీ, కేరళం ప్రజలు మతతత్వ శక్తులను ఎప్పటికీ అనుమతించరని స్పష్టం చేశారు. నరేంద్ర మోడీ పినరయి విజయన్ ద్వారా కేరళం భవిష్యత్‌ను


...మిగతా 2లో

# ఎవరు ఇన్? ఎవరు ఔట్?

### క్యాబినెట్ విస్తరణపై జోరుగా ఊహాగానాలు

### ఆశల పల్లకిలో ఆశావహులు

### విస్తరణ లేదంటే మంత్రుల శాఖల్లో మార్పులు



హైదరాబాద్, (మనం బ్యూరో): రాష్ట్ర మంత్రివర్గ విస్తరణపై ఊహాగానాలు ఊపందుకున్నాయి. ఇటీవలే అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు ముగిసిన నేపథ్యంలో ఈనెలలోనే మంత్రివర్గ విస్తరణ జరిగే అవకాశం ఉందన్న ప్రచారం జరుగుతోంది. ప్రస్తుతం మంత్రివర్గంలో రెండు బెర్త్‌లు ఖాళీగా ఉన్నాయి. దీంతో పాటు హోం, విద్యా శాఖ, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ వంటి కీలక శాఖలు ప్రస్తుతం సీఎం రేవంత్ రెడ్డి వద్దే ఉన్నాయి. మంత్రివర్గ విస్తరణ చేస్తే సీఎం దగ్గర ఉన్న కొన్ని కీలక శాఖలను కూడా కొత్త మంత్రులకు ఇచ్చే అవకాశం ఉంది. గతంలోనూ పీసీసీ చీఫ్ మహేష్ గౌడ్ ఖాళీగా ఉన్న బెర్తులను భర్తీ చేసే ఆలోచన ఉందని వెల్లడించారు. ఇదిలా ఉండగా, మంత్రి పదవులపై కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి, మల్‌రెడ్డి రంగారెడ్డి, బాలూ నాయక్‌తో పాటు రామ్మోహన్ రెడ్డి కూడా ఆశలు పెట్టుకున్నారు. ముఖ్యంగా కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డికి తప్పనిసరిగా మంత్రి పదవి వస్తుందన్న ప్రచారం జోరుగా సాగుతోంది. గత పార్లమెంట్ ఎన్నికల సమయంలో సీఎం రేవంత్ రెడ్డి భువనగిరి ఎంపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న చామల కిరణ్ కుమార్ రెడ్డిని గెలిపిస్తే మంత్రి పదవి ఇస్తానని హామీ ఇచ్చారు. అంతే కాకుండా భువనగిరి పార్లమెంట్ ఇన్‌చార్జి బాధ్యతలు కూడా అప్పగించారు. ఆ ఎన్నికల్లో చామల కాంగ్రెస్ ఎంపీగా భారీ మెజార్టీతో గెలుపొందారు. అప్పటి నుంచి సీఎం తనకు మంత్రి పదవి ఇస్తానని ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని రాజగోపాల్ రెడ్డి డిమాండ్ చేస్తున్నారు. ఇక మరో రెండు నెలల్లో హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికలు జరుగనున్నందున హైదరాబాద్‌కు చెందిన మల్‌రెడ్డి రంగారెడ్డికి మంత్రి పదవి ఇవ్వాలన్న డిమాండ్ ఎప్పటి నుంచో ఉంది. కాంగ్రెస్ పార్టీలో సీనియర్ ఎమ్మెల్యేగా ఉన్న మల్‌రెడ్డికి హైదరాబాద్ నగరంపై గట్టి పట్టు ఉంది. ఆయనకు మంత్రి పదవి ఇచ్చినట్లయితే హైదరాబాద్ మేయర్ పీఠాన్ని కాంగ్రెస్ పార్టీ కైవసం చేసుకుంటుందనే అంచనాలు ఉన్నాయి. ఇక వెలమ సామాజిక వర్గం నుంచి మంత్రి పదవులు ఆశిస్తున్న వారిలో ప్రేమ్ సాగర్ రావు, మదన్‌మోహన్ రావు, మైనంపల్లి రోహిత్ ఉన్నారు. గత మంత్రివర్గ విస్తరణ సమయంలోనే ప్రేమ్‌సాగర్ రావును మంత్రి పదవి వరిస్తుందన్న ప్రచారం జోరుగా సాగింది. అయితే, సామాజిక సమీకరణల కారణంగా ఆయనకు మంత్రి

...మిగతా 2లో

## నాటో నుంచి వైదొలుగుతాం: ట్రంప్



2

## టారిఫ్ల రిఫండింగ్‌కు 45 రోజుల సమయం..!

వాషింగ్టన్, ఏప్రిల్ 1: అమెరికా అధ్యక్షుడు ట్రంప్ విధించిన సుంకాలు చెల్లవంటూ ఆ దేశ సుప్రీంకోర్టు గతంలో తీర్పునిచ్చిన సంగతి తెలిసిందే. ఈనేపథ్యంలో టారిఫ్ల రూపంలో వసూలు చేసిన 166 బిలియన్ డాలర్ల సొమ్మును తిరిగి ఇవ్వాల్సిన పరిస్థితి వచ్చింది. ఈ రిఫండింగ్ ప్రాసెస్‌కు

...మిగతా 2లో

## అమెరికా జర్నలిస్టు... ఇరాక్‌లో కిడ్నాప్

### ఇరాక్ అంతర్గత మంత్రిత్వశాఖ వెల్లడి

బాగ్దాద్, ఏప్రిల్ 1: అమెరికాకు చెందిన మహిళా ఫ్రీలాన్స్ జర్నలిస్ట్ షెల్లీ కిటెల్సన్‌ను ఇరాక్లో దుండగులు కిడ్నాప్ చేయడం

...మిగతా 2లో

# రాష్ట్రంలో భూ సమస్యలకు చెక్

### సమీకృత భూ భారతి పోర్టల్ తొలి అడుగు

### నేటి నుంచి ప్రయోగాత్మకంగా ఐదు మండలాల్లో

### ఆధునిక పద్ధతిలో రోవర్లతో సమగ్ర సర్వే

హైదరాబాద్, ఏప్రిల్ 1 (మనం బ్యూరో): రాష్ట్రంలో భూ సమస్యలకు చెక్ పెట్టేందుకు ప్రభుత్వం సిద్ధమైంది. రైతులకు పారదర్శకమైన సులభతరమైన సేవలు అందించడానికి ల్యాండ సర్వే, రిజిస్ట్రేషన్ విభాగాలను ఒకే గొడుగు కిందకు తెస్తూ ఇంటిగ్రేటెడ్ భూ భారతి పోర్టల్‌ను ప్రభుత్వం రూపొందించింది. గురువారం నుంచి ఈ పోర్టల్‌ను రాష్ట్రంలోని

...మిగతా 2లో

# కనిపెడితే..కటకటాలే..!

## అనుచిత పోస్టులపై పోలీసు ఆంక్షలు



### అసత్య ప్రచారాలపై ఉక్కుపాదం

### వివాదస్పద పోస్టులపై యాక్షన్ స్క్వాడ్ నిఘా

### సోషల్ మీడియాపై సుమోటో కేసులు

### ఐటీ సాయంతో సైబర్ ప్యాట్రోలింగ్

హైదరాబాద్,ఏప్రిల్ 1(మనం,ప్రత్యేక ప్రతినిధి): ఇక సోషల్ మీడియాలో అసత్యపూరితమైన యుద్ధ వార్తలు, అభ్యంతరకర, విద్వేషపూరిత వివాదాస్పద పోస్టులు పెట్టేవారిని కటకటాల్లోకి నెట్టడం ఖాయమని పోలీసు అధికారులు తేల్చిచెబుతున్నారు. క్షణికావేశంతో అభ్యంతరకరమైన పోస్టులు పెట్టి, వెంటనే ఆయా పోస్టులు తొలగించినా సుమోటో కేసులు తప్పవని పోలీసులు హెచ్చరిస్తున్నారు. ఇటీవల అమెరికా, ఇరాన్‌ల మధ్య యుద్ధం నెలకొన్న నేపథ్యంలో కొందరు సోషల్ మీడియా వేదికగా ఇష్టానుసారం ప్రచారాలు చేపడుతున్నారు. ముఖ్యంగా కొన్ని దేశాలకు అనుకూల, ప్రతికూలమైన వీడియోలు రూపొందిస్తున్నారు. యుద్ధంపై విద్వేషపూరితమైన ప్రసంగాలు, రెచ్చగొట్టే మాటలను వాట్సప్,

...మిగతా 2లో

## రూ.100 కోట్ల భూమికి విముక్తి

- ఎంతటి వారైన ఉపేక్షించం
- హైడ్రా కమిషనర్ ఏ.వీ.రంగనాథ్

హైదరాబాద్,ఏప్రిల్ 01(మనం న్యూస్): హైదరాబాద్ ప్రభుత్వ భూముల పరిరక్షణకు ఏర్పాటు చేసిన 'హైడ్రా' మరో భారీ ఆపరేషన్ చేపట్టింది. రాజేంద్రనగర్ మండలం శాస్త్రిపురంలో ఆటస్థలం కోసం కేటాయించిన ప్రభుత్వ భూమిలో అక్రమంగా నిర్మించిన ఐదు భవనాలను హైడ్రా ఇవాళ కూల్చివేసింది. భారీ భద్రత నడుమ

...మిగతా 2లో

## భారత్‌కు ముడిచమురు

ఢిల్లీ, ఏప్రిల్ 1: యుద్ధం కారణంగా సముద్రంలో నిలిచిపోయిన ఇరాన్ ముడి చమురుపై ఆంక్షలను ఎత్తివేస్తున్నట్లు ఇటీవల అమెరికా పేర్కొన్న విషయం తెలిసిందే. దీంతో ఇరాన్ చమురు కొనుగోలుకు భారత రిఫైనరీలు ఆసక్తి చూపిస్తున్నాయి. ఈ క్రమంలో ఇటీవల ఇరాన్ నుంచి ఓ

...మిగతా 2లో



## ఛత్తీస్‌గఢ్‌లో మావోయిస్టుల లొంగుబాటు

### 7.2 కిలోల బంగారం, రూ.2.90 కోట్ల నగదు స్వాధీనం

చర్ల, ఏప్రిల్ 1: ఛత్తీస్‌గఢ్‌లోని వివిధ జిల్లాల్లో 34 మంది మావోయిస్టులు లొంగిపోయారు. దేశానికి మావోయిస్టు తీవ్రవాదం నుంచి విముక్తి కల్పించాలనే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం చేపట్టిన నక్సల్స్ మిషన్-2026 గడువు మార్చి 31తో ముగిసింది. దాంతో చివరిరోజు మావోయిస్టులు భారీ సంఖ్యలో లొంగిపోయారు. బీజాపూర్ జిల్లాలో 25 మంది

...మిగతా 2లో

## ఇంధన ధరలు పెంచే ప్రసక్తే లేదు

ఢిల్లీ, ఏప్రిల్ 1: పశ్చిమాసియాలో యుద్ధం కారణంగా దేశంలో పెట్రోల్, డీజిల్ ధరలు పెరుగుతాయన్న ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. ఈ క్రమంలో కేంద్రం స్పందిస్తూ.. 'ఇంధన ధరలు పెంచే ప్రసక్తే లేద'ని స్పష్టం చేసింది. దేశంలో చమురు నిల్వలు సరిపడా ఉన్నాయని పెట్రోలియం శాఖ సంయుక్త కార్యదర్శి సుజాత శర్మ వెల్లడించారు. "దేశంలో చమురు, గ్యాస్ నిల్వలు రెండు నెలలకు సరిపడా ఉన్నాయి. రాబోయే రోజుల్లో కొరత ఏర్పడుతుందనే

...మిగతా 2లో

## ఉత్తర కొరియా హ్యాకర్ల పంజా

### వేలాది అమెరికా కంపెనీలు ఎఫెక్ట్

ప్యాంగ్యాంగ్, ఏప్రిల్ 1: ఉత్తర కొరియాకు చెందిన సైబర్ నేరగాళ్లు రెచ్చిపోయారు. వేలాది అమెరికా కంపెనీలు ఉపయోగించే సాఫ్ట్‌వేర్ ప్యాకేజీని అక్రమంగా యాక్సెస్ చేశారు. ఈ సైబర్ దాడి నుంచి అమెరికా కంపెనీలు కోలుకోవడానికి కొన్ని నెలల సమయం పట్టనుందని సెక్యూరిటీ నిపుణులు అంచనా వేస్తున్నారు. అమెరికా ఆర్థికవ్యవస్థకు సంబంధించిన ప్రతి రంగంలోని కంపెనీలు ఉపయోగించే యాక్సియోస్ అనే ఓపెన్ సోర్సు సాఫ్ట్‌వేర్‌ను

...మిగతా 2లో

## స్టార్లింక్‌ను మాత్రం వదిలిపెట్టం: ఇరాన్

టెహ్రాన్, ఏప్రిల్ 1: అమెరికా మిత్ర దేశాల్లోని కీలక స్థావరాలపై ఇరాన్ విరుచుకుపడుతోంది. ఈ క్రమంలో మస్క్ స్టార్లింక్ శాటిలైట్ ఇంటర్నెట్ వ్యవస్థను తమ లక్ష్యంగా చేసుకొని దాడులు చేస్తామని ఐఆర్జీసీ హెచ్చరించింది. బహ్రెయిన్, కువైట్, యూఏఈలో ఆ సంస్థ కార్యకలాపాలు నిర్వహిస్తున్నందున ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపింది. అమెరికాతో ఉద్రిక్తతలు పెరిగేకొద్దీ గల్ఫ్ దేశాల్లోని స్టార్లింక్ మౌలిక సదుపాయాలను ధ్వంసం చేస్తామంది. ఇప్పటికే ఇజ్రాయెల్‌తో సంబంధం ఉన్న దాదాపు 18 అమెరికా టెక్ కంపెనీల మౌలిక

...మిగతా 2లో

## ఇది మా యుద్ధం కాదు

- ఎవరి హెచ్చరికలకు భయపడేది లేదు
- దేశ ప్రయోజనాలే మాకు ముఖ్యం
- యూకే ప్రధాని కీర్ స్టార్మర్



లండన్, ఏప్రిల్ 1: పశ్చిమాసియా ఘర్షణలతో హర్మూజ్ జలసంధిలో తీవ్ర అంతరాయాలు నెలకొన్న సంగతి తెలిసిందే. ఈ క్రమంలో యూకే ప్రధాని కీర్ స్టార్మర్ కీలక వ్యాఖ్యలు చేశారు. హర్మూజ్‌ను తిరిగి తెరిచే మార్గాలపై చర్చించేందుకు ప్రపంచ స్థాయి సదస్సు నిర్వహిస్తామని ప్రకటించారు. ఇందుకోసం అందుబాటులో ఉన్న ప్రతి దౌత్య మార్గాన్ని పరిశీలిస్తున్నామన్నారు. అయితే ఇరాన్ యుద్ధంలోకి మాత్రం ఎట్టి పరిస్థితుల్లోనూ

...మిగతా 2లో

# యుద్ధంలోకి సౌదీ, యూఏఈ?



### ఇరాన్‌కు వ్యతిరేకంగా గల్ఫ్ దేశాలు

### పెరుగుతున్న దాడులు.. ఆర్థిక పర్యవసానాలు

### ఇరానీయులకు యూఏఈలోకి నిషేధం

### హర్మూజ్‌ను తిరిగి తెరవగలరా?

### వాల్‌స్ట్రీట్ జర్నల్ సంచలన కథనం

### ప్రపంచ దేశాల మద్దతు కోసం ప్రయత్నం..

వాషింగ్టన్, ఏప్రిల్ 1: ఇరాన్‌పై అమెరికా-ఇజ్రాయెల్ దాడులు కొనసాగిస్తోన్న నేపథ్యంలో వాల్ స్ట్రీట్ జర్నల్ సంచలన కథనాన్ని ప్రచురించింది. టెహ్రాన్‌తో జరుగుతోన్న యుద్ధంలో సౌదీ అరేబియా, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ పాల్గొనేందుకు సిద్ధమైనట్లు ఆ కథనం పేర్కొంది. ఇరాన్ తమ దేశంపై ఎన్ని దాడులు చేసినప్పటికీ ఓపికతో ఉన్న యూఏఈ ప్రస్తుతం అమెరికాతో చేతులు కలపనున్నట్లు తెలుస్తోంది. ఇరాన్ హర్మూజ్‌ను మూసివేయడం వల్ల తమ దేశం ఇప్పటికే చాలా నష్టపోయిందని.. ఇకపై ఆవిధంగా జరగకూడదనే ఆలోచనతోనే ఈ నిర్ణయం తీసుకుందని తెలిపింది. అదే జరిగితే ఇరాన్ యుద్ధంలో నేరుగా పాల్గొన్న మొదటి పర్షియన్ గల్ఫ్ దేశంగా యూఏఈ నిలవనుంది. గతంలో తమ వైమానిక స్థావరాలను అమెరికా సైన్యం ఉపయోగించుకొనేందుకు నుమతించని సౌదీ అరేబియా.. ప్రస్తుతం అందుకు అంగీకరించినట్లు వాల్‌స్ట్రీట్ జర్నల్ తెలిపింది. హర్మూజ్ జలసంధిని తెరిపించడానికి అమెరికా చేస్తున్న ప్రయత్నాలకు తమ దేశం మద్దతిస్తోందని అధికారిక వర్గాలు పేర్కొన్నట్లు వెల్లడించింది. ఇరాన్‌పై దాడుల కోసం యూఏఈ రహస్యంగా ప్రపంచ దేశాలతో చర్చలు జరుపుతున్నట్లు సమాచారం. ఇందులోభాగంగానే అక్కడి నేతలు ఇరాన్ చర్యలకు అధికారం ఇచ్చే ఐక్యరాజ్యసమితి భద్రతా మండలి తీర్మానం కోసం ప్రయత్నాలు చేస్తున్నారు. అవసరమైతే బలప్రయోగం చేసైనా.. హర్మూజ్ జలసంధిని తిరిగి తెరవడానికి ఒక కూటమిని ఏర్పాటుచేయాలని యూఏఈ దౌత్యవేత్తలు అమెరికా సహా యూరప్, ఆసియాలోని కీలక దేశాలను కోరుతున్నారు. ఈ యుద్ధం ఇలాగే కొనసాగితే ఇరాన్

...మిగతా 2లో




## మోడీ, విజయన్ ఇద్దరూ ఒక్కటే

(మొదటి పేజీ తరువాయి)

అపహరించాలని చూస్తున్నారనీ, కేరళంలో కాంగ్రెస్ మిత్రపక్షాలు గెలవకూడదని ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. కేరళం ప్రజలు విజ్ఞులు, విద్యావంతులనీ, రాష్ట్రాన్ని అభివృద్ధి చేసే కాంగ్రెస్ పార్టీకే అసెంబ్లీ ఎన్నికల్లో పట్టం కట్టాలని విజ్ఞప్తి చేస్తున్నారు. ఇది కేరళం ప్రజలు సరైన నిర్ణయం తీసుకోవాల్సిన సమయమనీ, పెట్టుబడులు తెచ్చి యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించి కేరళంను అభివృద్ధి చేసే వారికే ఓటు వేయండని సీఎం రేవంత్ చేసిన విజ్ఞప్తికి అక్కడి తెలుగు ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. కాగా, రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సైతం కేరళంలో కాంగ్రెస్ అభ్యర్థుల పక్షాన విస్తృతంగా ప్రచారం నిర్వహిస్తున్నారు. అలెప్పి



జిల్లా కయంకుళం అసెంబ్లీ నియోజవకర్గంలో జరిగిన రోడ్ షోలో సీఎం రేవంత్‌తో పాటు పాల్గొన్న మంత్రి పొంగులేటి నిర్వహించిన ప్రచారానికి తెలుగు ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తోంది. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను వివరిస్తూ కేరళం రాష్ట్రంలో కూడా ప్రజలు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలిపిస్తే రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తారని హామీ ఇస్తున్నారు.

# రాష్ట్రంలో భూ సమస్యలకు చెక్

(మొదటి పేజీ తరువాయి)

ఐదు మండలాల్లో ప్రయోగాత్మకంగా అమలు చేయనుంది. ఖమ్మం జిల్లా కూసుమంచి, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేట, రంగారెడ్డి జిల్లా ఆమనగల్, సంగారెడ్డి జిల్లా వట్‌పల్లి, నారాయణపేట జిల్లా కోస్గి మండలాల్లో ప్రయోగాత్మకంగా అమలు చేయనున్నారు. ఇక్కడ వచ్చే ఫలితాలను బట్టి అవసరమైన మార్పులు, చేర్పులు చేసి భవిష్యత్తులో ముందుకు వెళ్లాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ పోర్టల్ అమలుపై ప్రత్యేక దృష్టి సారించాలని ప్రభుత్వం ఇప్పటికే జిల్లా కలెక్టర్లకు స్పష్టం చేసింది. గతంలో మాదిరిగా రైతులు తమ భూ సేవల కోసం మీ సేవా కేంద్రాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా ఇంటి నుంచే భూ సేవలు పొందే విధంగా పోర్టల్‌ను రూపొందించినట్లు ప్రభుత్వం వెల్లడించింది. భూ భారతి పోర్టల్లో రైతు లాగిన్ అయిన వెంటనే తనకున్న భూమి వివరాలు కనిపిస్తాయి. ఎన్ని ఎకరాలకు సర్వే కావాలని కోరితే, అందుకు సంబందించి ఫీజు ఎంత చెల్లించాలో చూపిస్తుంది. ఫీజు చెల్లించిన తరువాత ఆ వివరాలు ఆ గ్రామంలో ఉన్న లైసెన్స్‌డ్ సర్వేయర్ లాగిన్‌కు వెళతాయి. ఆ తరువాత రెండు రోజుల్లో ఆ రైతు భూమికి అనుకుని ఉన్న రైతులకు నోటీసులు జారీ చేస్తారు. అనంతరం ఏడు రోజుల లోపు సర్వే తేదీని సదరు లైసెన్స్‌డ్ సర్వేయర్ ఖరారు చేయడమే కాకుండా సర్వేను రోవర్లతో పూర్తి చేస్తారు. దీనిని సిస్టమ్‌లో నమోదు చేశాక అది మండల సర్వేయర్ పరిశీలనకు వెళుతుంది. ఆపై మండల తహశీల్దార్ ఆమోదం పొందాక దరఖాస్తుదారులైన రైతుకు ఎల్‌పీఎం, భూధార్ నంబర్లు కేటాయిస్తారు. ఈ వివరాలన్నీ భూ భారతి పోర్టల్లో కూడా నిక్షిప్తమవుతాయి. సర్వే పూర్తయిన తరువాత సర్వే మ్యాప్‌ను జనరేట్ చేసి పోర్టల్‌లో అప్‌లోడ్ చేస్తారు. ఈ ప్వప్రక్రియలో రిజిస్ట్రేషన్ దరఖాస్తు ప్రారంభమైనప్పటి నుంచి పూర్తయ్యే వరకు ప్రతి దశలో పౌరుల రిజిస్ట్రేషన్ మొబైల్ నంబర్‌కు ఎస్ఎంఎస్ అలర్ట్ వస్తుంది.

**భూ సమస్యలకు శాశ్వత పరిష్కారమే**

**ఇంటిగ్రేటెడ్ భూ భారతి లక్ష్యం : పొంగులేటి**

భూ భారతి చట్టంలో పేర్కొన్న విధంగా వ్యవసాయ భూముల క్రయవిక్రయదారులకు ఇబ్బంది లేకుండా రిజిస్ట్రేషన్ సమయంలో సర్వే మ్యాపును జత పరిచే నిబంధనలు ఈ ఐదు మండలాల్లో అమలు చేస్తున్నామని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వెల్లడించారు. సర్వే నిర్వహించడానికి అవసరమైన సర్వేయర్లను అందుబాటులో ఉంచామనీ, గొలుసులు, కర్రలు, క్రాస్ స్టాఫ్, మెజరింగ్ టేప్ వంటి పాత పరికరాలకు స్వస్తి చెప్పి రోవర్లతో సర్వే నిర్వహిస్తామన్నారు. దీని వల్ల సర్వే ప్రక్రియ త్వరగా పూర్తి కావడమే కాకండా కచ్చితమైన వివరాలు వస్తాయని తెలిపారు. భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపించేందుకు ఇంటిగ్రేటెడ్ భూ భారతి పోర్టల్ కీలకమైన ముందడుగని ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి స్పష్టం చేశారు.

# కనిపెడితే..కటకటాలే..!

(మొదటి పేజీ తరువాయి)

ఇన్‌స్టా గ్రామ్, టెలిగ్రామ్‌లలో ప్రచారం చేపడుతూ తమను ఎవరు పసిగట్టలేరనే ధీమా వ్యక్తం చేస్తున్నారు. దేశంలో ఒక వర్గాన్ని కొందరు పనికట్టుకుని రెచ్చగొట్టే విధంగా వీడియో లింక్‌లను పోస్ట్ చేస్తూ తీవ్రవాదం వైపు ఆకర్షితులను చేస్తున్నట్టు పోలీసు వర్గాలు గుర్తించాయి. సామాజిక మాధ్యమాలలో అనుచిత పోస్టులు పెట్టేవారిని ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం సాయంతో కనిపెడతామని పోలీసులు తేల్చిచెబుతున్నారు.

**అసాంఘీక శక్తులపై:**

లేనిపోని ఘటనలు, మాటలతో మత విద్వేశాలు రెచ్చగొట్టే విధంగా సోషల్ మీడియా పోస్టులు పెట్టేవారిపై అటు ఎన్ఐఏ, ఇటు ఎస్‌బీ అధికారులు నిరంతరం నిఘా సారిస్తున్నారని పోలీసు బాసులు వివరిస్తున్నారు. ఇటీవల అమెరికా, ఇరాన్‌ల మధ్య యుద్ధ వాతావరణాన్ని అవకాశంగా మార్చుకున్న అసాంఘిక శక్తులు గుట్టుగా గ్రూపులు నిర్వహిస్తున్నారన్న ఆరోపణలపై తెలంగాణ పోలీసు శాఖ అప్రమత్తమైంది. ఇందులో భాగంగా హైదరాబాద్ నగరానికి చెందిన కొందరు విద్యార్థులు, నిరుద్యోగులతో టెలిగ్రామ్ యాప్ ద్వారా మంతనాలు సాగిస్తున్నట్లు గుర్తించి కొందరు యువకులను అదుపులోకి తీసుకున్నారు. సదరు యువకులను మందలించడంతో పాటు వీరి కదలికలపై నిఘా ఉంచాలని స్థానిక పోలీసులకు ఆదేశాలిచ్చారు. ఇటీవల చంచల్‌గూడ చెందిన మహిళకు ఉగ్రలింకులతో సంబంధాలున్నట్టు విజయవాడ పోలీసులు గుర్తించారు. ఆమె నివాసంలో సోదాలు నిర్వహించి అరెస్ట్ చేయడం సంచలనంగా మారింది. గతేడాది లాలాగూడలోని యువకుడు దేశవ్యాప్తంగా పేలుళ్లకు కుట్రపన్నిన కేసులో విజయనగరం పోలీసులు అరెస్ట్ చేశారు. వీరిద్దరూ సామాజిక మాధ్యమాల్లో ప్రచారం చేసే ఉగ్రవాదం వైపు ఆకర్షితులైనట్టు పోలీసుల దర్యాప్తులో తేలింది. దీంతో ఉగ్ర లింకుల వ్యవహారం బయటపడటంతో తెలంగాణలోని అసాంఘికశక్తులపై పోలీసులు మరింత నిఘా పెంచారు.

**పొలిటికల్ గ్రూప్‌లపైనా:**

రాష్ట్రంలోని కొన్ని రాజకీయ పార్టీలకు చెందిన సోషల్ మీడియా వివరాలను అటు కేంద్ర, ఇటు రాష్ట్ర ఇంటెలిజెన్స్ వర్గాలు సేకరిస్తున్నాయి. సోషల్ మీడియాపై బాధితులు ఇచ్చే ఫిర్యాదులతోనే కాకుండా సైబర్ ప్యాట్రోలింగ్ ద్వారా సోషల్ మీడియాలోని పోస్టులపై నిఘా ఉంచి బాధ్యులపై పోలీసులు సుమోటోగా కేసులు పెడుతున్నారు.ప్రపంచంలో ఏదో ఒక మూల జరిగిన ఘటనను దృష్టిలో పెట్టుకుని ఓ వర్గాన్ని కించపరుస్తూ విద్వేషపూరిత పోస్టులు పెడుతుండటం సర్వ సాధారణంగా మారింది. ముఖ్యంగా కొన్ని రాజకీయ పార్టీలకు చెందిన వాట్సాప్ గ్రూపులు, ఎక్స్, ఫేస్ బుక్, ఇన్‌స్టాగ్రామ్‌లలో అసభ్యకర కామెంట్లు చేస్తున్నారు. తాజాగా రంగారెడ్డి జిల్లాలోని కొందుర్గు మండలానికి చెందిన ఓ తాపీ మేస్త్రీ వాట్సాప్ గ్రూపులో ప్రముఖ రాజకీయ నాయకుడి మీద అభ్యంతరకర వ్యాఖ్యలు చేస్తూ పోస్టు పెట్టిన విషయం విదితమే. దీనిపై కొందరు పోలీసులకు ఫిర్యాదు చేయగా అతనిపై కేసు నమోదు చేశారు. అలాగే ఎల్‌బీ నగర్‌కు చెందిన ఓ యువకుడు ఫేస్‌బుక్‌లో వచ్చిన ఓ పోస్టు చూసి ఆవేశంలో ఓ వర్గాన్ని కించపర్చే కామెంట్స్ చేయడంతో సైబర్ పెట్రోలింగ్ పోలీసులు యువకుడిపై కేసు నమోదు చేశారు. విద్వేశపూరితమైన పోస్టులపై స్పందించి పోస్టులు పెట్టి వెంటనే వాటిని తొలగించినా సాంకేతిక పరిజ్ఞానంతో వారిని పట్టుకుంటామని పోలీసులు తేల్చిచెబుతున్నారు.

**హైదరాబాద్ టాప్:**

సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారంతో రెండు వర్గాల మధ్య విభేదాలు సృష్టిస్తున్న ఘటనలు రాష్ట్ర రాజధాని(హైదరాబాద్)లోనే ఎక్కువగా నమోదవుతున్నట్లు జాతీయ నేర గణాంక సంస్థ వెల్లడించిన విషయం విదితమే. దేశంలోని 19 మెట్రోనగరాల్లో హైదరాబాద్ తొలిస్థానంలో నిలిచిందని 2022లో జాతీయ నేర గణాంక సంస్థ రికార్డులు పేర్కొంటున్నాయి. ఈ ఏడాది ఇప్పటి వరకు 40 కేసులు నమోదు చేసినట్లు నగర పోలీసులు వివరిస్తున్నారు. జంట నగరాలలోని మూడు కమిషనరేట్లలో ఇటీవల సామాజిక మాధ్యమాల్లో కొన్ని పోస్టులు, వీడియోలు చర్చనీయాంశంగా మారాయి. కొన్నిసార్లు వర్గాల మధ్య వివాదాలకు దారి తీస్తుండడంతో హైదరాబాద్ పోలీసులు ప్రత్యేకంగా స్మాష్ (సోషల్ మీడియా యాక్షన్ స్క్వాడ్ అఫ్ హైదరాబాద్) విభాగాన్ని ప్రారంభించారు. రాచకొండ, సైబరాబాద్ కమిషనరేట్ పోలీసుల ఐటీ విభాగాలతో ప్రత్యేకంగా సైబర్ ప్యాట్రోలింగ్ నిర్వహిస్తున్నారు. సామాజిక మాధ్యమాల్లో వివాదస్పద పోస్టులను గుర్తించి వారిపై సుమోటో కింద కేసులు నమోదు చేసి కటకటాలకు తరలిస్తున్నారు.

**మార్ఫింగ్‌పై మరింత నిఘా:**

రాష్ట్రంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు, అల్లర్లు జరుగకుండా అవసరమైన ప్రత్యేక చర్యలు చేపట్టాలని ఇంటెలిజెన్స్, నిఘా వర్గాలకు పోలీసుశాఖ ఉన్నతాధికారులు డీజీపీ శివధర్‌రెడ్డి ఆదేశాలను జారీ చేశారు. అనుచిత పోస్టులకు సంబంధించి ప్రభుత్వ ఉద్యోగులు, విద్యార్థులు, నిరుద్యోగులు జాగ్రత్తగా ఉండాలని ముందస్తు హెచ్చరికలు చేశారు. వివాదాస్పద పోస్టులు పెట్టిన వ్యక్తులతో పాటు దానిని ఇతర గ్రూపులకు ఫార్వర్డ్ చేసిన వారిపై సుమోటో కింద కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకునేందుకు రంగం సిద్ధం చేశామని తెలిపారు. ముఖ్యంగా గ్రూప్ అడ్మిన్ సైతం చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. వివాదాస్పద కామెంట్లు చేసి పోలీసులకు చిక్కుతున్న కేసుల్లో అత్యధికంగా విద్యార్థులు, సాధారణ ఉద్యోగులు, చిరు వ్యాపారులు ఉంటున్నారని పోలీసు అధికారులు వివరిస్తున్నారు.



మరొకొందరని విచారించే సమయంలో పొరపాటున, క్షణికావేశంలో పోస్టులు పెట్టామంటూ వేడుకుంటున్నారని పోలీసులు చెబుతున్నారు.

**అత్యుత్సాహంతో ఆగం:**

సోషల్ మీడియా అత్యుత్సాహం వల్ల శాంతి భద్రతలతో పాటు సాధారణ ప్రజాజీవనంపైనా తీవ్ర ప్రభావం చూపుతోందని పోలీసు అధికారులు పేర్కొంటున్నారు.సోషల్ మీడియాలో అభ్యంతరకర సందేశాలను వైరల్ చేసే వారిని జైలు ఊచలు లెక్కపెట్టిస్తామని పోలీసు బాసులు వివరిస్తున్నారు. ఏదైనా అభ్యంతరకరమైన పోస్టు వచ్చిన వెంటనే దాని వివరాలు, ఆ పోస్టును ఎవరు పెట్టారు? వారు ఏ ప్రాంతానికి చెందిన వారు, ఆ పోస్టు వల్ల ప్రజల మనోభావాలు ఎలా దెబ్బతింటాయి అనే కోణం లో సైతం పోలీసులు వివరాలను సేకరిస్తున్నారు. వెరసి సోషల్ మీడియాపై నిఘా పెంచి మోసాలను అడ్డుకోవాలని పోలీసులు భావిస్తున్నారు. ముఖ్యంగా అమెరికా, ఇరాన్, యుద్ధం, ఇటీవల రాష్ట్రంలో చోటుచేసుకున్న ఘటనలపై సోషల్ మీడియాలో మత విద్వేషాలు, అల్లర్లకు కారకులుగా వ్యవహరించే సోషల్ మీడియా గ్రూపులపై పోలీస్ ప్రత్యేక బృందాలతోపాటు నిఘా వర్గాలు సైతం దృష్టి సారించాయి. వివాదాస్పద పోస్టులు పెట్టిన వ్యక్తులతో పాటు దానిని ఇతర గ్రూపులకు వాటిని ఫార్వర్డ్ చేసిన వారిపై కూడా కఠిన చర్యలు తీసుకునేందుకు రంగం సిద్ధం చేశారు.

## ఎవరు ఇన్? ఎవరు ఔట్?

(మొదటి పేజీ తరువాయి)

పదవి దక్కలేదు. ఒకవేళ మంత్రివర్గ విస్తరణ చేపట్టిన పక్షంలో సీఎం రేవంత్ రెడ్డి పలువురు మంత్రుల శాఖలు మార్చే అవకాశం ఉన్నట్లు కాంగ్రెస్ పార్టీ వర్గాలలో చర్చ జరుగుతోంది. మంత్రుల పని తీరు, వివాదాలు, అవినీతి ఆరోపణల కారణంగా ఇద్దరు లేదా ముగ్గురు మంత్రుల శాఖలు మార్చే అవకాశం ఉన్నట్లు సమాచారం. ప్రస్తుతం బీసీ వర్గం నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న ఓ మంత్రిని పదవి నుంచి తప్పించి ఆయన స్థానంలో మరో బీసీకి ఇవ్వొచ్చనే చర్చలు జరుగుతున్నాయి. మరోవైపు, ప్రస్తుతం ఒక్కో మంత్రి రెండు మూడు కీలక శాఖలకు ప్రాతినిధ్యం వహిస్తున్నారు.

వీరిలో ఉత్తమ్ కుమార్ రెడ్డి ప్రధానమైన భారీ సాగునీటి పారుదల శాఖతో పాటు పౌర సరఫరాల శాఖను, పొంగులేటి శ్రీనివాసరెడ్డి రెవెన్యూతో పాటు హౌసింగ్ శాఖను నిర్వహిస్తున్నారు. ఒకవేళ కాంగ్రెస్ అధిష్టానం మంత్రివర్గ విస్తరణకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చిన పక్షంలో ఇప్పుడున్న మంత్రుల్లో పదవులు కోల్పోయేది ఎవరు ? కొత్తగా మంత్రి పదవులు ఎవరిని వరిస్తాయి ? అనేది ప్రస్తుతం రాజకీయ వర్గాలలో హాట్ టాపిక్‌గా మారింది.




## హెల్మెట్ లేకుంటే మా ఊరికి రావొద్దు!

**బయ్యారం, ఏప్రిల్ 1:** ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించకుండా తమ ఊరిలోకి రావొద్దని మహబూబాబాద్ జిల్లా బయ్యారం మండలం వెంకట్రాంపురం గ్రామస్థులు గ్రామ శివారులో బ్యానర్ ఏర్పాటు చేశారు. వారం క్రితం పోలీసులు గ్రామంలో అవగాహన సదస్సు నిర్వహించారు. వాహన ప్రమాదాలు, హెల్మెట్ ధరించడంతో ప్రయోజనాలు, ఇతర అంశాలను వివరించారు. దీంతో స్ఫూర్తి పొందిన పంచాయతీ పాలకవర్గం... గ్రామంలో ద్విచక్ర వాహనంపై ప్రయాణించేవారు తప్పక హెల్మెట్ ధరించాలని తీర్మానించారు.

## ఏనుగులు, గుర్రాలపై వచ్చి తాటకి వధ

**ఛతుర్‌పూర్, ఏప్రిల్ 1:** రామాయణంలోని బాలకాండలో 'తాటకి వధ' ప్రధాన ఘట్టం. ఈ రాక్షసిని శ్రీరాముడు సంహరిస్తాడు. మధ్యప్రదేశ్‌లోని జిల్లా కేంద్రం ఛతుర్‌పూర్‌కు 34 కిలోమీటర్ల దూరాన ఉన్న గరౌలి గ్రామంలో ఈ వృత్తాంతాన్ని గుర్తుచేసుకుంటూ గత 200 ఏళ్లుగా తాటకి వధ వేడుకలు జరుగుతున్నాయి. పంటకోతల సీజను (మార్చి-ఏప్రిల్)లో జరిగే ఈ వేడుకలను చూసేందుకు చుట్టుపక్కల 18 గ్రామాల ప్రజలు తరలివస్తారు. తాటకి పేరుతో ఏర్పాటుచేసే పెద్ద బొమ్మను వధించేందుకు ఏనుగులు, గుర్రాలపై యువకులు దూసుకొస్తారు.

విజేతకు బహుమతి ప్రదానం ఉంటుంది. బ్రిటిష్ పాలనాకాలంలో గరౌలి రాచరిక సంస్థానం. అప్పట్లో ఈ వేడుకలు నెల రోజులు జరిగేవి.

## టారిఫ్ల రిఫండింగ్‌కు 45 రోజుల సమయం..!

(మొదటి పేజీ తరువాయి)

సంబంధించి ఏర్పాటుచేసిన వ్యవస్థ దాదాపు పూర్తయిందని అమెరికా కస్టమ్స్ అండ్ బోర్డర్ ప్రొటెక్షన్ సంస్థ పేర్కొంది.

ఆ సంస్థ అధికారి బ్రాండన్ లార్డ్ అమెరికా అంతర్జాతీయ వాణిజ్య న్యాయస్థానానికి ఈ విషయాన్ని వెల్లడించారు. కొత్త రిఫండ్ వ్యవస్థ ఏర్పాటు 80 శాతం పూర్తయినట్లు తెలిపారు. రిఫండ్లకు సంబంధించిన దరఖాస్తులను సమీక్షించి ప్రాసెస్ చేయడానికి 45 రోజుల సమయం పట్టవచ్చని పేర్కొన్నారు. అయితే, దరఖాస్తుల స్వీకరణ ఎప్పుడు ప్రారంభమవుతుందనే విషయాన్ని ఆయన వెల్లడించలేదు. ప్రపంచదేశాలపై ట్రంప్ ఎడాపెడా విధించిన సుంకాలు చెల్లవంటూ సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పులో వాపసుల గురించి ఎక్కడా ప్రస్తావించలేదు. అయితే, ఆ తర్వాత ఓ సంస్థ దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ సందర్భంగా సుంకాల సొమ్మును వాపసు ఇవ్వాల్సిందేనని ట్రేడ్ కోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. దిగుమతిదారులు అందుకు అర్హులని పేర్కొంది.

## స్టార్లింక్‌ను మాత్రం వదిలిపెట్టం: ఇరాన్

(మొదటి పేజీ తరువాయి)

సదుపాయాలను టార్గెట్ చేసినట్లు తెలిపింది. ఇరాన్ దాడుల్లో తరచూ ఇంటర్నెట్ బ్లాక్‌అవుట్ సమస్య తలెత్తుతుండడంతో పలు గల్ఫ్ దేశాలు స్టార్లింక్ శాటిలైట్ ఇంటర్నెట్ వ్యవస్థను ఉపయోగిస్తున్నాయి.

దీంతో ఐఆర్జీసీ ఈ హెచ్చరికలు చేసింది. యాపిల్, మైక్రోసాఫ్ట్, ఇంటెల్, ఐబీఎం, డెల్, టెస్లా, బోయింగ్, హెచ్పీ, జేపీ మోర్గాన్ తదితర అమెరికా కంపెనీలకు చెందిన యూనిట్ల పైనా ఏప్రిల్ 1 నుంచి దాడులు చేసే అవకాశం ఉందని ఐఆర్జీసీ హెచ్చరించింది. ఆయా కంపెనీల్లో పనిచేసే ఉద్యోగులు ప్రాణాలు కాపాడుకోవాలంటే తక్షణమే వెళ్లిపోవాలని స్థానిక నివాసితులు కూడా సురక్షిత ప్రాంతాలకు తరలివెళ్లాలని సూచించింది. ఇప్పటికే ఇరాన్‌లో స్టార్లింక్ సేవలను ఉపయోగించడంపై నిషేధం ఉంది. ఆ నెట్‌వర్క్‌ను ఉపయోగించిన వారికి టెహ్రాన్ ప్రభుత్వం రెండేళ్ల జైలు శిక్ష విధిస్తోంది.

## అమెరికా జర్నలిస్టు... ఇరాక్‌లో కిడ్నాప్

(మొదటి పేజీ తరువాయి)

కలకలం రేపింది. ఇందుకు సంబంధించి వీడియో ఒకటి తాజాగా బయటికొచ్చింది. బాగ్దాద్‌లోని ఓ హోటల్ బయట కిటెల్సన్ను అపహరించారని ఇరాక్ అంతర్గత మంత్రిత్వశాఖ వెల్లడించింది. ఆమె కోసం పోలీసులు గాలింపు చర్యలు చేపట్టినట్టు తెలిపింది.

ఈ కిడ్నాప్ వ్యవహారంలో ఓ అనుమానితుడిని అదుపులోకి తీసుకున్నట్లు అమెరికా విదేశాంగ శాఖ వెల్లడించింది. అతడికి ఇరాన్‌తో సన్నిహితంగా ఉండే కతైబ్ హెజ్బొల్లా మిలిషియా బృందాలతో సంబంధం ఉన్నట్లు తెలిపింది. మరోవైపు, ఈ కిడ్నాప్‌ను ధ్రువీకరిస్తూ ఖతర్ మీడియా సంస్థ అల్జజీరా వీడియో విడుదల చేసింది.

ఈ ఘటనను అంతర్జాతీయ మహిళా మీడియా ఫౌండేషన్ ప్రెసిడెంట్ ఎలీసా లీస్ మునోజ్ ఖండించారు. ''షెల్లీ కిటెల్సన్ అత్యంత ధైర్యవంతురాలైన జర్నలిస్ట్. ప్రస్తుతం పశ్చిమాసియాలో ఘర్షణలు జరుగుతున్న ప్రాంతం నుంచి ఆమె న్యూస్ కవర్ చేస్తున్నారు. ఈ క్రమంలోనే ఆమెను బాగ్దాద్ వీధుల్లో దుండగులు బలవంతంగా కారులో ఎక్కించుకొని వెళ్లడం అత్యంత విచారకరం. ఆమె ఆచూకీపై ఆందోళనగా ఉంది'' అని ఎలీసా విచారం వ్యక్తంచేశారు.

# యుద్ధంలోకి సౌదీ, యూఏఈ?

(మొదటి పేజీ తరువాయి)

హర్మూజ్‌ను పూర్తిగా తన అధీనంలోకి తీసుకొని.. ప్రపంచ ఆర్థికవ్యవస్థను పతనం చేస్తుందని అందరికీ వివరిస్తున్నారు. తమ దేశాలపై ఇరాన్ ప్రతీకార దాడులు కొనసాగిస్తుండడంతో గల్ఫ్ దేశాల ప్రజలు ఇరాన్‌ను తీవ్రంగా వ్యతిరేకిస్తున్నట్లు వాల్‌స్ట్రీట్ జర్నల్ తెలిపింది. టెహ్రాన్ ప్రభుత్వం బలహీనపడే వరకు లేదా అధికారం నుంచి తొలగిపోయే వరకు యుద్ధం కొనసాగించాలని కోరుకుంటున్నారు. ఆయా దేశాలు తమ సైన్యాన్ని స్వయంగా రంగంలోకి దించనప్పటికీ.. అమెరికాకు రహస్యంగా మద్దతునిస్తున్నాయి. ఇర్వా పట్టు సాధించాలంటే దశాబ్దాలుగా ఇరాన్ నియంత్రణలో ఉండి.. యూఏఈ హక్కులు కోరుతున్న అబు మూసా వంటి వ్యూహాత్మక ద్వీపాలను ఆక్రమించుకోవాలని యూఏఈ అమెరికాకు సూచించింది. యూఏఈ యుద్ధంలోకి నేరుగా ప్రవేశించకపోయినా ఇరాన్ ఆ దేశంపై దాడులు తీవ్రతరం చేస్తోంది. ఇప్పటికే గల్ఫ్ దేశాలపై దాదాపు 2,500 క్షిపణులు, డ్రోన్లను ప్రయోగించింది. తమకు వ్యతిరేకంగా సైనిక చర్యకు మద్దతిచ్చే గల్ఫ్ దేశాల్లోని పౌర మౌలిక సదుపాయాలను లక్ష్యంగా చేసుకుంటామని హెచ్చరించింది. హర్మూజ్ను తెరవడానికి, ఇరాన్ క్షిపణి సామర్థ్యాలను దెబ్బతీయడానికి ప్రయత్నిస్తే పరిస్థితులు తీవ్రంగా మారుతాయని హెచ్చరించింది. నిరంతర దాడుల వల్ల విమాన ప్రయాణాలకు అంతరాయం కలగడంతో యూఏఈ పర్యాటకం తీవ్రంగా ప్రభావితమయ్యింది. ఇరాన్ ప్రతీకార దాడుల కారణంగా టెహ్రాన్ ప్రజలు తమ దేశంలోకి ప్రవేశించడంపై యూఏఈ నిషేధం విధించినట్లు పలు విమానయాన సంస్థలు వెల్లడించాయి. దేశంలో గోల్డెన్ వీసాలు ఉన్నవారిని ఇందులో నుంచి మినహాయించినట్లు తెలిపాయి. ఈ విషయంపై అధికారిక ప్రకటన రావాల్సిఉంది. ఐక్యరాజ్యసమితి మద్దతుతో హర్మూజ్ను తిరిగి తెరవడానికి యూరప్, ఆసియా దేశాలు చేస్తున్న ప్రయత్నాల్లో చేరడానికి యూఏఈ అధికారులు ప్రయత్నిస్తున్నారు. ఆ విధంగా జరగకపోతే.. అమెరికాతో కలిసి, సైనిక చర్య చేపట్టడానికి సైతం ప్రణాళికలు రచిస్తున్నారు. ఇందుకోసం సమీపంలోని భూభాగం పైనా నియంత్రణ అవసరమని యూఏఈ భావిస్తోంది. అయితే అక్కడి భూభాగంపై నియంత్రణ సాధించడం సంక్లిష్టమైన, ప్రమాదకరమైన ఆపరేషన్ అని నిపుణులు అంచనా వేస్తున్నారు.



## ఉత్తర కొరియా హ్యాకర్ల పంజా

(మొదటి పేజీ తరువాయి)

నిర్వహించే ఓ సాఫ్ట్‌వేర్ డెవలపర్ ఖాతాను హ్యాకర్లు యాక్సెస్ చేశారు. దాంతో ఆ సాఫ్ట్‌వేర్‌కు సంబంధించిన తప్పుడు అప్‌డేట్లను కంపెనీలకు పంపించారు. హ్యాకింగ్‌ను గుర్తించిన సాఫ్ట్‌వేర్ డెవలపర్ తన అకౌంట్‌ను తిరిగి తన నియంత్రణలోకి తెచ్చుకొనేవరకు ఈ దాడి జరిగినట్లు అంతర్జాతీయ కథనాలు వెల్లడించాయి. ఈ ప్రభావాన్ని అంచనా వేసి, దానినుంచి కోలుకునేందుకు ఆయా కంపెనీలకు కొన్ని నెలల సమయం పట్టొచ్చని తెలుస్తోంది. ఇది ఉత్తరకొరియా హ్యాకర్ల పనేనని సైబర్ ఇంటెలిజెన్స్ సంస్థలు వెల్లడిస్తున్నాయి. ఉత్తర కొరియాకు చెందిన హ్యాకర్లు ఇలాంటి దాడులకు పాల్పడటం ఇదేం కొత్తకాదు. గతంలో పలు బ్యాంకులు, క్రిప్టో కరెన్సీ సంస్థలపై సైబర్ దాడికి పాల్పడి బిలియన్ల డాలర్లు దొంగిలించారని వార్తలు వచ్చాయి. ఆ సొమ్మును కిమ్ యంత్రాంగం తమ క్షిపణుల అభివృద్ధికి వినియోగిస్తున్నట్లు సమాచారం.

## ఇంధన ధరలు పెంచే ప్రసక్తే లేదు

(మొదటి పేజీ తరువాయి)

ఆందోళనతో అధికంగా కొనాల్సిన అవసరం లేదు. ప్రస్తుతం ఎల్‌పీజీ నిల్వలు కూడా సరిపడా ఉన్నాయి. ఒక వేళ సరఫరాలో అంతరాయాలు ఏర్పడితే తీసుకోవాల్సిన చర్యలపై కేంద్రం యోచిస్తోంది. రిఫైనరీలు గరిష్ఠ సామర్థ్యంతో పనిచేస్తున్నాయి. రెండు నెలల క్రితం బ్యారెల్కు 70 డాలర్ల దగ్గర ట్రేడ్ అయిన బ్రెంట్ క్రూడ్, ఈ రోజు 100 డాలర్ల మార్కును దాటింది. 2022 ఏప్రిల్ నుంచి 2024 మార్చి వరకు డీజిల్, పెట్రోలు ధరలను పెంచలేదు. వినియోగదారులపై భారం తగ్గించేందుకు ఎక్సైజ్ డ్యూటీ తగ్గించాం'' అని సజాతాశర్మ పేర్కొన్నారు.

## భారత్‌కు ముడిచమురు

(మొదటి పేజీ తరువాయి)

ఆయిల్ ట్యాంకర్ భారత్ వైపు బయల్దేరింది. మార్చి 4వ తేదీన ఖర్గ్ ద్వీపం వద్ద ట్యాంక్‌లోకి చమురు లోడింగ్ చేశారని.. ఏప్రిల్ 4న గుజరాత్ వాడినార్ పోర్టుకు ఇది చేరుకోనుందని డేటా ఇంటెలిజెన్స్ సంస్థ క్లెప్లర్ వెల్లడించింది. 2019 తర్వాత ఇరాన్ చమురు భారత్‌కు రావడం ఇదే తొలిసారి కావడం గమనార్హం. ఇందులో దాదాపు 6,00,000 బ్యారెళ్ల చమురు ఉండొచ్చని అంచనా. ఇరాన్ నుంచి వస్తున్న ఈ చమురును ఏ భారతీయ రిఫైనరీ ఉపయోగించనుందనే విషయంపై ఎటువంటి సమాచారం లేదు. గతంలో భారత్ ఇరాన్ చమురుకు ప్రధాన కొనుగోలుదారుగా ఉండేది. ఒకానొక సమయంలో మొత్తం చమురు దిగుమతుల్లో ఇరాన్ వాటా సుమారు 11.5 శాతంగా ఉండేది. 2018లో భారత్ రోజుకు సుమారు 5,18,000 బ్యారెళ్ల ఇరాన్ చమురును దిగుమతి చేసుకోగా మే 2019 నాటికి అది రోజుకు 2,68,000 బ్యారెళ్లకు తగ్గింది.

## నాటో నుంచి వైదొలుగుతాం: ట్రంప్

**వాషింగ్టన్, ఏప్రిల్ 1:** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కీలక వ్యాఖ్యలు చేశారు. నాటో కూటమి నుంచి వైదొలిగే యోచనలో ఉన్నామని అన్నారు. బ్రిటన్‌కు చెందిన 'ది టెలిగ్రాఫ్' పత్రికకు ఇచ్చిన ఇంటర్వ్యూలో మాట్లాడుతూ.. ఆ కూటమి ఓ కాగితపు పులి వంటిదన్నారు. ఈ విషయం రష్యాకూ తెలుసునని చెప్పారు. ఆ కూటమి మాటలకు తానెప్పుడూ ప్రభావితం కాలేదన్నారు. హర్మూజ్ జలసంధిని తెరిపించేందుకు కలిసి రావాలని చేసిన విజ్ఞప్తిని పట్టించుకోకపోవడంపై నాటో దేశాలపై తీవ్ర స్థాయిలో మండిపడుతున్న ట్రంప్ వాళ్లు పిరికివాళ్లంటూ ఇటీవల విమర్శించారు.

## ఛత్తీస్‌గఢ్‌లో మావోయిస్టుల లొంగుబాటు

(మొదటి పేజీ తరువాయి)



లొంగిపోవడంతోపాటు 93 ఆయుధాలను, రూ.11.16 కోట్ల విలువైన 7.2 కిలోల బంగారాన్ని, రూ.2.90 కోట్ల నగదును అప్పగించినట్లు ఆ జిల్లా ఎస్పీ జితేంద్రకుమార్ యాదవ్ వెల్లడించారు. దంతెవాడ జిల్లాలో మావోయిస్టుల దండకారణ్య ప్రత్యేక జోనల్ కమిటీకి చెందిన ఐదుగురు తమ ఆయుధాలతో సహా లొంగిపోయారు. సుక్మా జిల్లాలో ఇద్దరు మహిళా మావోయిస్టులు లొంగిపోయారు. వీరిచ్చిన సమాచారంతో రూ.10 లక్షల నగదు, భారీగా ఆయుధాల డంపును బలగాలు స్వాధీనం చేసుకున్నాయని ఎస్పీ కిరణ్ చవాన్ తెలిపారు. కాంకేర్ జిల్లాలోనూ ఇద్దరు లొంగిపోయి, ఏకే-47 రైఫిల్‌ను పోలీసులకు అందజేశారు.

## రూ.100 కోట్ల భూమికి విముక్తి

(మొదటి పేజీ తరువాయి)

ఈ కూల్చివేత ప్రక్రియను పూర్తిచేశారు. స్వాధీనం చేసుకున్న ఈ భూమి విలువ సుమారు రూ.100 కోట్లు ఉంటుందని అధికారులు అంచనా వేస్తున్నారు. హైదరాబాద్ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (హుడా) ఆమోదించిన 188 ఎకరాల లే అవుట్లో 6,500 చదరపు గజాల స్థలాన్ని ఆటస్థలం కోసం కేటాయించారు. అయితే, కొందరు వ్యక్తులు ఈ భూమిని కబ్జా చేసి, నకిలీ నోటరీ పత్రాలతో ఇతరులకు ప్లాట్లుగా విక్రయించారు. ఈ స్థలంలో నిర్మాణంలో ఉన్న ఐదు ఎ+3 భవనాలతో పాటు మరో రెండు చిన్న నిర్మాణాలను కూడా హైడ్రా బృందాలు నేలమట్టం చేశాయి. అయితే, మరో రెండు భవనాల్లో కొన్ని కుటుంబాలు నివసిస్తుండటంతో మానవతా దృక్పథంతో వాటిని కూల్చివేయలేదు.కాగా,జీహెచ్ఎంసీ అధికారులు గతంలో ఈ కబ్జాదారులకు నోటీసులు జారీ చేసినా వారు పట్టించుకోలేదని, స్థానికుల నుంచి అందిన ఫిర్యాదులతో హైడ్రా, జీహెచ్ఎంసీ,రెవెన్యూ అధికారులు సంయుక్తంగా క్షేత్రస్థాయిలో విచారణ జరిపి, కబ్జాలను నిర్ధారించుకున్న తర్వాత ఈ చర్యలు చేపట్టారు. హైడ్రా ఏర్పడినప్పటి నుంచి ఇప్పటివరకు రూ.60,000 కోట్ల విలువైన 1,045 ఎకరాల ప్రభుత్వ భూములు, జలవనరులను తిరిగి స్వాధీనం చేసుకున్నామని హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ తెలిపారు.

## ఇది మా యుద్ధం కాదు

(మొదటి పేజీ తరువాయి)

దిగబోమని తేల్చిచెప్పారు. హర్మూజ్ జలసంధి విషయంలో తన మాట వినని యూకేకు అమెరికా సాయం చేయబోదని ట్రంప్ హెచ్చరికలపై స్టార్మర్ స్పందిస్తూ ఎవరు ఎంత ఒత్తిడి తీసుకువచ్చినా బ్రిటన్ ప్రయోజనాల కోసమే ఆలోచిస్తానన్నారు. ఇది తమ యుద్ధం కాదని.. అందువల్లే ఇందులోకి వెళ్లదలుచుకోలేదని స్పష్టంచేశారు. ప్రస్తుత సంఘర్షణలతో యూకే భవిష్యత్తుపై గణనీయమైన ప్రభావం పడుతోందని.. ఇంధన సరఫరాకు అంతరాయం కలగడం వల్ల జీవన వ్యయం పెరుగుతుందని అన్నారు. అయినప్పటికీ ఈ సంక్షోభాన్ని ఎదుర్కోవడానికి దేశం సిద్ధంగా ఉందన్నారు. ప్రస్తుత సమయంలో అమెరికాతో కంటే సహచర ఐరోపా దేశాలతో బలమైన సంబంధాలు కలిగి ఉండడమే బ్రిటన్‌కు ప్రయోజనకరమని అభిప్రాయం వ్యక్తం చేశారు.



# చేయిచాచి...చిక్కారు

## ఏసీబీ వలలో ముగ్గురు అధికారులు

## ఓ ఏఎస్ఐ,ఇద్దరు ఓయూ ఉద్యోగుల అరెస్ట్




హైదరాబాద్,ఏప్రిల్ 1,(మనం,ప్రత్యేక ప్రతినిధి) : హైదరాబాద్ నగరంలో ఏసీబీ అధికారులు దూకుడు పెంచారు. ఈక్రమంలో లంచం తీసుకుంటున్న ముగ్గురు ప్రభుత్వ ఉద్యోగులను ఏసీబీ అధికారులు బుధవారం రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. వివరాల్లోకి వెళితే..చైతన్యపురి పోలీస్ స్టేషన్‌లో ఏఎస్ఐగా పనిచేస్తున్న పూసాల బాలయ్యను ఓ కేసులో నిందితుడు సంప్రదించాడు. తనపై నమోదైన క్రిమినల్ కేసును మారుస్తూ లోక్ అదాలత్‌లో ఫిర్యాదుదారుడితో రాజీ కుదుర్చాలని కోరాడు.దీంతో తనకు రూ. 25వేలు లంచం ఇవ్వాలని ఏఎస్ఐ బాలయ్య నిందితునికి తేల్చిచెప్పాడు. అయితే రూ. 15వేలు ఇచ్చేలా ఏఎస్ఐ, నిందితుడు ఒప్పందం చేసుకున్నారు. లంచం మొత్తాల కోసం ఏఎస్ఐ వేధింపులకు గురిచేయడంతో సదరు నిందితుడు ఏసీబీ అధికారులకు ఫిర్యాదు చేశాడు. రంగంలోకి దిగిన ఏసీబీ అధికారులు నిందితుని నంచి రూ. 15 వేలు లంచం తీసుకుంటున్న ఏఎస్ఐ బాలయ్యను రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. అనంతరం ఏఎస్ఐ బాలయ్య చేతికి కెమికల్ పరీక్షలు నిర్వహించిన ఏసీబీ అధికారులు అతన్ని అరెస్ట్ చేసి నాంపల్లి ఏసీబీ కోర్టులో హాజరుపరిచారు.

**ఓయూలో ఇద్దరు :**

నగరంలోని ఉస్మానియా యూనివర్సిటీలో పే బిల్ సెక్షన్‌లో పనిచేస్తున్న సీనియర్, జూనియర్ అసిస్టెంట్లను ఏసీబీ అధికారులు పట్టుకున్నారు. ఈక్రమంలో బాధితుడి తల్లికి చెందిన రిటైర్‌మెంట్‌కు సంబంధించిన బెనిఫిట్స్ కోసం చేసుకున్న దరఖాస్తును ఉన్నతాధికారులను పంపించాలని పే బిల్ సెక్షన్ సీనియర్ అసిస్టెంట్ అరవింద్, జూనియర్ అసిస్టెంట్ కె. రమేశ్‌ను సంప్రదించాడు. ఫైల్‌ను పై అధికారులకు పంపేందుకు జూనియర్ అసిస్టెంట్ రూ,15వేలు లంచం డిమాండ్ చేశారు. దీంతో బాధితుడు నేరుగా ఏసీబీ అధికారులను ఆశ్రయించి వారికి ఫిర్యాదు చేశాడు. కాగా రూ. 15వేల లంచం మొత్తాలలో తొలివిడతగా రూ. 13వేలు లంచం తీసుకుంటుండగా జూనియర్ అసిస్టెంట్ రమేశ్‌ను ఏసీబీ అధికారులు వలపన్ని పట్టుకున్నారు. విచారణలో లంచం మొత్తాలను సీనియర్ అసిస్టెంట్ ప్రోద్భలంతోనే జూనియర్ అసిస్టెంట్ తీసుకున్నట్లు తేలడంతో ఇద్దరినీ అరెస్ట్ చేసి ఏసీబీ కోర్టులో హాజరు పరిచారు.

# మేము మావో'యిస్టులం'

## జాగృతి పార్టీలో మావోలకు చోటు

## బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు,మాజీలు టచ్‌లో ఉన్నరు

## సమయం వచ్చినప్పుడు ప్రకటిస్త

## జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత



హైదరాబాద్,ఏప్రిల్ 1(మనం,ప్రత్యేక ప్రతినిధి): మావోయిస్టులంటే తమకు ఎంతో అభిమానమని, వారి అజెండా మా అజెండా ఒక్కటేనని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత స్పష్టం చేశారు. ఈక్రమంలో బుధవారం మీడియా సమావేశం అనంతరం మీడియా ప్రతినిధులతో చిట్ చాట్ చేశారు. అనతికాలంలో ఆరంభమయ్యే జాగృతి పార్టీలోకి మావోయిస్టులు కూడా వస్తారని.. వారిది తమది ఒకే ఎజెండా అని వెల్లడించారు. కల్వకుర్తి నియోజకవర్గంలో కుర్మిద్దలో పెద్ద భూస్వాముల భూములు వదిలి పేద గిరిజనుల భూములు టీజీఐఐసీ గుంజుకుంటున్నదని త్వరలో వారికోసం పోరాటం చేస్తామని చెప్పారు. పార్టీ ఆవిర్భావానికి ముందు ఉమా భారతి సహా ఇతర పెద్దలను కలిసి ఆశీర్వాదం తీసుకుంటామన్నారు.అసెంబ్లీలో అధికార ప్రతిపక్షాలు తిట్టుకోవడానికే సమయం సరిపోయిందన్నారు. ఒకరి అవినీతిని ఒకరు బయటపెట్టుకున్నారని ఆరోపించారు. అలాగే.. బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలు తనతో టచ్‌లో టచ్లో ఉన్నారని.. సమయం వచ్చినప్పుడు వారి పేర్లు ప్రకటిస్తానని చెప్పారు. సీఎం తాను రాముడిని అని.. మాజీ సీఎం కేసీఆర్ రావణుడు అని అంటున్నారని.. అయితే శకుని ఎవరు అని ప్రశ్నించారు. మహిళా రిజర్వేషన్లలో బీసీ మహిళలకు సబ్ కోటా ఇవ్వాలని పోరాటం చేస్తామని తెలిపారు.

**యువతకు ఉద్యోగాలు :**

గ్రూప్ -1 తరహాలో డిగ్రీ కాలేజీ లెక్చరర్ పోస్టులను తమవారికి కట్టబెట్టడానికి కుట్రలు చేస్తున్నారని కవిత ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో యువతకు ఉద్యోగాలు దక్కకుండా జీవోల పేరుతో అడ్డంకులు సృష్టిస్తున్నారని మండిపడ్డారు. డిగ్రీ లెక్చరర్ల పోస్టుల కోసం వేసిన నోటిఫికేషన్కు జీవో నంబర్ 4 అడ్డుగా తెచ్చారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ జీవోను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు.దాదాపు 40 లక్షల కుటుంబాల్లో విద్యార్థులు పోటీ పరీక్షలకు ప్రిపేర్ అవుతుంటే సర్కారు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నదన్నారు.

**రేషన్ కార్డులు తొలగించొద్దు :**

రాష్ట్రంలో రేషన్ కార్డులను తొలగిస్తున్నారన్న ప్రచారంపై తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత స్పందించారు. ఈక్రమంలో సర్కార్ రేషన్ కార్డుల ఏరివేత నిలిపివేయాలని డిమాండ్ చేశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం పేద ప్రజలకు రేషన్ కార్డులు ఇవ్వలేదని ఎద్దేవ చేశారు. అయితే కాంగ్రెస్ ప్రభుత్వం అధికారం వచ్చిన రెండున్నరేళ్లలో ఒకవైపు 5 లక్షల రేషన్ కార్డులు ఇచ్చామని చెబుతూ మరోవైపు ఐటీ రిటరన్స్ ఫైల్ చేయడం, ప్రైవేట్ ఉద్యోగాలు చేయడం వంటి కారణాలతో కార్డులు తీసేయడం సబబుకాదన్నారు. పేదలకు ఉపయోగపడే రేషన్ కార్డుల విషయంలో ఇలాంటి చర్యలు మానుకోవాలని హితవు పలికారు.

**కొండగట్టు ప్రమాదంపై :**

కొండగట్టు చలువ పందిళ్ల ప్రమాదంపైనా కవిత స్పందించారు. పనుల్లో తీవ్ర నిర్లక్ష్యం కనిపిస్తోందన్నారు. కొండగట్టు అంజన్న ఆలయంలో చలువ పందిళ్లు కూలి 15 మంది గాయపడడంపై విచారం వ్యక్తం చేశారు. హనుమాన్ చిన్న జయంతి వేడుకల కోసం నాసిరకం పందిళ్లు వేయడంతోనే ప్రమాదం జరిగిందని కవిత ఆరోపించారు. ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లే ఉత్సవాల సమయంలో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని ఆగ్రహించారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా పకడ్బందీ చర్యలు తీసుకోవాలని కవిత డిమాండ్ చేశారు. గాయపడిన భక్తులకు మెరుగైన వైద్య చికిత్స అందించాలన్నారు. ఘటనపై విచారణ జరిపి బాధ్యులపై వెంటనే కఠిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు కవిత.

# మొయినాబాద్ 'డ్రగ్స్' కేసులో సిట్ దూకుడు

## నిందితులను ప్రశ్నించిన ఫ్యూచర్ సిటీ సీపీ

హైదరాబాద్,ఏప్రిల్ 1(మనం,ప్రత్యేక ప్రతినిధి): మొయినాబాద్ డ్రగ్స్ కేసులో సిట్ అధికారులు దూకుడు పెంచారు. ఈ కేసులో నిందితులైన మాజీ ఎమ్మెల్యే రోహిత్ రెడ్డి , రితేష్ రెడ్డి, నమిత్ శర్మలలపై ఫ్యూచర్ సిటీ కమిషనర్ సుధీర్‌బాబు ప్రశ్నల వర్షం కురిపించారు. మొయినాబాద్ డ్రగ్స్ కేసులో నిందితులను ఐదు రోజుల పాటు కస్టడీ కోరడంతో కోర్టు మూడు రోజుల పాటు కస్టడీకి అనుమతించింది. దీంతో నిందితులను చంచల్ గూడ జైలు నుంచి పటిష్ట బందోబస్తు మధ్య శంషాబాద్ రూరల్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అనంతరం సిట్ బృందం విచారణ అధికారి చేవెళ్ల బీసీపీ యోగేష్ గౌతమ్, షాద్ నగర్ డీసీపీ శిరీష తోపాటు ఈగల్ టీం ఏసీపీ నిందితులను ప్రశ్నించారు. అలాగే ఫ్యూచర్ సిటీ కమిషనర్ సుధీర్ బాబు సైతం నిందితులకు డ్రగ్స్ ఎలా వచ్చాయి..? ఎన్నిసార్లు తీసుకున్నారు..? పార్టీలో గతంలో ఎక్కడెక్కడ నిర్వహించారన్న అంశాలపై ప్రశ్నించారు. ఈ కేసులో డ్రగ్స్ మూలాలను గుర్తించేందుకు గురు, శుక్రవారాలలో కూడా విచారణ జరపనున్నామని సిట్ పోలీసులు తెలిపారు.

# హెచ్‌సీఏలో భారీ స్కాం?

- గత 20 ఏళ్లుగా నిధుల దుర్వినియోగం
- 600 కోట్లు అక్రమాలు
- తెలంగాణ క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి, గురువారెడ్డి

హైదరాబాద్, మనం ప్రతినిధి: హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్‌పై తెలంగాణ క్రికెట్ అసోసియేషన్(టీసీఏ) కార్యదర్శి గురువారెడ్డి సంచలన ఆరోపణలు చేశారు. హెచ్‌సీఏలో అక్రమాలు జరుగుతున్నాయంటూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, డీజీపీ, సీఐడీ చీఫ్‌లకు ఆయన ఫిర్యాదు చేశారు. హెచ్‌సీఏలో 20 ఏళ్లుగా నిధుల దుర్వినియోగం జరుగుతోందని ఆరోపించారు.

అయితే, ఇప్పటి వరకు రూ.600 కోట్లకు పైగా అక్రమాలు జరిగాయని పేర్కొన్నారు. ఇదిలా ఉంటే, విశాఖ ఇండస్ట్రీస్‌కు రూ.69 కోట్లు బదిలీ కావడం కూడా అక్రమాల్లో భాగమేనని అన్నారు. ఐపీఎల్ టిక్కెట్లను బ్లాక్‌లో విక్రయిస్తున్నారని, దీనిని నిలిపివేయాలని డిమాండ్ చేశారు. మున్సిపల్ ఆస్తులైన క్లబ్బులను ప్రైవేటు వ్యక్తులకు బదిలీ చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇలాంటి అక్రమార్కులపై వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

# కేసీఆర్ గురించి కడియం తప్పుగా మాట్లాడారు: పాడి కౌశిక్ రెడ్డి




హైదరాబాద్, మనం ప్రతినిధి: ఇక అంతా ముగిసింది అనుకుంటున్న సమయంలో తనను చేరదీసి రాజకీయ భిక్షతో అన్నంపెట్టిన కేసీఆర్ గురించి కడియం శ్రీహరి తప్పుగా మాట్లాడారని హుజూరాబాద్ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ నాయకుడు పాడి కౌశిక్ రెడ్డి అన్నారు. సిట్టింగ్ ఎమ్మెల్యేను కాదని ఆయనకు టిక్కెట్ ఇచ్చారని కౌశిక్ రెడ్డి గుర్తు చేశారు. బీఆర్ఎస్ పార్టీ గుర్తుపై గత ఎన్నికల్లో పోటీ చేసిన కడియం శ్రీహరిని తాము మీరు ఏ పార్టీలో ఉన్నారని సభలో అడిగితే తప్పేమిటని ప్రశ్నించారు.

సభలో ఆయన కాంగ్రెస్ ప్రజాప్రతినిధుల వద్ద కూర్చున్నారని, అందుకే అడిగామని ఆయన వెల్లడించారు. అసలు ఆయన ఏ పార్టీ పక్షాన మాట్లాడుతున్నారో చెప్పాలని నిలదీశారు. ఈ మేరకు తెలంగాణ భవన్‌లో ఏర్పాటుచేసిన సమావేశంలో పాడి కౌశిక్ రెడ్డి మీడియాతో మాట్లాడుతూ..., తెలంగాణలో జరిగే మైనింగ్ కుంభకోణాన్ని హరీశ్ రావు అసెంబ్లీలో ఆధారాలతో సహా బయటపెట్టారని అన్నారు. మైనింగ్ స్కాం మీద హౌస్ కమిటీ వేయాలని డిమాండ్ చేశారు. పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. తెలంగాణ ప్రజల పక్షాన నిలబడినందుకు కాంగ్రెస్ ఎమ్మెల్యేలు అందరూ తనను టార్గెట్ చేశారని ఆవేదన వ్యక్తం చేశారు.

# రాజకీయ లబ్ధికి ప్రజలను రెచ్చగొడుతోంది

## కాంగ్రెస్ పార్టీపై ప్రధాని నరేంద్ర మోడీ ధ్వజం



థరద్, ఏప్రిల్ 1: పశ్చిమాసియాలో యుద్ధం వల్ల తలెత్తిన సంక్షోభ పరిస్థితులను వాడుకుని రాజకీయ లబ్ధి పొందేందుకు కాంగ్రెస్ పార్టీ యత్నిస్తోందని ప్రధాని నరేంద్రమోడీ విమర్శించారు. ప్రజల్లో భయాందోళనలు సృష్టించి పెట్రోల్ పంపుల వద్ద బారులుతీరి నిలబడేలా చేసి శాంతి భద్రతలకు విఘాతం కలిగించాలని చూస్తోందని విమర్శించారు. దేశమంతా ఐక్యంగా నిలవాల్సిన సమయంలో కాంగ్రెస్ నేతలు విభజన రాజకీయాల్లో నిమగ్నమయ్యారని, రాజకీయ రాబందుల్లా కాచుకుని ఉన్నారని తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. గుజరాత్‌లోని థరాద్ జిల్లాలో నిర్వహించిన సభలో ప్రధాని నరేంద్ర మోడీ ప్రసంగించారు. భారత్ ఎలాంటి సంక్షోభాన్ని అయినా ఎదుర్కోగలదని ధీమా వ్యక్తం చేశారు. 'యుద్ధంతో యావత్ ప్రపంచం సతమతమవుతోంది. అస్థిరత నెలకొంది. ఇంధన ధరలు పెరుగుతున్నాయి. ఇటువంటి పరిస్థితుల్లో దృఢమైన విదేశాంగ విధానం, ప్రజల ఐక్యతతో భారత్ సమర్థంగా వ్యవహరించింది' అని ప్రధాని మోడీ తెలిపారు. పశ్చిమాసియా ఉద్రిక్తతల కారణంగా ప్రపంచవ్యాప్తంగా ఇంధన ధరలు పెరిగినప్పటికీ ఆ ప్రభావం ప్రజలపై పడకుండా చూసేందుకు తమ ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటోందన్నారు.

# కొత్త ఆర్థిక సంవత్సరంలో ఆంధ్రప్రదేశ్ పర్యాటకాభివృద్ధికి కీలక అడుగులు



అమరావతి/న్యూఢిల్లీ,(మనం ప్రత్యేక ప్రతినిధి): కొత్త ఆర్థిక సంవత్సరం ప్రారంభం వేళ ఆంధ్రప్రదేశ్ పర్యాటక రంగాన్ని అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్లే లక్ష్యంతో రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రివర్యులు కందుల దుర్గేష్ నేడు హస్తిన పర్యటనకు బయలుదేరి వెళ్తున్నారు. రేపు (గురువారం) ఉదయం 9 గంటలకు కేంద్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్ తో భేటీ అయి పెండింగ్ లో ఉన్న కీలక పర్యాటక, సాంస్కృతిక ప్రాజెక్టుల ఆమోదానికి విజ్ఞప్తి చేయనున్నారు. అదే క్రమంలో రాష్ట్రంలో ఐకానిక్ పర్యాటక కేంద్రాలు, ఆధ్యాత్మిక సర్క్యూట్ల బలోపేతం కోసం మొత్తం రూ. 915 కోట్ల విలువైన 9 కొత్త ప్రతిపాదనలను కేంద్రానికి సమర్పించనున్నారు.

**పెండింగ్ ప్రాజెక్టుల సాధనకు కృషి:**

గతంలో మంత్రి కందుల దుర్గేష్ చేసిన కృషి ఫలితంగా శాస్కి, ప్రసాద్, స్వదేశీ దర్శన్, సిబిడిడి వంటి పథకాల కింద రాష్ట్రానికి ఇప్పటికే 8 పర్యాటక ప్రాజెక్టుల రూపంలో రూ. 430 కోట్లు కేంద్రం ద్వారా కేటాయించబడ్డాయి. ప్రస్తుతం పట్టాలెక్కిన ఈ పనుల పురోగతిని కేంద్ర మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్ కి వివరించడంతో పాటు, నిధుల విడుదల ప్రక్రియను వేగవంతం చేయాలని మంత్రి దుర్గేష్ కోరనున్నారు.


# శ్రీ సీతారాములకు తిరుమల శ్రీవారి దివ్య కానుకలు

- మూలవర్లకు స్వర్ణ ముఖ పట్టి బహూకరణ



ఒంటిమిట్ట / తిరుపతి,ఏప్రిల్ 01, మనం న్యూస్: కడప జిల్లా ఒంటిమిట్ట శ్రీ కోదండరామయ్య కల్యాణం సందర్భంగా తిరుమల నుంచి శ్రీ వేంకటేశ్వర స్వామివారు బుధవారం కానుకలు పంపారు . కోదండరామస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం రాత్రి కన్నుల పండువగా శ్రీ సీతారాముల కల్యాణం నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. ఈ శుభ సందర్భంగా మూలవర్లకు అలంకరించేందుకు ఒక కేజి బరువు గల స్వర్ణ ముఖ పట్టి, 2కేజిల బరువు గల వెండి బింది కానుకగా అందించారు. టీటీడీ అనుబంధ ఆలయాల్లో బ్రహ్మోత్సవాల సందర్భంగా తిరుమల శ్రీవారి ఆలయం నుండి కానుకలు పంపడం ఆనవాయితీగా వస్తోంది. ఇందులో భాగంగానే బుధవారం ఈ ఆభరణాలు సమర్పించారు. ఆలయం ముందు టీటీడీ చైర్మన్ బీ.ఆర్ నాయుడు ఆభరణాలకు పూజలు చేసి కోదండరామునికి అందజేశారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఈవో సిహెచ్ వెంకయ్య చౌదరి, జేఈవో వీరబ్రహ్మం, జేఈవో శరత్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# భక్తి, భవ్యం, ఆనందం-సీతారాముల కళ్యాణం



- రామనామ స్మరణతో మార్మోగిన ఏకశిలా నగరం
- వేలాదిగా హాజరైన భక్తులు
- భక్తులందరికి తిరుమల శ్రీవారి లడ్డు ప్రసాదం, ముత్యంతో కూడిన తలంబ్రాల పంపిణీ

ఒంటిమిట్ట / తిరుపతి,ఏప్రిల్ 01, మనం న్యూస్: కడప జిల్లా ఒంటిమిట్ట శ్రీ కోదండరాముడి బ్రహ్మోత్సవాల సందర్భంగా బుధవారం సాయంత్రం శ్రీ సీతారాముల కల్యాణం అంగరంగ వైభవంగా జరిగింది. వేలాదిగా హాజరైన భక్తులు స్వామివారి కల్యాణోత్సవాన్ని తన్మయత్వంతో తిలకించారు. రాములవారి కల్యాణానికి సంబంధించి సీతమ్మవారి కోరికను శాస్త్రరీత్యా తెలిపే కాంతకోరిక కార్యక్రమాన్ని 6 గంటలకు వేదిక మీద అర్చకులు నిర్వహించారు. సాయంత్రం 6.30 గంటలకు ఎదుర్కోలు ఉత్సవం నిర్వహించారు. రాత్రి 7 గంటలకు శ్రీ సీతారాముల కల్యాణం ప్రారంభమైంది. ముందుగా భగవత్ విజ్ఞాపనం, సభ అనుజ్ఞ, లోకకల్యాణం కోసం సంకల్పం చేయించారు. కల్యాణంలోని పదార్థాలన్నీ భగవంతుని మయం చేసేందుకు పుణ్యాహవచనం నిర్వహించారు. ఆ తరువాత రక్షాబంధనం, యజ్ఞోపవీతధారణ, వరప్రేశనం(కన్యావరణం), మధుపర్కార్చనం చేశారు. మహాసంకల్పం అనంతరం కన్యాదానం చేసి సీతారామచంద్రుల ప్రవరలను చదివారు. స్వామి నివేదన, వేదస్వస్తి, మహదాశీర్వచనంతో కల్యాణఘట్టం పూర్తయింది. శ్రీవేంకటేశ్వర భక్తి ఛానల్లో శ్రీ సీతారాముల కల్యాణాన్ని ప్రత్యక్ష ప్రసారం చేశారు.

**భక్తులందరికి తిరుమల శ్రీవారి లడ్డు ప్రసాదం, ముత్యంతో కూడిన తలంబ్రాల పంపిణీ :**

కల్యాణవేదిక ప్రాంగణంలో ఏర్పాటు చేసిన గ్యాలరీల్లో కూర్చుని శ్రీ సీతారాముల కల్యాణాన్ని తిలకించేందుకు విచ్చేసిన భక్తులందరికి శ్రీవారి సేవకులు తిరుమల శ్రీవారి లడ్డు ప్రసాదం, ముత్యంతో కూడిన తలంబ్రాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టీటీడీ చైర్మన్ బీ.ఆర్ నాయుడు, అదనపు ఈవో సి.హెచ్ వెంకయ్య చౌదరి, జేఈవో వీరబ్రహ్మం, జిల్లా కలెక్టర్ డాక్టర్ చెరుకూరి శ్రీధర్, జిల్లా ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్, జేఈవో శరత్ తదితరులు పాల్గొన్నారు.

# కాంబోడియా ముఠా గుట్టురట్టు

## ఐదుగురు సైబర్ నిందితుల అరెస్ట్

## సైబర్ సెక్యూరిటీ డైరెక్టర్ శిఖా గోయల్ వెల్లడి



హైదరాబాద్,ఏప్రిల్ 1(మనం,ప్రత్యేక ప్రతినిధి): అంతర్జాతీయ సైబర్ నేరగాళ్ల ముఠా ఆటకట్టించినట్లు సైబర్ సెక్యూరిటీ బ్యూరో డైరెక్టర్ శిఖా గోయల్ వెల్లడించారు. కాంబోడియా కేంద్రంగా సాగుతున్న సైబర్ ముఠాకు సిమ్ కార్డులు సరఫరా చేస్తున్న ఐదుగురు నిందితులను అరెస్ట్ చేసినట్లు ఆమె పేర్కొన్నారు. అరెస్టయిన వారిలో ఉత్తరప్రదేశ్‌కు చెందిన రిజ్వాన్, హైదరాబాద్‌కు చెందిన సయ్యద్ అష్రఫ్ అలీ, సయ్యద్ సోహైల్, అతీక్ అహ్మద్‌తో పాటు హన్మకొండలోని ఎయిర్టెల్ డిస్ట్రిబ్యూషన్ పాయింట్ టీమ్ లీడర్ నూనె అశోక్ ఉన్నట్లు వివరించారు. గత నెల 31వ తేదీన శంషాబాద్ విమానాశ్రయం నుంచి 198 భారతీయ సిమ్ కార్డులతో కాంబోడియాకు వెళ్లేందుకు ప్రయత్నిస్తున్న అష్రఫ్ అలీని ఇమ్మిగ్రేషన్ అధికారులు అదుపులోకి తీసుకోవడంతో విషయం వెలుగులోకి వచ్చిందన్నారు. ఈ ముఠా కార్యకలాపాలపై లోతుగా దర్యాప్తు చేయగా 2023 నుంచి ఇప్పటివరకు ఆరు వేర్వేరు విడతల్లో సుమారు 600కు పైగా సిమ్ కార్డులను అక్రమంగా విదేశాలకు తరలించినట్లు తేలిందన్నారు. ఈ కేసులో నిందితుడు అష్రఫ్ 2023లో దుబాయ్‌లో హోటల్ పనిచేస్తున్న సమయంలో, అక్కడ గేమింగ్ కాల్ సెంటర్లో పనిచేస్తున్న రిజ్వాన్‌తో పరిచయం ఏర్పడిందని, భారతీయ సిమ్ కార్డులు సరఫరా చేస్తే భారీగా డబ్బు ఇస్తామని అతను ఆశ చూపినట్లు తేలిందన్నారు. అష్రఫ్ స్థానిక పాయింట్ ఆఫ్ సేల్ ఏజెంట్ల సహాయంతో అమాయకుల వ్యక్తిగత పత్రాలను ఉపయోగించి సిమ్ కార్డులను అందించినట్లు విచారణలో వెల్లడైందన్నారు.

**నకిలీ పత్రాలతో :**

సైబర్ నేరగాళ్ల ముఠాలో కీలక నిందితుడు సోహైల్ జియోలో ప్రమోటర్‌గా, అతీక్, అశోక్ ఎయిర్టెల్ ఏజెంట్లుగా ఉంటూ తమకున్న అధికారంతో నకిలీ పత్రాల ద్వారా ఈ కార్డులను యాక్టివేట్ చేసి సరఫరా చేస్తున్నారని శిఖా గోయల్ స్పష్టం చేశారు. అక్రమ సిమ్ కార్డులను కాంబోడియాలోని నేరగాళ్లు ఫిషింగ్, గుర్తింపు దొంగతనం, బెదిరింపులు వంటి నేరాలకు వాడుతూ భారతీయ పౌరులకు భారీ నష్టాన్ని కలిగిస్తున్నారన్నారు. ఈ వ్యవహారంలో కొరియర్‌గా వ్యవహరిస్తున్న అరవింద్ కుమార్ అలియాస్ షాహిద్ పరారీలో ఉన్నారని, అతనితో పాటు విదేశాల నుంచి ఈ నెట్‌వర్క్ నడిపిస్తున్న కీలక నిందితుడిని పట్టుకునేందుకు దర్యాప్తు కొనసాగుతోందని తెలిపారు. నిందితులపై ఐటీ చట్టంతో పాటు భారతీయ న్యాయ సంహిత మరియు టెలికమ్యూనికేషన్ చట్టం కింద కేసులు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

## ముగింపెప్పుడో?

యజ్ఞయాగాదులకు అగ్ని
రెండు కర్రల రాపిడి-అరణి
ఒకరిది అహంకారం

మరొకరిది ఆత్మగౌరవాల
పరస్పర ద్వేషభావాగ్నితో
భీకర యుద్ధ మారణహోమాగ్ని
పొగలేని పొయ్యికి
అందని చమురు

ఫలితంగా...
పలకరించే నాధులు లేక
ఒంటరితనంతో కుమిలిపోతున్న
పొగలేని పొయ్యిలు.

వాడెవడివో దుందుడుకు చర్యలు
ప్రపంచానికే భరించారాని వెతలు

ప్రపంచానికే తాను రాజనుకొంటున్న
వాడి తెంపరితనానికి ముగింపెప్పుడో?

- వేమూరి శ్రీనివాస్
9912128967

ఎడిట్ పేజీ కోసం మీ సామాజిక విశ్లేషణలు, సాహిత్య వ్యాసాలు manamlekhalu@gmail.com మెయిల్ అడ్రస్‌కు పంపగలరు.

ఈ పేపర్ కోసం https://www.manamepaper.com/ వెబ్‌సైట్‌లో చూడండి

- ఎడిటర్



# సేవానిరతికి మారు పేరు మారుతి

హైందవ సంస్కృతిలో పెక్కు పండగలున్నాయి. అవి రుతుపర, మత ప్రమేయ, పురాణేతిహాస సంబంధమైనవి. అందు అసమాన భక్తాగ్రేసరుడు, ఆదర్శపురుషుడు, నమ్మినబంటు, సంస్కృతాద్యనేక భాషలు, వ్యాకరణాది శాస్త్రాలు, సంగీతాది కళలలో నిష్ణాతుడయిన హనుమంతుని జయంతి నేడు. 'అశ్వథామ బలిర్వ్యాస.. హనుమాన్శ్చ విభీషణ.. కృప పరశురామశ్చ సప్తేతే చిరజీవిన..మార్కండేయస్తు అష్టమప్రోక్త'.. అశ్వత్థామ, బలి చక్రవర్తి, వ్యాసుడు, హనుమంతుడు, విభీషణుడు, కృపాచార్యుడు, పరశురాముడు, మార్కండేయుడు తదితరులను చిరంజీవులుగా భావిస్తారు.

ఒక కల్పం అంటే నాలుగు వందల ముప్పయి రెండు మిలియన్ల సంవత్సరాలు జీవించే ఎనిమిది మంది చిరంజీవులలో ఒకరైన హనుమంతుని జయంతి ప్రత్యేకత కలిగి ఉంది. భారతావనిలో వివిధ ప్రాంతాలలో హన్మాన్ జయంతిని వివిధ మాసాలలో జరుపు కుంటారు. ఆంజనేయుడు, హనుమంతుడు, హనుమాన్, బజరంగబలి, మారుతి, అంజనిసుతుడు వంటి ఎన్నో పేర్లతో హనుమంతుని ఆరాధిస్తారు. ఉత్తర భారత దేశంలో వారణాసిలో సంకట మోచన దేవాలయం, అయోధ్యలో హన్మాన్ గార్హి దేవాలయాలలో ఈ పర్వదిన వేడుకలను ఘనంగా నిర్వహిస్తారు. తమిళనాడు, కేరళ రాష్ట్రాలలో 'మార్గళి'మాసం అనగా డిసెంబర్ లేదా జనవరిలలో జరుపుకుంటారు.

ఒరియా క్యాలెండర్ ప్రకారం విషుభ సంక్రాం తి మొదటి రోజున వైశాఖంలో పాటించే ఆచారం ఉంది. అలాగే తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్నాటకల లో వైశాఖ కృష్ణపక్ష మందు పెద్ద హన్మాన్ జయంతిగా జరుపుకునే సాంప్రదాయం ఉంది. చైత్ర పౌర్ణమి (చిన్న హన్మాన్ జయంతి)తో ప్రారంభించి, హన్మాన్ దీక్షలను వైశాఖ కృష్ణపక్ష దశమి (పెద్ద హన్మాన్ జయంతి)కి ముగిసేలా 41రోజుల మండల దీక్షలను చేపట్టడం ఆనవాయితీగా, సాంప్రదాయ సిద్దంగా వస్తున్నది.

ప్రధానంగా రామాయణంలో హనుమం తుని పాత్ర అద్వితీయం. రామాయణంలోని ఆరు కాండల్లోని చివరి మూడు కాండల్లో కథ నడిచిన మహనీయుడు హనుమంతుడు. హనుమంతుని స్తుతించే హనుమత్కవచాన్ని ఆంజనేయాలయంలో లక్ష ఇరవై అయిదు సార్లు పఠించిన వారికి గాలిలో ఎగిరే శక్తి, అణిమాద్యష్టసిద్ధులు లభ్య మవుతాయని నమ్మకం. ప్రేతపతి అయిన శివునికి ఎంత భూతాల మీద ఆధిపత్యం ఉందో హనుమంతునికి అట్టిది కలదని భావిస్తారు.

పంచభూతాలను వశం చేసుకున్న పరమాత్ముడు అయన. జ్ఞానేంద్రియాలను నియంత్రణలో ఉంచుకోగలిగిన మహాశక్తిశాలి. అందుకే గ్రహపీడకు ఆంజనేయుని కొలుస్తారు. ఉన్మాద రోగాలకు ఆంజనేయ ప్రదక్షిణలు చేస్తారు. చిన్న పిల్లలకు ఆంజనేయ బొమ్మ చెక్కిన యంత్రపు బిళ్ళలను మెడలో కడుతారు. పిల్లలు, పెద్దలు ఆపత్సమయాలలో, భయం కలిగే వేళలలో ఆంజనేయ దండకం చదు వడం చిరకాలంగా అనుసరిస్తున్న సంప్రదా యం. శివాజీ గురువైన సమర్థ రామదాసు హనుమంతుని భక్తుడు కాగా, మహారాష్ట్రుల జెండా మీద గదాపాణియైన హనుమంతుడు ఉంటారు. పాండవ మధ్యముడైన అర్జునుని జెండాపై ఉపవిష్ణుడై హనుమంతుడు మహాభారత యుద్ధంలో అర్జునునికి రక్షణగా ఉన్న గాధ అందరికీ తెలిసిందే.

హనుమంతుడికి స్వర్గ ప్రాప్తి లభించినా, పవన సుతుడు అందుకు అంగీకరించక, తాను భూమిపైనే రాముడి భక్తుడిగా కలకాలం ఉండిపోతానని కోరుకుంటాడు. అందుకు శ్రీ రాముడు కూడా ఒప్పుకుంటాడు. ఈ కారణంగానే భూమిపై రాముడిని ఇప్పటికీ భజనలు, కీర్తనలతో కొలుస్తున్నారు.

ఆజన్మ బ్రహ్మ చారిగా ఉన్న ఆంజనేయుడు, అవతార పురుషుడు అయిన శ్రీ రాముడినే తన హృదయంలో బంధించి భక్తిలో ఎవరికీ సాటి లేదని చాటాడు. హనుమంతుడు సీతా రాముల దాసునిగా, రామ భక్తునిగా, విజయ ప్రదాతగా, రక్షకునిగా హిందూ మతములో అత్యంత భక్తి శ్రద్ధలతో కొలువబడే దైవంగా నిత్య పూజలు అందుకుంటున్నాడు. ప్రతి గ్రామానికీ ఆయన క్షేత్ర పాలకుడు. అంటే గ్రామ రక్షకుడు.

భగవద్దాసులలో సాటిలేని ఆంజనే యుని పూజకు ఉద్దిష్టమైన చైత్ర పూర్ణిమతోపాటు, వైశాఖ బహుళ దశమి నాడు కూడా ప్రత్యేక అర్చనలు, పూజాదులు నిర్వహించడం సదాచార సాంప్రదాయంగా వస్తున్నది.

రావణుని బారి నుండి శనిని ఆంజనేయుడు కాపాడుతాడు. అందుకు రుణపడిన శనీశ్వరుడు.. హనుమంతుడిని సేవించేందుకు ఉద్యుక్తుడవుతాడు. అయితే తన భక్తులకు శని ప్రభావం లేకుండా చూడాలని శనీశ్వరుడిని హనుమ అడుగుతాడు. అప్పటి నుంచి హనుమంతుడిని కొలిచేవారిపై శని చెడు ప్రభావం ఉండదనే విశ్వాసంతో, శని దేవుని పూజించేవారు తప్పనిసరిగా అంజన్నను కొలుస్తారు. అంతేకాదు హనుమాన్ చాలీసా రోజూ పఠిస్తే శని చెడు ప్రభావం సోకదని భక్తుల ప్రగాఢ విశ్వాసం.

- రామకిష్టయ్య సంగనభట్ల
9440595494

# శిక్షలు కేవలం ప్రజలకేనా?



భారత రాజ్యాంగం కల్పించిన భావ ప్రకటన స్వేచ్ఛ నేడు ఒక సంధి కాలంలో ఉంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల తీరును విమర్శిస్తేనో, సోషల్ మీడియాలో పోస్టులు పెడితేనో చట్టపరమైన చర్యలు, అరెస్టులు వెనువెంతనే జరిగిపోతున్నాయి. కానీ, అదే రాజ్యాంగం పౌరులకు ఇచ్చిన హామీలు నెరవేరనప్పుడు, ఎన్నికల వేళ రాజకీయ నేతలు గుప్పించిన 'తప్పుడు వాగ్దానాల' మాటేమిటి? ప్రభుత్వాలపై విమర్శలు చేసేవారిని దోషులుగా నిలబెట్టే చట్టాలు ఉన్నప్పుడు.. అబద్ధపు హామీలతో ప్రజలను వంచించే పాలకులపై చర్యలు తీసుకునే చట్టాల అవసరం లేదా? అన్న ప్రశ్న ఇప్పుడు సమాజం నుండి బలంగా వినిపిస్తోంది.



ప్రస్తుత రాజకీయ పరిణామాలను గమనిస్తే, అధికార యంత్రాంగం తన వైఫల్యాలను కప్పిపుచ్చుకోవడానికి చట్టాలను ఒక ఆయుధంగా వాడుకుంటోందని స్పష్టమవుతోంది. ప్రజాస్వామ్యంలో ప్రభుత్వం అంటే ప్రజల సేవకుడు మాత్రమే తప్ప యజమాని కాదు. కానీ నేడు పాలకులు తమను ప్రశ్నించే ప్రతి గొంతును అణచివేయాలని చూస్తున్నారు. ఎన్నికల సమయంలో ఓట్ల కోసం వేదికలెక్కి అసాధ్యమైన హామీలను గుప్పిస్తూ, ప్రజలను నమ్మబలికి అధికారాన్ని దక్కించుకుంటున్న నాయకులు, పీఠం ఎక్కిన తర్వాత ఆ వాగ్దానాలను గాలికి వదిలేస్తున్నారు. కోట్లాది మంది నిరుద్యోగులకు ఉద్యోగాలని, పేదలకు ఇళ్లని, రైతులకు గిట్టుబాటు ధరలని చెప్పి అధికారంలోకి వచ్చిన ఎమ్మెల్యేలు, ఎంపీలు, ముఖ్యమంత్రులు లేదా ప్రధానమంత్రి తమ బాధ్యతలను విస్మరిస్తే వారిపై చట్టం ఎందుకు మౌనంగా ఉంటుంది అన్నది సామాన్యుడి వేదన. ప్రజల ఆశలను ఆసరాగా చేసుకుని తప్పుడు హామీలతో అధికారం పొందడం కూడా ఒక రకమైన మోసమే. మరి ఇలాంటి మోసాలకు పాల్పడే ప్రజాప్రతినిధులపై కేసులు నమోదు చేసే చట్టం ఏది? సామాన్యుడు ఒక సోషల్ మీడియా పోస్ట్ పెడితే క్షణాల్లో స్పందించే వ్యవస్థ, ఏళ్ల తరబడి హామీలను అమలు చేయని పాలకుల విషయంలో ఎందుకు నిర్లిప్తంగా ఉంటోంది?

దేశంలోవిమర్శించే గొంతును నొక్కే ముందు, వాగ్దానాలు నెరవేర్చని పాలకులను కూడా బోనులో నిలబెట్టే సరికొత్త సంప్రదాయం మొదలవ్వాలి. అప్పుడే అది నిజమైన ప్రజాస్వామ్యం అనిపించుకుంటుంది. ప్రభుత్వం తీసుకు వచ్చే జీవోలు లేదా చట్టాలు సమాజ హితం కోసం ఉండాలి కానీ, కేవలం అధికార పీఠాన్ని విమర్శల నుండి కాపాడుకోవడానికి ఉండకూడదు. పాలకులకు ఉండవలసిన స్వేచ్ఛ ప్రజలకు కూడా ఉండాలి. అధికారం అంటే కేవలం అణచివేత కాదు, అది ఒక పవిత్రమైన బాధ్యత. ప్రజల గొంతు నొక్కే జీవోలు తీసుకురావడం కన్నా, ప్రజల బతుకుల్లో వెలుగు నింపే వాగ్దానాలను అమలు చేయడంపై ప్రభుత్వాలు దృష్టి సారించాలి.

తప్పుడు హామీలు ఇచ్చి ప్రజలను వంచించిన పాలకులను వెంటనే శిక్షించే విధంగా, అవసరమైతే అరెస్ట్ చేసే విధంగా కఠినమైన చట్టాలను తీసుకురావాలి. అటువంటి చట్టం అమల్లోకి వచ్చిన తర్వాత మాత్రమే, ప్రభుత్వానికి వ్యతిరేకంగా దుష్ప్రచారం చేసే వారిని చట్టం ముందు దోషిగా నిలబెట్టే నైతిక హక్కు ప్రభుత్వానికి లభిస్తుంది. అప్పటివరకు చేసే అరెస్టులు కేవలం రాజకీయ కక్షసాధింపు చర్యలుగానే మిగిలిపోతాయి. ఏ ప్రభుత్వమైనా తన పట్ల వస్తున్న వ్యతిరేకతను చూసి భయపడుతోందంటే, అక్కడ ప్రజాస్వామ్య స్ఫూర్తి కొరవడినట్లే. ప్రజలు తమ సమస్యల గురించి మాట్లాడినప్పుడు అది ప్రభుత్వానికి వ్యతిరేకతగా కాకుండా, దిద్దుబాటు చర్యగా పాలకులు భావించాలి.

ఇలాంటి అణచివేత ధోరణి సమాజంలో కొనసాగితే, అది ప్రజల అసంతృప్తిని మరింత పెంచుతుంది తప్ప ఏమాత్రం తగ్గించదు. పాలకుల మీద కేసులు పెట్టే వెసులుబాటు లేని చట్టాలు ఉన్నంత కాలం, సామాన్యులపై మాత్రమే ప్రతాపం చూపే చట్టాలకు విలువేముంటుంది? ఒక సామాన్య పౌరుడు తన వేదనను వ్యక్తం చేస్తే దానిని నేరంగా పరిగణించడం భావప్రకటన స్వేచ్ఛను ఖూనీ చేయడమే. నిజానికి, ఎన్నికల మేనిఫెస్టోలకు చట్టబద్ధత కల్పించాల్సిన సమయం ఆసన్నమైంది.

హామీలు నెరవేర్చని పక్షంలో ప్రజాప్రతినిధులపై చర్యలు తీసుకునే నిబంధనలు ఉన్నప్పుడే రాజకీయం పవిత్రం అవుతుంది. ప్రజలకు ఇచ్చిన అమీని అమలు చేయడంలో వెనుకబడిన ప్రభుత్వాల పట్ల న్యాయస్థానాలు కూడా సుమోటోగా స్పందించాలి. స్వేచ్ఛ అనేది కేవలం పాలకులకే పరిమితం కాకూడదు, అది ఈ దేశంలో ఉన్న ప్రతి పౌరుడికి సమానంగా దక్కాలి. ఏదో ప్రజా సమస్య మీద ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసుకున్నప్పుడు ఇలాంటి కఠినమైన జీవోలు తీసుకురాలేదు కదా అన్న ప్రజల వాదనలో నిజం ఉంది. అధికారంలోకి రాకముందు ఒకలా, వచ్చిన తర్వాత మరొకలా ప్రవర్తించడం పాలకుల ద్వంద్వ నీతిని చాటుతోంది.

ప్రశ్నించే గొంతును అణచివేయడం ప్రజాస్వామ్యం కాదు, ప్రశ్న ఉత్పన్నం కాకుండా పరిపాలించడమే అసలైన విజయం. చట్టం ముందు అందరూ సమానమేనన్న రాజ్యాంగ స్ఫూర్తిని పాలకులు కాపాడాలి. పౌరుల హక్కులను కాలరాస్తూ, కేవలం తమ అధికార బలంతో భయానక వాతావరణాన్ని సృష్టించడం సరికాదు. రాజ్యాంగం కల్పించిన స్వేచ్ఛా వాయువులను పౌరులు పీల్చుకోనివ్వాలి. రాజకీయాల్లో జవాబుదారీతనం పెరగాలి. మొదట ప్రజా ప్రతినిధులు తమ తప్పులను సరిదిద్దు కోవాలి, తాము ఇచ్చిన ప్రతి వాగ్దానాన్ని నెరవేర్చాలి. హామీల అమలులో విఫలమైన నాయకులను చట్టం ముందు దోషులుగా నిలబెట్టిన రోజే, సామాన్య ప్రజలకు వ్యవస్థపై నమ్మకం కలుగు తుంది. అప్పటివరకు ప్రజాస్వామ్యం కేవలం మాటలకే పరిమితమవుతుంది తప్ప చేతల్లో కనిపించదు. ఇప్పటికైనా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విమర్శ లను స్వీకరించే సహనాన్ని పెంచుకుని, ప్రజల సమస్యల పరిష్కారం దిశగా, ఇచ్చిన హామీల అమలు దిశగా అడుగులు వేయాలి. ప్రజా స్వామ్య మనుగడ అనేది పాలకుల బాధ్యతాయుత ప్రవర్తనపైనే ఆధారపడి ఉంటుంది. పౌరుల గొంతుకను గౌరవించినప్పుడే దేశం పురోగ మిస్తుంది.

- వెంక గారి భూమయ్య
9848559863

# హాస్యానికి హద్దులు - విజ్ఞతకు ప్రాధాన్యత



నిత్యం సమస్యలతో సతమతమయ్యే మానవ జీవితంలో హాస్యం, చమత్కారాలు చేయడం, నవ్వడం ఒక అమృతం లాంటివి. అందుకే 'నవ్వడం ఒక భోగం, నవ్వించడం ఒక యోగం, నవ్వలేకపోవడం ఒక రోగం' అన్నారు మన పెద్దలు. ఉరుకుల పరుగుల ఆధునిక జీవనశైలిలో ఒత్తిడిని పక్కనపెట్టి అందరూ కలిసి హాయిగా నవ్వుకునే రోజుని ఒక పండుగలా జరుపుకునే రోజే 'ఏప్రిల్ ఫూల్స్ డే'. ఈ రోజున ప్రపంచవ్యాప్తంగా అబద్దాలతోనూ చిలిపి పనులతోను ఒకరినొకరు ఆటపట్టించుకుంటూ ఏకతాటిపై నిలబడి, కుల మత వర్గ విభేదాలను పక్కన పెట్టి, కేవలం 'నవ్వు' అనే భాషతో సంభాషించే రోజు ఇది. నవ్వు నాలుగు రకాల ఆరోగ్యమని మనకు తెలుసు, కానీ ఆ నవ్వును పుట్టించడానికి చేసే 'చిలిపి ప్రయత్నాలే' ఈ రోజుకు అసలైన ప్రాణం.



ఏప్రిల్ ఫూల్స్ డే ఎలా పుట్టిందనే అంశంపై భిన్న వాదనలు ఉన్నప్పటికీ 1582లో ఫ్రాన్స్‌లో జరిగిన క్యాలెండర్ మార్పు అత్యంత ప్రాచుర్యం పొందింది. మధ్యయుగంలో ఐరోపా దేశాలు జూలియస్ క్యాలెండర్ ను అనుసరించేవి. దీని ప్రకారం మార్చి 25 నుండి ఏప్రిల్ ఒకటి వరకు నూతన సంవత్సర వేడుకలు జరిగేవి. కానీ పోపు గ్రేగోరి 'గ్రెగోరియన్' క్యాలెండర్‌ను ప్రవేశపెట్టి జనవరి ఒకటిని నూతన సంవత్సరంగా ప్రకటించారు. ఆ రోజుల్లో సమాచారం లేకపోవడం వల్ల చాలామందికి ఈ మార్పు తెలియలేదు. తెలిసినా కొందరు పాత పద్ధతిని అనుసరిస్తూ ఏప్రిల్ ఒకటిన పండగ చేసుకునేవారు. అటువంటి వారిని విజ్ఞులు 'ఏప్రిల్ ఫూల్స్' అంటే 'ఏప్రిల్ మూర్ఖులు' అని పిలుస్తూ వెటకారం చేయడం ప్రారంభించారు. ఫ్రాన్సులో ఆ రోజున ఒకరి వీపుపై తెలియకుండా మరొకరు కాగితపు చేపను అంటించేవారు. దీనిని 'పొయిసన్ డి ఏప్రిల్' అంటే 'ఏప్రిల్ ఫిష్' అని పిలిచేవారు. అంటే బురిడీ కొట్టడానికి సిద్ధంగా ఉన్న అమాయకపు చేప అని అర్థం. అలాగే వసంతకాలం మరియు,ప్రాచీన సంస్కృతులు, చరిత్రకారులు ఈరోజును ప్రకృతితో కూడా ముడిపెట్టారు.

మార్చి చివరిలో లేదా ఏప్రిల్ మొదట్లో వసంతకాలం ప్రారంభం అవుతుంది. ప్రకృతి తన రంగులను మారుస్తూ కొత్త చిగుళ్ళతో కనువిందు చేస్తుంది . ఇంకా రోమన్లు 'హిలారియ' పేరుతో ప్రాచీన రోమ్‌లో 'హిలారి' అనే పండుగను మార్చి నెలాఖరులో జరుపుకునేవారు. ఇందులో ప్రజలు ముసుగులు ధరించి, వేషాలు మార్చి ఒకరినొకరు ఆట పట్టించుకొనేవారు.

అలాగే మనదేశంలో హోలీ పండుగ కూడా ఇంచుమించు ఇదే సమయంలో వస్తుంది. రంగులు చల్లు కోవడం, సరదాగా విమర్శించుకోవడం వంటివి ఇందులో భాగమే. అంటే మానవ నైజంలోనే వసంత కాలంలో ఉత్సాహంగా, వినోదభరితంగా ఉండాలనే కోరిక దాగి ఉంది. దేశాన్ని బట్టి ఈ రోజున జరుపుకునే తీరు మారుతుంది

చరిత్ర పుటల్లో అబద్ధాల వేట, మనం చెప్పుకున్న క్యాలెండర్ మార్పులతో పాటు, చరిత్రలో మరికొన్ని ఆసక్తికరమైన ఆధారాలు ఉన్నాయి. ప్రఖ్యాత ఆంగ్ల కవి 'జెఫ్రీ చాసర్' 1792లో రాసిన 'నన్ ప్రియెస్ట్ టేల్'లో మార్చి 32వ తేదీ గురించి ప్రస్తావించారు. నిజానికి మార్చిలో 32వ తేదీ ఉండదు, అది ఏప్రిల్ 1వ తేదీని సూచిస్తుందని, అప్పటి నుండే ఈ వెటకారపు సంప్రదాయం ఉందని కొందరు ప్రముఖులు చెప్తారు.

అలాగే 1572లో నెదర్లాండ్స్‌లో స్పానిష్ పాలకులపై జరిగిన తిరుగుబాటులో డచ్ వారు గెలిచారు. ఆ విజయాన్ని కూడా 'ఏప్రిల్ ఫూల్' వేడుకలతో పోలుస్తూ డచ్ వారు జరుపుకుంటారు. ఇంకా మీడియా సృష్టించిన మహా అద్భుతాలు, పత్రికలు, టెలివిజన్ ఛానళ్లు కూడా ప్రజలను బురిడీ కొట్టించడంలో తమవంతు పాత్ర పోషిస్తాయి. ఉదాహరణకు 1957లో బిబిసి ఛానల్ వారు స్విట్జర్లాండ్లో రైతులు చెట్ల నుండి 'స్పఘెట్టి' అంటే పాస్తా చెట్లనుండి పాస్తా కోస్తున్నట్లు ఒక వీడియో ప్రసారం చేశారు. అది చూసిన వేలాది మంది ప్రజలు మా ఇంట్లో కూడా అటువంటి చెట్లు ఎలా పెంచాలి అని బిబిసికి ఉత్తరాలు రాయడం గమనార్హం. 1962 ప్రాంతంలో స్వీడన్లో అప్పట్లో కేవలం బ్లాక్ అండ్ వైట్ టీవీలు ఉండేవి.

ఏప్రిల్ 1న ఒక సాంకేతిక నిపుణుడు టీవీ స్క్రీన్‌పై 'నైలాన్ స్టాకింగ్స్' (పల్చటి గుడ్డ) కప్పితే టీవీ కలర్‌ఫుల్‌గా లాగా కనిపిస్తుం దని చెప్పాడు. లక్షలాది మంది ప్రజలు తమ టీవీలపై బట్టలు కప్పి చూశారట. కానీ అలా జరగలేదు. 1998లో లెఫ్ట్ హ్యాండెడ్ వోపర్ ప్రసిద్ధ ఫుడ్ చైన్ 'బర్గర్ కింగ్ వోపర్' ఎడమ చేతి వాటం ఉన్నవారి కోసం ప్రత్యేకంగా 'లెఫ్ట్ హ్యాండెడ్ వోపర్' బర్గర్ను లాంచ్ చేస్తున్నట్లు ప్రకటించింది. వేలాది మంది దానికోసం క్యూ కట్టారు.

ఈ రోజును కేవలం ఒక తమాషాగా మాత్రమే చూడకూడదు. అలాగే వినోదం ఎప్పుడు ఇతరులకు హాని కలిగించేదిగా ఉండకూడదు ఏప్రిల్ ఫూల్స్ డే పేరుతో కొందరు చేసే అతి చేష్టలు ప్రమాదాలకు దారితీస్తుంటాయి. దీని వెనుక బలమైన సామాజిక కారణాలు ఉన్నాయి. సమాజంలో ప్రతి ఒక్కరికీ ఒక బాధ్యత, ఒక హోదా ఉంటుంది. కానీ ఏప్రిల్ 1న ఆ హోదాలను పక్కన పెట్టి బాస్-ఎంప్లాయి, టీచర్-స్టూడెంట్ అనే తేడా లేకుండా సరదాగా ఉండవచ్చు. ఇది ఒక రకమైన 'సోషల్ సేఫ్టీ వాల్వ్' లాంటిది. ఒకరిని మోసం చేయాలన్నా లేదా మనం మోసపోకుండా ఉండాలన్నా ఆ రోజు జ్ఞాపకశక్తి మరియు ఏకాగ్రతతో చాలా అప్రమత్తంగా ఉండాలి. ఇది మెదడుకు ఒక చిన్న వ్యాయామం లాంటిది.

భారతదేశంలో హోలీ పండుగలో 'బురా న మానో హోలీ హై' అంటే కోపం తెచ్చుకోకండి, ఇది హోలీ అనే నానుడి ఉంది. అదే స్ఫూర్తి ఏప్రిల్ ఫూల్స్‌డే లోనూ కనిపిస్తుంది. మన తెలుగు సాహిత్యంలోనూ 'నర్మగర్భ హాస్యం' ఉంది. తెనాలి రామలింగడి కథలు గానీ, పరమానందయ్య శిష్యుల కథలు గానీ చదివినప్పుడు కలిగే ఆనందం ఏప్రిల్ ఫూల్స్‌డే ఇచ్చే ఆనందానికి ఏమాత్రం తక్కువ కాదు.

జీవితం అంటే కేవలం గంభీరంగా ఉండటం మాత్రమే కాదు, అప్పుడప్పుడు పసిపిల్లల్లాగా మారి అల్లరి చేయడం, నవ్వుకోవడంలోనే అసలైన కిక్కు ఉంది. ఏప్రిల్ ఫూల్స్ డే మనకు ఇచ్చే సందేశం కూడా ఇదే. అబద్ధం చెప్పి అవతలి వారిని అవమానించడం మన లక్ష్యం కాకూడదు. అంటే ఒకరిని మూర్ఖుడిని చేయడం కాదు, మనలో ఉన్న అమాయకత్వాన్ని, సరదాని పంచుకోవడం. అబద్ధంలోనూ ఆనందం, అందం ఉంటుందని, వెటకారంలోనూ ప్రేమ, ఆప్యాయత ఉంటాయని నిరూపించే ఈ రోజును ఆరోగ్యకరమైన రీతిలో జరుపుకుందాం.

సమాజంలో పెరుగుతున్న అసహనాన్ని తగ్గించడానికి ఇటువంటి 'నవ్వుల పండుగలు' ఎంతో అవసరం.

ఇలా మన చిలిపి చేష్టలతో అందరి ముఖాల్లో నవ్వులు పూజించడమే ఈరోజు యొక్క పరమార్థం. నవ్వు ఆరోగ్య దాయకం, నవ్వించడం మహాపుణ్యం. ఏప్రిల్ 1న అందరం కలిసి ఆరోగ్యకరమైన హాస్యంతో గడుపుదాం.

- పింగళి భాగ్యలక్ష్మి
9704725609

# నాడీ సంబంధ రుగ్మత ఆటిజమ్



సాధారణ పిల్లలు ఏడాది వయస్సులోనే పాకడం, నడవడం, నవ్వడం, ముద్దు ముద్దుగా మాట్లాడడం, తల్లితండ్రుల పిలుపుకు బదులు ఇవ్వడం లాంటివి చేయడానికి ప్రయత్నిస్తూ సఫలం అవుతూ ఉంటారు. కాని కొందరు పిల్లలు మానసిక ఎదుగుదల లోపం కారణంగా అసాధారణం ప్రవర్తన ప్రదర్శిస్తూ ఉంటారు. ఇలాంటి అసాధారణ ప్రవర్తనలో ఆటిజమ్ (మందబుద్ధి లేదా మూగ రుగ్మత) అనే అనారోగ్యం కూడా ఒకటిగా గుర్తించబడింది. వయస్సుకు తగిన మానసిక ఎదుగుదల లేకుండా ఉండే పరిస్థితి బాల్యంలోనే ప్రారంభమై జీవితకాల నాడీ సంబంధ ఆటిజమ్ రుగ్మతగా మారుతుంది. ప్రతి వంద మంది పిల్లల్లో ఒక్కరికి ఈ సమస్య వస్తుంది. పిల్లల మెదడులో కొంత భాగం సరిగా అభివృద్ధి చెందకపోవడం వల్ల ఆటిజమ్ రుగ్మత బయట పడుతుంది. ఆటిజమ్ పెద్ద ప్రమాదకర సమస్య కానప్పటికీ దీనిని నివారించడంలో అనేక సవాళ్లు ఎదుర్కోవలసి వస్తున్నది. మూడేళ్లు నిండక ముందే బయట పడే ఆటిజమ్ లక్షణాలతో మూర్ఛ, నిరాశ, ఆందోళన, హైపర్ ఆక్టివిటీ డిజార్డర్ వంటి రుగ్మతలు ప్రదర్శించబడతాయి.

ఆటిజమ్ రుగ్మత పట్ల ప్రజల్లో అవగాహన కల్పించడానికి, ఆ కుటుంబాలకు బాసటగా నిలువడానికి, ఆటిజమ్ పట్ల అపోహలను తొలగించడానికి ప్రతి ఏట 02 ఏప్రిల్ రోజున ప్రపంచ ఆటిజమ్ అవగాహన దినం పాటించుట ఆనవాయితీగా మారింది. 2026 ప్రపంచ ఆటిజమ్ అవగాహన దినం ఇతివృత్తంగా ఆటిజమ్ మానవీయత - ప్రతి వ్యక్తి జీవితం విలువైనదే అనబడే అంశాన్ని తీసుకొని ప్రచారం నిర్వహిస్తున్నారు. భారత్‌లో ప్రతి 68 మంది పిల్లల్లో ఒక్కరికి ఆటిజమ్ వచ్చే అవకాశాలు ఉన్నట్లు తేలడం విచారకరం. ఇండియాలో దాదాపు 18 మిలియన్ల ఆటిజమ్ రోగులు ఉన్నట్లు గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి.

ఆటిజమ్ రుగ్మతను ఆటిజమ్ స్పెక్ట్రమ్ డిజార్డర్‌గా కూడా పిలుస్తారు. ఆటిజమ్ రావడానికి కారణాలుగా జన్యుపరమైనవి, గర్భధారణ సమయంలో ఇన్ఫెక్షన్లు, గర్భిణి తీవ్ర ఉద్రేకానికి గురికావడం, మెదడులో స్రవించే రసాయనాలు తగిన మోతాదులో స్రవించకపోవడం, నెలలు నిండకుండా ప్రసవం కావడం, కుటుంబ సభ్యులు తగిన సమయం ఇవ్వకపోవడం లాంటివి ప్రధానమైనవిగా పేర్కొనబడినవి.



ఆటిజమ్ బారిన పడిన పిల్లలు వయసుకు తగిన మానసిక పరిపక్వత చూపకపోవడం, ఒంటరిగా ఉండడం, వ్యక్తుల కళ్లల్లోకి చూడకపోవడం, ఇతరుల పిల్లలతో కలిసి ఆడుకోవడానికి విముఖత చూపడం, చేసిన పనులనే పదే పదే చేయడం, గాయాలు తగిలినా గుర్తించకపోవడం, శబ్దాలను పట్టించుకోకపోవడం, పిలిచినా పలుకకపోవడం, సరిగా మాట్లాడకపోవడం, అకారణంగా ఏడ్వడం లాంటి లక్షణాలను ప్రదర్శిస్తారు.

ఆటిజమ్ రుగ్మత బారిన పడిన పిల్లల తల్లితండ్రులు తగు జాగ్రత్తలు తీసుకోవడం కనీస అవసరమని తెలుసుకోవాలి. పిండిపదార్థాలు, కొవ్వులు, మాంసకృత్తులు, జనిత లవణాలు, విటమిన్లు, జింక్, ఐరన్, సెలినియం, యాంటీ ఆక్సిడెంట్లు, విటమిన్-ఈ, విటమిన్-కె లాంటి పోషకాలు కలిగిన ఆహారం అందించడం తల్లితండ్రుల బాధ్యత అని మరువరాదు. కాలీఫ్లవర్, బ్రొకోలీ, పెప్పర్, నారింజ, బత్తాయా, పైనాపిల్, స్ట్రాబెరీ, బొప్పాయి, బీన్స్, పుట్టగొడుగులు, పొద్దుతిరుగుడు విత్తనాలు లాంటి పోషకాహారాన్ని అందించాలి. గర్భిణీలు తగు పోషకాహారం తీసుకోవడం, తల్లులు దులవాట్లకు దూరంగా ఉండడం, గర్భిణీలు డాక్టర్ సలహాలు, తల్లులు వాయు కాలుష్యానికి/క్రిమిసంహారక మందులకు దూరంగా ఉండడం, గర్భిణీలు అన్ని రకాల టీకాలను తీసుకోవడం, గర్భంలో శిశువు కదలికల పట్ల వైద్యుల సలహాలు తీసుకోవడం లాంటి జాగ్రత్తలు ఆటిజమ్ సమస్యకు విరుగుడునా పని చేస్తాయని తెలుసుకోవాలి.

పిల్లల ప్రవర్తనను తల్లితండ్రులు నిరంతరం గమనించడం, అసాధారణంగా కనిపిస్తే వెంటనే వైద్యులను సంప్రదించడం లాంటి చర్యలు ఆటిజమ్ రుగ్మత తీవ్రతను తగ్గించడంతో లేదా సమస్యను చాలా వరకు పరిష్కరించడం జరుగుతుందనే అవగాహన కలిగి ఉండడం తల్లితండ్రుల కనీస బాధ్యత అని తెలుసుకుందాం, ఆటిజమ్ను అవగాహన ఔషధాలతో సమాధానమిద్దాం.

- డా. బుర్ర మధుసూదన్ రెడ్డి
9949700037

# వేసవి వడగాలుల నష్టాల నియంత్రణకు చర్యలు

**జనాల రద్దీ ఉండే ప్రాంతాల్లో చలివేంద్రాలు ఏర్పాటు చేయాలి**

**ఉపాధిహామీ పనులు, కొనుగోలు కేంద్రాల వద్ద నీడ, తాగు నీటి వసతి ఏర్పాటు చేయాలి**

**కలెక్టర్ గరిమ అగ్రవాల్**

**వేసవి వడగాలుల నేపథ్యంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అధికారులతో సమీక్షించిన జిల్లా కలెక్టర్**



**రాజన్న సిరిసిల్ల, ఏప్రిల్ 1(మనం ప్రతినిధి ) :** వేసవి వడగాలుల నష్టాల నియంత్రణకు ప్రణాళికాబద్ధంగా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. వేసవి వడగాల్పుల నేపథ్యంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వైద్య ఆరోగ్య శాఖ, అగ్ని మాపక శాఖ, అటవీ శాఖ, కార్మిక శాఖ, వ్యవసాయ శాఖ వివిధ శాఖల ఆద్వర్యంలో జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో కలెక్టర్, జిల్లా అటవీ శాఖ అధికారి బాలమణి, అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ తో కలిసి బుధవారం సమీక్ష నిర్వహించారు. వేసవిలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వైద్య ఆరోగ్య శాఖ ఆద్వర్యంలో రూపొందించిన పోస్టర్లను కలెక్టర్ అధికారులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ₹జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ... ఈ వేసవి కాలంలో వడగాలుల నేపథ్యంలో తీసుకోవాల్సిన జాగ్రత్తల పై ప్రజలకు అవగాహన కల్పించాలని ఆదేశించారు. ఆశ కార్యకర్త నుంచి జిల్లాస్థాయి అధికారి వరకు ప్రతి ఒక్కరి దగ్గర అవసరమైన మేర ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉండాలని కలెక్టర్ తెలిపారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాలలో తాగునీటి సరఫరాకు సంబంధించి ఎటువంటి ఇబ్బందులు రాకుండా జాగ్రత్త వహించాలని సూచించారు. ఏమైనా మరమ్మత్తు ఉంటే ముందస్తుగానే చేయించాలని ఆదేశించారు. మున్సిపల్, తహసీల్ కార్యాలయాలు, బస్టాండ్లు, జనాల రద్దీ ఉండే ప్రాంతాల్లో చలివేంద్రాలు ఏర్పాటు చేయాలని ఆయా శాఖల అధికారులను ఆదేశించారు. వేసవి కాలంలో ప్రతి రోజు నీరు త్రాగడం, గొడుగు తీసుకుని బయటికి రావడం, వేడి గాల్పులు వచ్చే సమయంలో ఇంట్లో ఉండటం వంటి వివిధ అంశాలను ప్రజలకు తెలియజే యాలన్నారు. ఉపాధిహామీ పనులు, ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద నీడ కోసం టెంట్లు, ఓఆర్ఎస్ పాకెట్లు, నీటి సదుపాయం ఏర్పాటు చేయాలని ఆదేశించారు. అటవీ ప్రాంతాల్లో మంటలు వ్యాపించకుండా పకడ్బందీ చర్యలు తీసుకోవాలని సూచించారు. మూగ జీవాల సంరక్షణకు అన్ని చర్యలు తీసుకోవాలని, అన్ని గ్రామాల్లో నీటి తొట్ల నిర్వహణ పక్కాగా ఉండేలా చూడాలని, వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయ గోశాలపై పశు వైద్య, సంవర్ధక శాఖ అధికారి ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని, వాటి సంరక్షణకు అన్ని చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. సమావేశంలో సిరిసిల్ల, వేములవాడ ఆర్డీవోలు వెంకటేశ్వర్లు, రాధాభాయి, వైద్యాధికారి రజిత, వ్యవసాయ అధికారి అఫ్జల్ బేగం, డీఆర్డీఓ గీత, మిషన్ భగీరథ అధికారులు అన్వర్, సుమలత, జిల్లా పంచాయతీ అధికారి షరీఫుద్దిన్, జడ్పీ సీఈవో వినోద్ కుమార్, జిల్లా సంక్షేమ అధికారి లక్ష్మీరాజం, సిరిసిల్ల మున్సిపల్ కమిషనర్ ఖదీర్ పాషా, కార్మిక శాఖ అధికారి నజీర్, అగ్నిమాపక శాఖ అధికారి శ్రీనివాస్ రెడ్డి, ముఖ్య ప్రణాళిక అధికారి శ్రీనివాసాచారి, పశు సంవర్ధక శాఖా అధికారి రవీందర్ రెడ్డి, మత్స్య శాఖ అధికారి సౌజన్య, జిల్లా రవాణాశాఖా అధికారి లక్ష్మణ్ కుమార్, పౌర సరఫరాల అధికారి బుచ్చిబాబు తదితరులు పాల్గొన్నారు.

## హింసకు గురవుతున్న మహిళలకు సఖీ సెంటర్ ద్వారా సేవలు

- **జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష**




**పెద్దపల్లి, ఏప్రిల్ 01 (మనం ప్రతినిధి):** హింసకు గురవుతున్న మహిళలకు సఖీ సెంటర్ ద్వారా సేవలు అందించాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష అన్నారు. బుధవారం జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష రంగంపల్లి లోని సఖీ సెంటర్ ను ఆకస్మికంగా తనిఖీ చేసి సఖి సెంటర్ లోనే రిజిస్టర్ లను కలెక్టర్ పరిశీలించారు. సఖి కేంద్రంలో కౌన్సిలింగ్ అందుకుంటున్న వివిధ జంటలను కలెక్టర్ సఖి సెంటర్ ద్వారా అందుతున్న సేవలు వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ, హింసకు గురవుతున్న మహిళలకు సఖీ సెంటర్ ద్వారా రిలీఫ్ రావాలని, ఇటువంటి కేసుల పై ఆధిక శ్రద్ధ వహించాలని కలెక్టర్ సూచించారు. సఖీ సెంటర్ కు వచ్చిన మహిళల సమస్య పరిష్కారానికి కృషి చేసి వారిని రెగ్యులర్ గా ఫాలో అప్ చేయాలని కలెక్టర్ తెలిపారు. సఖి సెంటర్ కు వచ్చే బాధితులకు అవసరమైన కౌన్సిలింగ్ అందించాలని, వివిధ కేసులలో అవసరమైన సందర్భంలో న్యాయ సలహా సైతం అందించాలని కలెక్టర్ సూచించారు. గ్రామాలలో విస్తృతంగా పర్యటిస్తూ సఖీ సెంటర్ ద్వారా అందించే సేవల గురించి ప్రచారం కల్పించి , సఖి సెంటర్ కు వచ్చే బాధితుల సంఖ్య పెంచాలని కలెక్టర్ అన్నారు. ఈ పర్యటనలో జిల్లా కలెక్టర్ వెంట సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## న్యాయవాదుల సమస్యలపై స్పందిస్తా



- **బార్ అసోసియేషన్ అధ్యక్షులు పిట్టల మనోహర్**

**వేములవాడ,ఏప్రిల్ 1(మనం న్యూస్):** న్యాయవాదుల సమస్యలను పరిష్కరించేందుకు కట్టుబడి ఉంటానని వేములవాడ నూతన బార్ అసోసియేషన్ అధ్యక్షులు పిట్టల మనోహర్ తెలిపారు. నూతనంగా ఎన్నికైన కమిటీచే బుధవారం బార్ హాల్లో ఎన్నికల అధికారి తిరుమల్ గౌడ్ ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా మనోహర్ మాట్లాడుతూ న్యాయవాదుల హక్కుల పరిరక్షణ, వృత్తి సంబంధిత ఇబ్బందుల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటానన్నారు. కోర్టు వసతుల అభివృద్ధి, యువ న్యాయవాదులకు ప్రోత్సాహం, సంక్షేమ పథకాల అమలు వంటి అంశాలకు ప్రాధాన్యత ఇస్తామని ఆయన వెల్లడించారు. అన్ని వర్గాల న్యాయవాదులను కలుపుకొని ముందుకు సాగుతూ, సంఘ అభివృద్ధికి కృషి చేస్తానని స్పష్టం చేశారు. తనపై నమ్మకం ఉంచి విజయం సాధించేందుకు సహకరించిన ప్రతి ఒక్కరికీ పిట్టల మనోహర్ కృతజ్ఞతలు తెలిపారు.
ఈ కార్యక్రమంలో బార అసోసియేషన్ ఉపాధ్యక్షులు గొంటి శంకర్, ప్రధాన కార్యదర్శి పుప్పాల బాను కృష్ణ, జాయింట్ సెక్రెటరీ కనికరపు శ్రీనివాస్, లైబ్రరీ సెక్రెటరీ మొగిలి సుజాత, క్రీడలు సాంస్కృతిక కార్యదర్శి వంగల కర్ణ, కోశాధికారి జెట్టి శేఖర్, మహిళా ప్రతినిధి తమిరి అన్నపూర్ణ, సీనియర్ ఈసీ సభ్యులు నామాల రాజశేఖర్ రెడ్డి, వేముల సుధాకర్ రెడ్డి, మారు ముఖం అనిల్ కుమార్, జూనియర్ ఈసి సభ్యులు ఉల్లెందుల అనిల్, ఒద్యారపు అనిల్ కుమార్, వడ్లకొండ శ్రీకాంత్, బూర సరిత, సీనియర్ జూనియర్ మహిళ న్యాయవాదులు పాల్గొన్నారు.

## శ్రీ వీర హనుమాన్ విజయ యాత్ర




- **భక్తి పారవశ్యంలో చేవెళ్ల!**
- **రేపు ఘనంగా శోభాయాత్ర**
- **తరలిరావాలని పిలుపునిచ్చిన నిర్వాహకులు**

**చేవెళ్ల, ఏప్రిల్ 1(మనం న్యూస్) :** విశ్వహిందూ పరిషత్, బజరంగ్ దళ్ ఆధ్వర్యంలో శ్రీ వీర హనుమాన్ విజయ యాత్రను పురస్కరించుకుని రేపు (ఏప్రిల్ 2) చేవెళ్లలో భారీ శోభాయాత్ర నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ శోభాయాత్ర 'రచ్చబండ' నుండి ప్రారంభమై 'గుండం' వద్ద ఉన్న హనుమాన్ దేవాలయం వరకు కొనసాగుతుందని పేర్కొన్నారు. ఈ ఆధ్యాత్మిక శోభాయాత్రలో మండలంలోని గ్రామ పెద్దలు, హిందూ బంధువులు, సోదర సోదరీమణులు అందరూ అధిక సంఖ్యలో పాల్గొని, హనుమాన్ భక్తిని చాటుతూ ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వారు విజ్ఞప్తి చేశారు.

## ఏప్రిల్ 15 లోపు హెచ్.ఎల్.బీ బ్లాక్ నిర్ధారణ పూర్తి

- **జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష**



**పెద్దపల్లి, ఏప్రిల్ 01 (మనం ప్రతినిధి):** జనగణన 2027 కార్యక్రమంలో భాగంగా ఏప్రిల్ 15 లోపు హెచ్.ఎల్.బీ బ్లాక్ నిర్ధారణ ప్రక్రియ పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష తెలిపారు. సమీకృత జిల్లా కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో బుధవారం జనగణన 2027 పై సంబంధిత అధికారులతో జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ జె.అరుణ శ్రీ తో కలిసి నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష మాట్లాడుతూ, జనగణన 2027 రెండు దశలలో జరుగుతుందని, ప్రస్తుత సంవత్సరం హౌజ్ లిస్టింగ్ కార్యక్రమం మే 10 నుంచి ప్రారంభం అవుతుందని, ప్రతి ఇంటికి సంబంధించి 35 ప్రశ్నల వివరాలు నెల రోజుల వ్యవధిలో సేకరించాలని కలెక్టర్ తెలిపారు. ఫిబ్రవరి 2027 లో హౌస్ లిస్టింగ్ ప్రకారం జనాభా వివరాల సేకరణ చేయడం జరుగుతుందని కలెక్టర్ తెలిపారు. ప్రతి 300 ఇండ్లు/800 జనాభా ఒక బ్లాక్ గా (హెచ్.ఎల్.బీ) నిర్దేశించి జనాభా లెక్కల చేసేందుకు బృందాలు ఏర్పాటు చేయాలని కలెక్టర్ సూచించారు. ఫీల్ సర్వే సమయంలో మనం వేసుకునే అంచనా కంటే ఎక్కువ ఇండ్లు ఉండే అవకాశం ఉన్నందున 15 శాతం అధికంగా ఎన్యుమరేటర్లు నియామకం చేపట్టాలని అన్నారు. పట్టణ ప్రాంతాలలో హెచ్.ఎల్.బీ లు మరింత పెరిగే అవకాశం ఉందని కలెక్టర్ తెలిపారు. ప్రతి గ్రామం, మున్సిపల్ వార్డుల వారీగా ఏర్పాటు చేయనున్న హెచ్.ఎల్.బీ. పేపర్ మీద రిపోర్ట్ సిద్ధం చేసుకొని ఆన్ లైన్ నమోదు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రతి హెచ్.ఎల్.బీ పరిధిలో ఉన్న ఇండ్లు, ఆలయాలు, ప్రార్థనా మందిరాలు, ఆట స్థలాలు, ఆసుపత్రులు ఏం ఉన్నాయో సరిగ్గా ప్లాన్ సిద్ధం చేసుకోవాలని అన్నారు. హెచ్.ఎల్.బీ ప్రక్రియ ఎంత పకడ్బందీగా చేసుకోగలిగితే రాబోయే 1.5 సంవత్సరాల కాలం పాటు జనాభా లెక్కల కార్యక్రమం అంత ప్రశాంతంగా నిర్వహించుకునే అవకాశం ఉంటుందని కలెక్టర్ పేర్కొన్నారు. హెచ్.ఎల్.బీ విభజన రాబోయే 10 రోజులలో తహసిల్దారులు స్థానిక పంచాయతీ కార్యదర్శి మున్సిపల్ కమిషనర్లు సహకారంతో పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. 200 నుంచి 300 ఇండ్లు ఉన్న చిన్న చిన్న గ్రామ పంచాయతీలు, వార్డుల హెచ్.ఎల్.బీ ఆన్ లైన్ ఎంట్రీ చేయాలని కలెక్టర్ సూచించారు. ఏప్రిల్ 15 లోపు తుది హెచ్.ఎల్.బీ నిర్ధారణ పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. హెచ్.ఎల్.బీ ఆన్ లైన్ ఎంట్రీ సమయంలో జాగ్రత్తగా ఉండాలని అన్నారు. జనగణన 2027 కార్యక్రమం చాలా ముఖ్యమైన అంశమని, దీనిని ఎట్టి పరిస్థితులలో నిర్లక్ష్యం చేయవద్దని అన్నారు. హౌస్ లిస్టింగ్ నిర్వహించేందుకు జిల్లా వ్యాప్తంగా 1400 ఎన్యుమరేటర్లు అవసరం ఉంటుందని అంచనా వేశామని, ప్రతి గ్రామం మున్సిపాలిటీ పరిధిలో ఎంతమంది ఎన్యుమరేటర్ అవసరం ఉన్నారో వివరాలు అందించాలని కలెక్టర్ తెలిపారు.ఈ సమావేశంలో ఆర్డిఓలు బి. గంగయ్య, సురేష్ , ఎంపీడీవోలు, తహసిల్దారులు సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# వయోవృద్ధుల సంక్షేమం, భద్రతే ప్రభుత్వ లక్ష్యం

- **మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్**


**జగిత్యాల ఏప్రిల్ 01 (మనం ప్రతినిధి):** వయోవృద్ధుల సంక్షేమం, భద్రత మరియు గౌరవప్రదమైన జీవనాన్ని బలోపేతం చేయాలనే లక్ష్యంతో తెలంగాణ ప్రభుత్వం తెలంగాణ ఉద్యోగుల తల్లిదండ్రుల పరిరక్షణ మరియు పర్యవేక్షణ బిల్లు, 2026ను ప్రవేశపెట్టినట్లు అధికారికంగా ప్రకటించిన నేపథ్యంలో జగిత్యాల జిల్లా కలెక్టరేట్ లో బుధవారం వయోవృద్ధులతో సమావేశ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వయోవృద్ధుల శాఖ డైరెక్టర్ శైలజ, జగిత్యాల శాసనసభ్యులు సంజయ్ కుమార్, జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ రాష్ట్రంలోని ఉద్యోగులు తమ వయోవృద్ధుల సంరక్షణకు బాధ్యతగా తీసుకోవాలని, తల్లిదండ్రుల ఆర్థిక మరియు వైద్య అవసరాలను తీర్చేందుకు ఉద్యోగులు తమ వేతనం నుండి కనీసం 15 శాతం లేదా రూ.10,000 (ఏది ఎక్కువైతే అది) మొత్తాన్ని కేటాయించి, నేరుగా వారి బ్యాంకు ఖాతాలకు జమ చేయాల్సి ఉంటుందని తెలిపారు. ఈ బిల్లు అమలును సమర్థవంతంగా పర్యవేక్షించేందుకు ప్రతి శాఖలో ప్రత్యేక కమిటీలను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ప్రజాప్రతినిధులు మరియు సంబంధిత అధికారులు ఇందులో భాగస్వాములై పర్యవేక్షణ బాధ్యతలు నిర్వర్తించాలని తెలిపారు. తల్లిదండ్రుల సంరక్షణలో నిర్లక్ష్యం చూపిన ప్రభుత్వ ఉద్యోగులు, ప్రయివేట్ ఉద్యోగులు, ప్రజా ప్రతినిధులపై చర్యలు తీసుకునేలా బిల్లు నిబంధనలు రూపొందించబడినట్లు తెలిపారు. ఈ క్రమంలో ఫిర్యాదులను స్వీకరించి 60 రోజుల లోపు పరిష్కరించేందుకు జిల్లా స్థాయిలో వ్యవస్థ ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. అదేవిధంగా, అప్పీల్ వ్యవస్థను కూడా ఏర్పాటు చేసి, కమిటీలకు క్వాసి-జ్యుడీషియల్ అధికారాలు కల్పించనున్నట్లు తెలిపారు. బయోలాజికల్ మరియు దత్తత తల్లిదండ్రులు, వృద్ధాప్య కారణంగా ఆధారపడే



తల్లిదండ్రులు ఈ బిల్లులో అర్హులుగా పేర్కొన్నారు. ఈ బిల్లు రాజ్యాంగంలోని ఆర్టికల్ 41, సీఆర్పీసీ సెక్షన్ 125 మరియు సీనియర్ సిటిజన్స్ చట్టం, 2007 నిబంధనల ప్రకారం రూపొందించబడినట్లు తెలిపారు. ఈ బిల్లు ద్వారా రాష్ట్రంలో వృద్ధుల సంక్షేమాన్ని మరింత బలోపేతం చేసి, కుటుంబ బాధ్యతలను చట్టబద్ధంగా అమలు చేయడం ప్రధాన ఉద్దేశ్యమని పేర్కొన్నారు. వయోవృద్ధుల సంరక్షణ ప్రతి ఒక్కరి సామాజిక మరియు నైతిక బాధ్యత అని పేర్కొన్నారు. మారుతున్న సామాజిక పరిస్థితుల్లో వృద్ధులు ఎదుర్కొంటున్న సమస్యలను దృష్టిలో ఉంచుకుని, వారికి ఆర్థిక భద్రత మరియు గౌరవప్రదమైన జీవనం కల్పించేందుకు ఈ బిల్లు రూపొందించినట్లు తెలిపారు. ఈ బిల్లుతో ప్రభుత్వ మరియు ప్రైవేటు సంస్థల్లో పని చేసే ఉద్యోగులు మరియు ప్రజా ప్రతినిధులు తమ తల్లిదండ్రుల పట్ల బాధ్యతాయుతంగా వ్యవహరించాల్సిన అవసరం పెరుగుతుందని, కుటుంబ విలువలను కాపాడటానికి ఇది దోహదపడుతుందని మంత్రి వివరించారు.
తల్లిదండ్రుల సంరక్షణలో నిర్లక్ష్యం వహించే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకునే విధంగా బలమైన నిబంధనలు అమలు చేస్తున్నామని తెలిపారు.అనంతరం సీనియర్ సిటిజన్స్ పత్రిక పిలుపు గోడ పత్రికను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ లు బి.ఎస్. లత, బి. రాజ గౌడ్, జిల్లా గ్రంథాలయ చైర్మన్ దినేష్, జగిత్యాల మున్సిపల్ చైర్మన్ సమిండ్ల వాణి, జిల్లా సంక్షేమ శాఖ అధికారి రాజ్ కుమార్, సంబంధిత జిల్లా స్థాయి అధికారులు మరియు తదితరులు పాల్గొన్నారు.

## హై లెవెల్ బ్రిడ్జి నిర్మాణపు పనులను వేగవంతం చేయాలి

- **రోడ్డు నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ లేకుండా చర్యలు చేపట్టాలి**
- **ప్రభుత్వ విప్, పెద్దపల్లి ఎమ్మెల్యే విజయరమణ రావు**



**ఓదెల ఏప్రిల్ 01 (మనం న్యూస్):** ఓదెల మండలం రూప్ నారాయణపేట, జమ్మికుంట మండలం విలాసాగర్ గ్రామాల మధ్య మానేరు వాగుపై నిర్మిస్తున్న హై లెవెల్ బ్రిడ్జి పనులను ప్రజా ప్రతినిధులు, సంబంధిత ఇంజనీర్లు, కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి ప్రభుత్వ విప్, పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణ రావు బుధవారం పరిశీలించారు. ప్రజల చిరకాల వాంఛ అయిన ఈ బ్రిడ్జి నిర్మాణం కోసం విజయరమణ రావు సీఎం రేవంత్ రెడ్డి చే రూ.80 కోట్లను మంజూరు చేయించి పనులను చేపట్టడం జరిగింది. నిబంధనల ప్రకారం నాణ్యతతో పనులను చేపట్టాలని, పనులను వేగవంతం చేసి సాధ్యమైనంత త్వరగా పూర్తి చేయాలని ఎమ్మెల్యే ఇంజనీర్లకు, అధికారులకు సూచించారు. అలాగే, బ్రిడ్జికి అనుబంధంగా చేపట్టిన పొత్కపల్లి గ్రామ శివారులోని సిసి రోడ్డు పనులను కూడా ఎమ్మెల్యే పరిశీలించారు. అనంతరం పోతకపల్లి నుండి కాల్వ శ్రీరాంపూర్ వరకు రూ. 27 కోట్లతో నూతనంగా నిర్మాణం చేపడుతున్న డబల్ రోడ్డు పనులను ప్రభుత్వ విప్ పెద్దపల్లి శాసనసభ్యులు చింతకుంట విజయరమణ రావు పరిశీలించి రోడ్డు నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ లేకుండా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మూల ప్రేమ సాగర్ రెడ్డి, అధికారులు,వ్యవసాయ మార్కెట్ చైర్మన్లు, పలు గ్రామాల సర్పంచులు, మాజీ ప్రజా ప్రతినిధులు, కాంగ్రెస్ మండల అధ్యక్షులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు మరియు తదితరులు పాల్గొన్నారు.

## యువజన కాంగ్రెస్‌ను బలోపేతం చేయడమే లక్ష్యం

- **ఈనెల 15న పెద్దపల్లిలో అసెంబ్లీ స్థాయి క్రికెట్ టోర్నమెంట్**
- **యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షుడు నరేష్**




**పెద్దపల్లి, ఏప్రిల్ 01 (మనం ప్రతినిధి):** యువజన కాంగ్రెస్ను క్షేత్రస్థాయిలో బలోపేతం చేయడమే తమ ప్రధాన లక్ష్యమని పెద్దపల్లి అసెంబ్లీ యువజన కాంగ్రెస్ అధ్యక్షులు ముత్యాల నరేష్ ముదిరాజ్ పేర్కొన్నారు. పెద్దపల్లి ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో బుధవారం బొంకూరి అవినాష్‌తోపాటు యువజన కాంగ్రెస్ నాయకులతో కలిసి అసెంబ్లీ స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నరేష్ మాట్లాడుతూ పార్టీ బలోపేతానికి త్వరలోనే గ్రామ, మండల, అసెంబ్లీ కమిటీలను వేయనున్నట్లు తెలిపారు. రాబోయే జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల్లో యువజన కాంగ్రెస్ నాయకులకు తగిన ప్రాధాన్యత కల్పించాలని ప్రభుత్వ విప్, పెద్దపల్లి ఎమ్మెల్యే విజయ రమణారావును కోరినట్లు వెల్లడించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఎమ్మెల్యే ఆదేశాల మేరకు యువతను వ్యసనాలకు దూరంగా ఉంచేందుకు మత్తు వదలండి - మైదానంలోకి రండి అనే నినాదంతో ఈనెల 15న పెద్దపల్లి ప్రభుత్వ కళాశాల మైదానంలో అసెంబ్లీ స్థాయి క్రికెట్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్లు ప్రకటించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శులు గుమ్మడి ప్రసాద్, పిరంగి రాజు, అసెంబ్లీ ఉపాధ్యక్షులు ఎంచర్ల తిరుమలేశ్ యాదవ్, ప్రధాన కార్యదర్శి ఆయుబ్, కార్యదర్శులు అభినయ్ గౌడ్, కొడపత్రి మధుకర్, పట్టణ అధ్యక్షులు కొలిపాక శ్రవణ్, మండల అధ్యక్షులు జడల రాజు, సిరిసెటి రాహుల్, ఒర్రె అజయ్ యాదవ్, దేవేందర్ రెడ్డి, నాయకులు అరగొండ రాజ్ కుమార్, వెలిశాల రాకేష్, రాకేష్ యాదవ్, గుర్రాల వాసు, స్వామి రాజ్ యాదవ్, అజయ్, తదితరులు పాల్గొన్నారు.

## మరమ్మత్తుల పనులను పరిశీలించిన మున్సిపల్ చైర్ పర్సన్



**జగిత్యాల ఏప్రిల్ 01(మనం న్యూస్):** జగిత్యాల మున్సిపల్ వాహనాల మరమ్మతు పనులను చైర్ పర్సన్ సమిండ్ల వాణి శ్రీనివాస్ పరిశీలించారు. ఈ సందర్భంగా సమీండ్ల వాణి శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రధానంగా జెసిబిని అత్యవసరంగా రిపేర్ చేయించి వినియోగంలోకి తీసుకురావాలని , మరమ్మత్తులు చేయించవలసిన వాహనం లను వెనువెంటనే పూర్తి చేయించి ప్రజావసరాలకు వినియోగంలోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. వీరి వెంట కౌన్సిలర్లు కోరి జయ గంగ మల్లు, జుంబర్తి గంగ లక్ష్మి రాజ్ కుమార్, బడుగు పద్మ రాజేందర్, బొల్లారపు సప్న గిరిధర్, చీటీ లక్ష్మీనారాయణ, పిట్ట ధర్మరాజు, డి ఈ ఆనంద్, ఎన్విరాన్మెంట్ ఇంజనీర్ శ్రీకాంత్, వర్క్ ఇన్స్పెక్టర్ ఉన్నారు


# పూజారులకు ఘనస్వాగతం

- **ఆలయ అభివృద్ధికి సహకారం**
- **చేవెళ్ల లక్ష్మి వెంకటేశ్వర స్వామి దేవస్థానంలో సందడి**
- **పాల్గొన్న మున్సిపల్ చైర్ పర్సన్, కౌన్సిలర్**



**చేవెళ్ల, ఏప్రిల్ 1(మనం న్యూస్) :** మండల కేంద్రంలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రం శ్రీ చేవెళ్ల లక్ష్మీ వెంకటేశ్వర స్వామి దేవస్థానం నూతన పూజారుల రాకతో ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది. ఆలయ బాధ్యతలను రెండేళ్ల కాలపరిమితికి గాను స్వీకరించిన రాఘవేందర్ చారి, వైభవ్ చారి కుటుంబ సభ్యులకు స్థానిక ప్రజా ప్రతినిధులు, భక్తులు ఘనస్వాగతం పలికారు.ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా పాల్గొన్న చేవెళ్ల మున్సిపల్ చైర్ పర్సన్ దేవర సమతా వెంకట్ రెడ్డి, కౌన్సిలర్ మరియు మాజీ సర్పంచ్ బండారి శైలజా ఆగిరెడ్డి పూజారులను సాదరంగా ఆహ్వానించారు. పట్టణ ప్రజల భాగస్వామ్యమే లక్ష్యం ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఆలయ అభివృద్ధికి తమ వంతు పూర్తి సహకారం అందిస్తామని భరోసా ఇచ్చారు. రాబోయే రెండేళ్ల కాలంలో దేవస్థానం తరపున నిర్వహించే ప్రతి పూజా కార్యక్రమం, ఉత్సవాల్లో పట్టణ ప్రజలందరినీ భాగస్వాములను చేసేలా కృషి చేస్తామని పేర్కొన్నారు. ఆలయ ప్రాశస్త్యం పెంచేలా కార్యక్రమాలు ఉండాలని ఆకాంక్షించారు. ఈ వేడుకలో ఆలయ పూజారులు, మేటిదారులు మరియు పెద్ద సంఖ్యలో గ్రామస్తులు పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. నూతన పూజారుల ఆధ్వర్యంలో ఆలయం మరింత ఆధ్యాత్మిక పరిమళాలను వెదజల్లాలని భక్తులు కోరుకున్నారు.

## సర్పంచ్ రమేష్ ను సత్కరించిన ప్రభుత్వ విప్



కాట్రేనికోన ఏప్రిల్ 1 మనం ప్రతినిధి : గ్రామాలను అభివృద్ధి చేసిన స్థానిక ప్రజాప్రతినిధులను ప్రజలు ఇప్పటికీ మర్చిపోరని ప్రభుత్వ విప్ దాట్ల బుచ్చిబాబు పేర్కొన్నారు. సర్పంచ్ ల పదవీకాలం రెండవ తేదీతో ముగుస్తున్నందున ఉప్పూడి పాలకవర్గాన్ని సత్కరించే కార్యక్రమంలో శాసనసభ్యులు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు ఈ సందర్భంగా సర్పంచ్ రమేష్ చేసిన అభివృద్ధి ని, కూటమి ప్రభుత్వంలో ఉప్పూడి గ్రామానికి ప్రభుత్వం ద్వారా అందిన నిధులను వివరాలు తెలియజేశారు. అనంతరం శాసనసభ్యులను సర్పంచ్ రమేష్ పాలక వర్గ సభ్యులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమం లో నాగిడి నాగేశ్వరరావు, దాట్ల పవన్, నడింపల్లి సుబ్బరాజు, బండారు ఏసు, రంబాల చౌదరి బాబు, మాగాపు పట్టాభి, మాగాపు బాలు, ర్యాలీ బద్రి, పోలిశెట్టి పెద్ద పాల్గొన్నారు.

## దళితులపై దాడులకు రాజకీయ అండ
# రఘురామకృష్ణంరాజుపై మండిపడ్డ మాలమహానాడు

భీమవరం ఏప్రియల్ 1 మనం ప్రతినిధి : పాలకొల్లు బ్రాడిపేట 1వ వీధిలోని పి.వి.రావు మాలమహానాడు కార్యాలయంలో రాష్ట్ర అధ్యక్షుడు గుమ్మాపు సూర్యవరప్రసాద్ రావు అధ్యక్షతన ఆకివీడు పెద్దపేటలో దళితులపై జరిగిన దాడిని ఖండిస్తూ నిర్వహించిన సమావేశంలో ఉప సభాపతి కనుమూరి రఘురామకృష్ణంరాజు పై తీవ్ర స్థాయిలో విమర్శలు వెల్లువెత్తాయి. శ్రీరామనవమి రోజుని రాజకీయ ప్రయోజనాల కోసం వాడుకుంటూ, ఇతర ప్రాంతాల నుండి కార్యకర్తలను తీసుకువచ్చి దళితపేటలో కావాలనే మతపరమైన ఉద్రిక్తతలు సృష్టించారని మాల మహానాడు నాయకులు ఆరోపించారు. సుమారు 30 సంవత్సరాలుగా ఉన్న గోత్తెనమ్మ గుడిని కూల్చి రామాలయం నిర్మిస్తామని ప్రకటించడం ద్వారా దళితుల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసే ప్రయత్నం చేశారని,జై శ్రీరామ్ నినాదాల వెనుక దాగి సామాజిక విభేదాలను రెచ్చగొట్టారని మండిపడ్డారు.ఇది కేవలం రాజకీయ చర్య



కాకుండా దళితులపై ఉద్దేశపూర్వక జరిగిన దాడిగా అభివర్ణించారు. ఈ ఘటనలో దళితులపై దాడులు జరిగి పలువురు గాయపడినప్పటికీ అసలు నిందితులపై చర్యలు తీసుకోకుండా బాధితులపైనే అటెంప్ట్ టు మర్డర్ కేసులు నమోదు చేయడం అధికార దుర్వినియోగానికి నిదర్శనమని విమర్శించారు. పోలీసుల వ్యవహారం పూర్తిగా పక్షపాతంగా ఉందని ఆరోపించారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు,ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ రఘురామకృష్ణంరాజుకు మద్దతుగా సంఘీభావం తెలపడం అత్యంత దురదృష్టకరమని, దళితులపై జరుగుతున్న అన్యాయాన్ని పట్టించుకోకుండా అధికారుల పక్షాన నిలబడటం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని తీవ్రంగా ఖండించారు.ఈ కార్యక్రమంలో లీగల్ సెల్ రాష్ట్ర కార్యదర్శి బండి సుందర్ రామూర్తి, పెదపాటి పెద్దిరాజు, మానుకొండ శ్రీనుబాబు, కోటా రత్నరాజు, వడ్లపాటి ఆనంద్ రాజు, కత్తుల సత్యనారాయణ, బొడ్డుపల్లి శ్రీనివాస్ రావు తదితరులు పాల్గొన్నారు.



## కివ్వకలో అయ్యప్ప స్వామివారి జన్మదిన వేడుకలు

- **ఈ సందర్భంగా విద్యార్థులకు నోటు బుక్స్ పంచిన భక్తులు**

కుక్కునూరు, ఏప్రిల్ 01 ( మనం న్యూస్ ): శ్రీశ్రీ హరిహర పుత్రుడు,అఖిలాండకోటి బ్రహ్మాండ నాయకుడు, అన్నదాన ప్రభువు,కన్నెమూల మహా గణపతి అయినా శ్రీ అయ్యప్ప స్వామి వారి జయంతి సందర్భంగా కివ్వాక అయ్యప్ప భక్తులు పాఠశాలలోని విద్యార్థులకు నోట్ బుక్స్,పెన్నులు,పెన్సిల్లు, స్వీట్లు పంచి వేడుకలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అయ్యప్ప స్వామి వారు నమ్ముకున్న ప్రతి ఒక్కరికి న్యాయం చేస్తారని వారిని సహృదయంతో శరణాలు తెలియజేసి పూజించినట్లయితే మనసు పుష్కలంగా ఉంటుందని ఈ సందర్భంగా అయ్యప్ప పూజా విధానాన్ని గుర్తు చేసుకున్నారు.అయ్యప్ప పూజ చేయడం వలన మనసు ఉల్లాసంగా,శరీరం ఆరోగ్యంగా మరియు యోగా కార్యక్రమం చేసినట్టు ఉంటుందని దాని ద్వారా సగటు మనిషి ప్రశాంతంగా జీవించగలడని నమ్ముతున్నామని తెలియజేశారు.ఈ కార్యక్రమంలో కివ్వక గురుస్వాములు బట్టు వీరబాబు, నకరికంటి సుబ్బారావు,గాడిద రాఘవులు మోదంపరుపు వెంకన్న బాబు ,ఎర్ర రవీంద్ర , కివ్వాక ప్రాథమిక ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు,విద్యార్థులు పాల్గొన్నారు.

## మల్లాడి విజయానికి పూలుతో
# రహదారులు వేస్తున్న ప్రజా అభిమానం

యానాం ఏప్రిల్ 1 మనం న్యూస్ : కేంద్రపాలిత ప్రాంతం యానాం నియోజకవర్గంలో ఎంన్డీయే కూటమి ఎన్ ఆర్ పార్టీ అభ్యర్థి గా ఎన్నికల ప్రచారంలో భాగంగా నేడు మెట్టకూరు గ్రామంలో ఉన్న రమబాయ్ నగర్, ఎలిపే గార్డన్, ఆది ఆంధ్రపేట, గణపతి నగర్ ఏరియా లలో నిర్వహించిన స్ట్రీట్ కార్నర్ మీటింగ్కు ప్రజల నుంచి విశేష స్పందన వస్తుంది ప్రజల హృదయాల్లో పేరుకుపోయిన అసంతృప్తి, ప్రస్తుత ఎమ్మెల్యే పనితీరుపై ఉన్న తిరుగుబాటు భావం ఈ అసంఖ్యాక జనసంద్రంగా మారి, యానంలో కొత్త రాజకీయ అధ్యాయానికి నాంది పలికింది. మల్లాడి పర్యాటించిన ప్రతి చోట మహిళలు పూలుతో గణస్వాగతం పలుకుతూ హారతు లిస్తున్నారు. పురుషులు గజమాలలతో సత్కారిస్తున్నారు. మల్లాడి మాట్లాడుతూ ప్రజలనుండి వస్తున్న అపూర్వ స్పందన చూస్తుంటే యానాం కు పూర్వవైభవం రాబోతుంది అని ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతూ పేదలందరికి ఇళ్ల పట్టాలు ఈస్తానని




హామీ ఇచ్చారు. మీ అమూల్యమైన ఓటును జగ్గ గుర్తుపై వేసి, అఖండ మెజారిటీతో గెలిపించలని కోరడం జరిగింది. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసిన కార్యకర్తకలకు ప్రజానీకానికి , ప్రతి ఒక్క మల్లాడి అభిమానికి, ఎన్ ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులుకు, భారతీయా జనతా పార్టీ నాయకులుకు, ప్రభుత్వ సిబ్బందికి హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేసారు.

# ఉద్యోగిగా సత్యనారాయణ సేవలు అభినందనీయం

- **మున్సిపల్ కమిషనర్ విజయ సారథి**

పాలకొల్లు, ఏప్రిల్ 1,మనం ప్రతినిధి : పశ్చిమగోదావరి జిల్లా పాలకొల్లు మున్సిపల్ కార్యాలయ ఉద్యోగిగా చెరకువాడ సత్యనారాయణ ప్రజలకు అందించిన సేవలు అభినందనీయమైనవి అని మున్సిపల్ కమిషనర్ బి విజయ సారథి అన్నారు. పాలకొల్లు మున్సిపల్ కార్యాలయంలో 1984లో ఎంఎంఆర్ గా ఉద్యోగ ప్రవేశం చేసి, అంచలంచెలుగా ఎదుగుతూ కార్యాలయ సభార్డినేట్ ఉద్యోగ స్థాయికి చేరుకుని మంగళవారం సాయంత్రం పదవీ విరమణ చేశారు. ఈ సందర్భంగా జరిగిన పదవీ విరమణ అభినందన సభకు మున్సిపల్ కమిషనర్ విజయ సారథి అధ్యక్షత వహించి మాట్లాడారు. సత్యనారాయణ తన విధి నిర్వహణలో ఎవరిని నొప్పించకుండా, తన 39 ఏళ్ల సర్వీసులో ప్రజల మన్నలను పొందారని మాజీ కౌన్సిలర్లు టిడిపి నాయకులు గండేటి వెంకటేశ్వరరావు, పెచ్చెట్టి బాబు తో సహా పలువురు



వక్తలు సత్యనారాయణ సేవలను కొనియాడారు. ఈ సందర్భంగా సత్యనారాయణ,వీర వెంకటలక్ష్మి తాయారు దంపతులను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా సన్మాన గ్రహీత సత్యనారాయణ మాట్లాడుతూ తన విధి నిర్వహణలో తనకు సహకారం అందించిన ప్రజా ప్రతినిధులకు,అధికారులకు,ప్రజలకు ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో ధనాన్ని ప్రకాష్, బేరం రాంబాబు, బత్తుల కుమారి, కొరగింజలు రవి, సిరిగినీడి శివాజీ, టిపిఓ వీరబ్రహ్మం, అరుణ కుమారి తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులు పోటీ తత్వాన్ని అలవర్చుకోవాలి



ముదినేపల్లి ఏప్రిల్ 01మనం న్యూస్ : విద్యార్థులు పోటీ తత్వాన్ని అలవర్చుకోవాలని నియోజకవర్గ టిడిపి కన్వీనర్ వీరమల్లు నరసింహారావు అన్నారు. మండలంలోని వడాలి జడ్పీ ఉన్నత పాఠశాలలో ఎన్.ఎం.ఎం.ఎస్ 2025-26 సంవత్సరానికి ఉపకార వేతనాలు అర్హులైన విద్యార్థులకు అభినందన కార్యక్రమాన్ని నిర్వహించారు. పాఠశాల హెచ్ఎం వి ప్రభుదాస్ అధ్యక్షతన విద్యార్థులు గవిరి కుష్యాంత్ ఈశ్వర్ , సింగవరపు జయంత్ , గుణపు స్నిగ్ధ , అనగాని అవని వసంతకుమారి , కోలా సమశ్రీ , అట్ల కోలా సమశ్రీ అట్ల జ్యోత్స్నశ్రావణి , శౌంఠి యనన్వి , మొర్త లక్ష్మీ భవాని లను ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో శిక్షణ ఉపాధ్యాయులు దండే అనిల్ కుమార్ , కె నరసింహారావు లను సన్మానించారు సర్పంచ్ మరీదు దుర్గా శ్రీ హనుమంతు , ముదినేపల్లి ప్రెస్ క్లబ్ అధ్యక్షులు చిలకలపల్లి నాగరాజు , ఉపాధ్యాయులు , విద్యార్థులు పాల్గొన్నారు.

# విజన్ యాక్షన్ ప్లాన్ కార్యాలయాన్ని ప్రారంభించిన జిల్లా కలెక్టర్

ఆచంట ఏప్రిల్ 1 మనం న్యూస్ : నియోజకవర్గ కేంద్రమైన ఆచంటలో రూ. 22 లక్షలు తో నూతనంగా నిర్మించిన విజన్ యాక్షన్ ప్లాన్ కార్యాలయాన్ని బుధవారం ఆచంట నియోజకవర్గ శాసనసభ్యులు పితాని సత్యనారాయణ సమక్షంలో జిల్లా కలెక్టర్ సిహెచ్ నాగరాణి ప్రారంభించారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అభివృద్ధి సంక్షేమం లో భాగంగా భాగంగా చేనేత మగ్గం ఉన్న ప్రతి కుటుంబానికి 200 యూనిట్లు ఉచిత విద్యుత్ అందిస్తున్నామని అన్నారు రాష్ట్రంలో సూపర్ సిక్స్ పథకాలు విజయవంతంగా అమలు అవుతున్నాయని పేర్కొన్నారు అంతేగాక కూటమై ప్రభుత్వం ఇచ్చిన హామీలే కాక అదనంగా ఎన్నో అభివృద్ధి సంక్షేమ పథకాలు ప్రజలకు అందిస్తున్నామని తెలిపారు ఆచంట నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసేందుకు కూటమి ప్రభుత్వం సిద్ధంగా ఉందని అన్నారు అనంతరం



ఎన్టీఆర్ భరోసా పెన్షన్లు లబ్ధిదారులకు స్వయంగా జిల్లా కలెక్టర్ నాగరాణి నియోజకవర్గం శాసనసభ్యులు పితాని సత్యనారాయణ అందజేశారు ఈ కార్యక్రమంలో జడ్పిటిసి ఉప్పలపాటి సురేష్ బాబు ఎంపీపీ డి సూర్య కుమారి ఏఎంసీ చైర్మన్ తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షులు చిలుకూరు సీతారాం మండల పరిషత్ ఉపాధ్యక్షులు ఎర్రగొప్పుల నాగరాజు తెలుగుదేశం పార్టీ మాజీ మండల అధ్యక్షులు కేత మీరయ్య తహసిల్దార్ సోమేశ్వరరావు ఆర్ ఐ టి దుర్గాప్రసాద్ పంచా యతీ కార్యదర్శి నాగబాబు సబ్ ఇన్స్పెక్టర్ వెంకటరమణ ఎంపీటీసీలు సర్పంచులు ఆయా శాఖల అధికారులు ఈ కార్యక్రమంలో తదితరులు పాల్గొన్నారు.

## శంకుస్థాపన కార్యక్రమంలో
# పాల్గొన్న తుమ్మలపల్లి రమేష్



కిర్లంపూడి, ఏప్రిల్ 01:( మనం న్యూస్ ): కిర్లంపూడి మండలం శృంగరాయనిపాలెం గ్రామానికి చెందిన కూనిశెట్టి ఆనందరావు నూతన గృహ శంకుస్థాపన కార్యక్రమంలో జనసేన పార్టీ జగ్గంపేట నియోజకవర్గ ఇన్చార్జ్ తుమ్మలపల్లి రమేష్ పాల్గొన్నారు.ఈ సందర్భంగా గృహ నిర్మాణం విజయవంతంగా పూర్తవాలని ఆకాంక్షిస్తూ ఆనందరావు, వారి కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం జనసేన కార్యకర్తలతో స్నేహపూర్వకంగా ముచ్చటించి, వారి సమస్యలు, అభిప్రాయాలను తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఐటీ కోఆర్డినేటర్ అరినే రాజేష్, కుంచె రాజు, బూరయ్య, పుర్రె గంగబాబు, రేవూరి శ్రీను, గోకేడ రమణ తదితరులు పాల్గొన్నారు.

## ఎన్టీఆర్ భరోసా
# పెన్షన్ల పంపిణీ



కాట్రేనికోన ఏప్రియల్ 1 మనం ప్రతినిధిః ఎన్టీఆర్ భరోసా పెన్షన్లు కార్యక్రమాన్ని బుధవారం మండల వ్యాప్తంగా అధికారులు సచివాలయం సిబ్బంది నాయకుల ఆధ్వర్యంలో నిర్వహించారు. చెయ్యేరు గ్రామ పంచాయతీ లో ఎంపీడీఓ బి రాజేశ్వర్ రావు, గ్రామ పంచాయతీ సర్పంచ్ చెల్లి సురేష్, సీనియర్ నాయకులు సుబ్బరాజు ఆధ్వర్యంలో ఎన్టీఆర్ భరోసా పెన్షన్స్ పంపిణీ నిర్వహించారు. నాగిడి నాగేశ్వరావు, వాసంశెట్టి రాజేశ్వరరావు, సుంకర బుజ్జి, ఆకాశం శ్రీనివాస్, బడుగు పుల్లారావు, గిడ్డి చంటి తదితరులు పెన్షన్ పంపిణీలో ఉన్నారు. ఎద, బీద, బడుగు, బలహీన వర్గాలకు ఎన్టీఆర్ భరోసా పెన్షన్స్ పెద్ద ఎత్తున సామజిక భద్రతకు పెద్ద పీట వేస్తున్నాయని కొనియాడారు. మండలంలోని నాయకులు సచివాలయ సిబ్బంది పంచాయతీ కార్యదర్శులు కూటమి నాయకులు పెన్షన్ పంపిణీ కార్యక్రమం పాల్గొన్నారు.



## ప్రాంగణ నియామకంలో 110 మంది విద్యార్థులు ఎంపిక

కాట్రేనికోన, ఏప్రిల్ 1 మనం ప్రతినిధి : అమలాపురం సమీపంలో చెయ్యేరు నందుగల శ్రీనివాసా అటానమస్ ఇంజనీరింగ్ కళాశాలలో నిర్వహించిన మెగా ప్రాంగణ ఎంపికల్లో విద్యారులు విశేష నైపుణ్యమును ప్రదర్శించారు. ప్రముఖ కంపెనీలైన ఫోక్సకాన్ ,టాటా ఎలక్ట్రానిక్ ప్రైవేట్ లిమిటెడ్, సుందరం ఫాస్ట్ నేర్స్ లిమిటెడ్ (టీవీఎస్ ), అపోలో టైర్స్, బ్రేక్స్ ఇండియా వంటి ప్రముఖ బహుళ జాతీయ సంస్థలు హెచ్ ఆర్ లు కళాశాల లో పర్యటించి, విద్యార్థుల రిజనింగ్, ఆంగ్లభాషా నైపుణ్యము, న్యూమెరికాల్, అర్థమెటికల్ ఎబిలిటీ, కోడింగ్ వటి ప్రధానాంశముల యందు పరిజ్ఞానమున పరిక్షించి అందునా విశేష ప్రతిభ కనబంచిన విద్యారుల్ని మౌఖిక పరీక్షకు ఎంపిక చేసారు. ఈ కార్యక్రమంలో కళాశాల పాలకవర్గ సభ్యులు సందీప్ , కళాశాల ప్రిన్సిపాల్ కే . సురేష్ బాబు , కళాశాల విద్యార్థి సంక్షేమం మరియు, శిక్షణ శాఖాధిపతి బి . అరుణ్ కుమార్, ఐ క్యూ ఏ సి విభాగాది పతి బి రత్న రాజు వివిధ విద్యా శాఖాధిపతులు , వివిధ విభాగాల అధిపతులు,అధ్యాపకులు విద్యార్థినీ, విద్యార్థులు పాల్గున్నారు.

# భవన నిర్మాణ కార్మికుల పరిహార బకాయిలు చెల్లించాలని ధర్నా

ఏలేశ్వరం, ఏప్రిల్ 01,(మనం న్యూస్): బుధవారం నాడు భవన నిర్మాణ కార్మికుల పరిహార బకాయిలను వెంటనే విడుదల చేయాలని సిఐటియు నాయకులు పాకలపాటి సోమరాజు,పిల్ల రాంబాబు ఆధ్వర్యంలో భవన నిర్మాణ కార్మికులు స్థానిక మరిడమ్మ అమ్మవారి గుడి వద్ద నుండి తాసిల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించి,తాసిల్దార్ కు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సిఐటియు నాయకులు మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మికులు సుదీర్ఘంగా ఆరు సంవత్సరాల పోరాట ఫలితంగా అనేక సంక్షేమ పథకాలు సాధించుకున్నారన్నారు. అదేవిధంగా భవన నిర్మాణ కార్మికులకు పెండింగ్లో ఉన్న ఐదు కోట్ల పరిహారం కార్మికులకు తక్షణం చెల్లించాలని,2020 నుండి పథకాలకు దరఖాస్తుల చేసుకునే అవకాశం కల్పించాలని కోరుతూ ఏప్రిల్



ఒకటి,రెండు,మూడు తేదీలలో మండల తాసిల్దార్ కి వినతి పత్రాలు సమర్పించి,2026 మే 6 చలో కలెక్టరేట్ ను ధర్నా జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో బస్సా దుర్గబాబు,అడపా శివ,ముప్పిడి సుశీలమ్మ, కాళ్ల అజ్జమ్మ,అచ్చియమ్మ తదితరులు పాల్గొన్నారు.

## మాజీ చైర్పర్సన్ దంపతులకు ఘన సన్మానం



ఏలేశ్వరం,ఏప్రిల్ 01(మనం న్యూస్ ): పట్టణంలోని స్థానిక శ్రీ కామాక్షి కార్పెంటర్ కార్యాలయంలో అధ్యక్షుడు సేనాధిపతి రాజబాబు అధ్యక్షతన సర్వసభ్య సమావేశం బుధవారం నిర్వహించారు.అనంతరం నగర పంచాయతీ మాజీ చైర్ పర్సన్ అలమండ సత్యవతి చలమయ్య దంపతులకు పదవీకాలం ముగిసిన సందర్భంగా యూనియన్ సభ్యులు ఘన సన్మానం చేశారు.ఈ సందర్భంగా చలమయ్య మాట్లాడుతూ పదవీకాలం ముగిసిన పట్టణ ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని,కార్పెంటర్ యూనియన్ సభ్యులు అందరికీ నా సహాయ సహకారాలు తప్పకుండా ఉంటాయన్నారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు కొమ్మోజు తాతాచార్యులు,సెక్రెటరీ దుద్దుపూడి ఏసు,కార్యవర్గ సభ్యులు జామి రాజు,జామి శ్రీను, సంఘ పెద్దలు జామి ఆదినారాయణ, సింహాద్రి బ్రహ్మం,కిల్లంపల్లి శ్రీను, ఇంజరుపు ప్రసాదు,చిట్టిమోజు త్రిమూర్తులు,తదితర సంఘ సభ్యులు పాల్గొన్నారు.

## కత్తిపూడి జాతీయ రహదారిపై బైకును ఢీ కొట్టిన లారీ



- **బత్తిన యశ్వంత్ (25) మృతి**
- **మరొకరికి తీవ్ర గాయాలు..**

శంఖవరం ఏప్రిల్ 01 మనం ప్రతినిధిః మండలంలోని కత్తిపూడి జాతీయ రహదారి నెల్లిపూడి, శంఖవరం సెంటర్ వద్ద రోడ్డు దాటుతున్న ద్విచక్ర వాహనాన్ని తుని నుండి రాజమండ్రి వైపు వెళ్లే లారీ బలంగా ఢీకొట్టింది. దుర్గాడ గ్రామానికి చెందిన యశ్వంత్, శ్రీనివాసు క్షతగాత్రులను ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ బత్తిన యశ్వంత్ (25) మృతి చెందాడు. శ్రీనువాస్ కి వైద్యం అందిస్తున్నట్లు సమాచారం పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

# చేనేత కార్మికులకు ఉచిత విద్యుత్

- **పాలకొల్లులో మంత్రి నిమ్మల ప్రారంభం**

పాలకొల్లు, ఏప్రిల్ 1,మనం ప్రతినిధి : చేనేత కార్మికుల సంక్షేమానికి మరో కీలక అడుగు వేస్తూ కూటమి ప్రభుత్వం ఉచిత విద్యుత్ పథకాన్ని అమలు చేస్తున్నట్లు రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు. పాలకొల్లు మండలం భగ్గేశ్వరం గ్రామంలో ఈ పథకాన్ని ఆయన అధికారికంగా ప్రారంభించారు. స్వయంగా పథకం లబ్ధి చేకూరే చేనేత కార్మికుల ఇంటి వద్దకు వెళ్లి అమలు పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా మంత్రి రామానాయుడు మాట్లాడుతూ నేటి నుంచి చేనేత మగ్గం ఉన్న కార్మిక కుటుంబాలకు నెలకు 200 యూనిట్ల వరకు, హ్యాండ్లూమ్లకు 500 యూనిట్ల



వరకు ఉచిత విద్యుత్ అందజేస్తున్నామని మంత్రి వెల్లడించారు. ఈ పథకం ద్వారా రాష్ట్రవ్యాప్తంగా సుమారు 93 వేల చేనేత కుటుంబాలు, 12 వేల హ్యాండ్లూమ్ యూనిట్లు లబ్ధి పొందనున్నాయని చెప్పారు. చంద్రబాబు చేనేత కార్మికులపై విద్యుత్ భారాన్ని తగ్గించి, పరిశ్రమను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో ఈ నిర్ణయం తీసుకున్నామని తెలిపారు. ఈ పథకం అమలుకు ప్రభుత్వం సంవత్సరానికి రూ.150 కోట్లు వెచ్చించనుందని పేర్కొన్నారు. జగన్ పాలనలో విద్యుత్ ఛార్జీలు 11 సార్లు పెంచి ప్రజలపై భారాన్ని మోపారని ఆరోపించారు. ప్రస్తుతం ట్రూ అప్ కాకుండా ట్రూ డౌన్ అమలు చేసి యూనిట్కు 13 పైసలు తగ్గించామని వివరించారు. డిస్కమ్లు సూచించిన రూ.16 వేల కోట్ల ఆదాయ లోటును ప్రభుత్వమే భరిస్తోందని, రైతులకు 22 లక్షల కనెక్షన్లకు ఉచిత విద్యుత్ అందిస్తున్నామని తెలిపారు. ఆక్వా రైతులకు యూనిట్ రేటును రూ.3.50 పైసల నుంచి రూ.1.50 పైసలకు తగ్గించామని మంత్రి నిమ్మల రామానాయుడు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ అంగర రామ్మోహన్ రావు ఎ ఎమ్ సి చైర్మన్ కోడి విజయ భాస్కర్, ఉన్నమట్ల కబరద్ది పాముల రజిని కుమారు కలిదిండి రామచంద్ర రాజు కాసకోటి వీరభద్రం, నిల వీరభద్రం, అందే లింగయ్య పెచ్చెట్టి నాని, దొంగ గణపతి, కోడి నారాయణస్వామి, కుక్కల రమదేవి, నలిని, పద్మ రాయి ప్రసాద్, నెక్కంటి ఆదినారాయణ పెనుమత్స శ్రీనివాసరాజు కౌరు సందీప్ కుమార్, అాదే కోటి వీరభద్రరావు గ్రామ ప్రజలు తదితర నాయకులు పాలుగున్నారు.

# మీ పిల్లలకు కూడా ఇలానే భోజనం పెడతారా?

- కలెక్టర్ అంకిత్ ఆగ్రహం
- పలు పాఠశాలలను తనిఖీ చేసిన కలెక్టర్





**దమ్మపేట, ఏప్రిల్ 01(మనం న్యూస్):** మీ పిల్లలకు కూడా ఇలానే భోజనం పెడతారా అంటూ కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. దమ్మపేట మండలంలో జిల్లా కలెక్టర్ అంకిత్ బుధవారం విస్తృత పర్యటన చేశారు. తహశీల్దార్ కార్యాలయం, పలు పాఠశాలలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ప్రజలకు అందుతున్న సేవలు, విద్యార్థులకు సదుపాయాలు, ముఖ్యంగా మధ్యాహ్న భోజన నాణ్యతపై సమగ్రంగా ఆరా తీశారు. మొదటగా దమ్మపేట తహసీల్దార్ కార్యాలయాన్ని పరిశీలించిన కలెక్టర్, కార్యాలయంలోని అన్ని విభాగాలను తనిఖీ చేసి, దరఖాస్తుల పరిష్కార విధానంపై అధికారులను ప్రశ్నించారు. వివిధ సమస్యల పరిష్కారం కోసం వచ్చిన ప్రజలతో నేరుగా మాట్లాడి, కుల ధృవీకరణ, ఆదాయ, నివాస ధృవీకరణ, రేషన్ కార్డుల వంటి దరఖాస్తుల పురోగతిని తెలుసుకున్నారు. దరఖాస్తులను నిర్ణీత గడువులోనే పరిష్కరించాలని స్పష్టం చేశారు. మీ సేవ ద్వారా చెల్లించవలసిన రుసుముల వివరాలను కార్యాలయంలో స్పష్టంగా ప్రదర్శించాలని సూచించారు. భూ సమస్యలు, సర్టిఫికెట్ల జారీ వంటి అంశాలు మండల స్థాయిలోనే పరిష్కారం కావాల్సి ఉండగా, ప్రజలు ప్రజావాణి కార్యక్రమానికి ఎందుకు దూర ప్రాంతాల నుంచి రావాల్సి వస్తోందని తహసీల్దార్ను ప్రశ్నించారు. సమస్యలను స్థానికంగానే త్వరితగతిన పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రికార్డు రూమ్ను పరిశీలించి పలు సూచనలు చేశారు. అనంతరం వివిధ శాఖల అధికారులతో సమావేశమై, విద్యుత్, మిషన్ భగీరథ, ఇరిగేషన్, వ్యవసాయం, పోలీస్ శాఖల పనితీరును సమీక్షించారు. గ్రామసభల నిర్వహణకు పూర్తి ఏర్పాట్లు చేయాలని, వేసవి కాలంలో తాగునీటి సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అనంతరం దమ్మపేట తెలంగాణ గిరిజన సంక్షేమ బాలుర ఉన్నత పాఠశాలను కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా పాఠశాలలో విద్యార్థులకు వడ్డించేందుకు సిద్ధంగా ఉన్న భోజనాన్ని నేరుగా పరిశీలించారు. మెనూ ప్రకారం ఆ రోజు చికెన్ బగారా రైస్ అందించాల్సి ఉండగా, అది అందుబాటులో లేకపోవడాన్ని గమనించిన కలెక్టర్, మెనూ పాటించకపోవడంపై సంబంధిత సిబ్బందిని ప్రశ్నించారు. విద్యార్థులకు అందించవలసిన ఆహారాన్ని ఎందుకు ప్రదర్శించడం లేదని వెంటనే ప్రదర్శించాలని ఆదేశించారు. విద్యార్థులకు వడ్డించడానికి సిద్ధంగా ఉన్న ఆహారాన్ని స్వయంగా రుచి చూసిన కలెక్టర్, ఆహార నాణ్యతపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. మీ పిల్లలకు కూడా ఇలానే భోజనం పెడతారా? అని ప్రశ్నిస్తూ వంట సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మిల్మేకర్ కూర సరిగా నువ్వు ఉడకక పోవడం, రుచి, నాణ్యత లోపించడం పట్ల అసహనం వ్యక్తం చేశారు. విద్యార్థులకు పోషక విలువలు కలిగిన నాణ్యమైన ఆహారం అందించాలని, భవిష్యత్తులో నిర్లక్ష్యం పునరావృతమైతే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. విద్యార్థులు చేతులు శుభ్రం చేసుకునే ప్రదేశంలో కుళాయిలకు ట్యాప్లు లేకపోవడంతో నీరు వృథాగా పోతున్న పరిస్థితిని గమనించి వెంటనే మరమ్మతులు చేపట్టాలని ఆదేశించారు. అనంతరం మందలపల్లి క్రాస్ రోడ్డు వద్ద గల తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల బాలుర పాఠశాలను పరిశీలించిన కలెక్టర్, అక్కడ మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందుతున్నందుకు సంతృప్తి వ్యక్తం చేశారు. విద్యార్థులతో మాట్లాడి భోజన నాణ్యత, సదుపాయాలపై వివరాలు తెలుసుకున్నారు. స్టోర్ రూమ్ను పరిశీలించి కూరగాయలు, ఆహార పదార్థాల నాణ్యతను తనిఖీ చేశారు. వంటశాలలో గ్యాస్ సిలిండర్ల నిల్వలు, భద్రతా చర్యలపై ఆరా తీసి, భద్రతా ప్రమాణాలను కచ్చితంగా పాటించాలని ఆదేశించారు. విద్యార్థులకు నాణ్యమైన ఆహారం అందించడం ద్వారా వారి ఆరోగ్యం, అభివృద్ధిపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని కలెక్టర్ సూచించారు. ఈ పర్యటనలో తహశీల్దార్ రామ్ నరేష్, ఎంపీడీవో రవీందర్ రెడ్డి, ఎంఈఓ జగదీష్, ఉపాధ్యాయురాలు స్టెల్లా, వార్డెన్ దుర్గ, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

## జామియా మిలియాలో 'సివిల్స్'కు ఉచిత శిక్షణ

- 2026 ఫలితాలలో 38 మంది ఎన్నిక
- మైనార్టీ,ఎస్సీ,ఎస్టీ, మహిళలకు అవకాశం
- గడువు తేదీ మే 26
- మైనార్టీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు యాకూబ్ పాషా



**ఖమ్మం, ఏప్రిల్ 1(మనం న్యూస్):** దేశ రాజధాని ఢిల్లీలోని ప్రతిష్టాత్మక 'జామియా మిలియా ఇస్లామియా యూనివర్సిటీ' సివిల్ సర్వీసెస్ లక్ష్యంగా సాగే నిరుపేద, మధ్యతరగతి విద్యార్థుల కలలను సాకారం చేసేందుకు ఉచిత శిక్షణకు నోటిఫికేషన్ విడుదల చేసింది. 2027లో యూపీఎస్సీ నిర్వహించే సివిల్స్ ప్రిలిమ్స్, మెయిన్స్ పరీక్షలకు హాజరు కానున్న మైనారిటీ, యస్సీ, యస్టీ మరియు మహిళలకు ఈ సువర్ణావకాశం కల్పిస్తున్నట్లు మైనార్టీ సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఎండీ. యాకూబ్ పాషా బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఉచిత శిక్షణ పొందేందుకు గాను విశ్వవిద్యాలయం వారు జూన్ 6వ తేదీన మన రాష్ట్రంలో హైదరాబాద్ నందు అర్హత పరీక్ష నిర్వహించడం జరుగుతుందని, దీంట్లో మెరిట్ సాధించిన వారికి ఒక యేడాది పాటు ఉచిత శిక్షణ, భోజన, వసతితో పాటు పూర్తి స్థాయిలో ఏసీ లైబ్రరీ సౌకర్యం కూడా కల్పించటం జరుగుతుందన్నారు.యూపీఎస్సీ ఈ ఏడాది ప్రకటించిన ఫలితాల్లో జామియా మిలియాలో ఉచిత శిక్షణ పొందిన 100 మందిలో ముస్లింలతో పాటు అన్ని వర్గాలకు చెందిన 38 మంది అభ్యర్థులు పలు సర్వీసులలో నియామకాలు పొందారని అన్నారు. అర్హత మరియు ఆసక్తి కలిగిన అభ్యర్థులు తమ వివరాలను వెబ్సైట్ నందు మే 26 లోపు 1325/- రూపాయలు ప్రవేశ పరీక్ష రుసుము చెల్లించి తమ వివరాలను నమోదు చేసుకోవాలని అన్నారు. ఇట్టి అవకాశాన్ని మైనారిటీలు, ఎస్సీ, ఎస్టీ, మరియు మహిళలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఇతర వివరాలకు 8520860785 అనే నంబర్ కు సంప్రదించాలని అన్నారు.

## యస్.బి.ఐ.టి. ఆధ్వర్యంలో వృద్ధ, అనాధ, మానసిక వికలాంగ ఆశ్రమాలలో అన్నదానం



**ఖమ్మం, ఏప్రిల్ 1(మనం న్యూస్):** స్థానిక స్వర్ణభారతి ఇంజనీరింగ్ కళాశాల వార్షికోత్సవం ఆరోహన్ - 2026 లో భాగంగా ఖమ్మం నగరంలోని పలు వృద్ధ, అనాధ, మానసిక వికలాంగ గృహాలలో బుధవారం అన్నదానం నిర్వహించినట్లు కళాశాల ఛైర్మన్ గుండాల కృష్ణ తెలిపారు. విద్యార్థులు విద్య, సాంకేతికత, కళాత్మక వేడుకలతో పాటు సేవాగుణం అలవర్చుకొనే క్రమంలో భాగంగా ఈ కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. విద్యాదానం ద్వారా మానసికంగా సంతృప్తి చెందుతున్నప్పటికీ అన్నదానం ద్వారా ఆత్మసంతృప్తి చెందుతున్నట్లు అభిప్రాయపడ్డారు. వారి ప్రేమ మరియు పరామర్శతో జీవితంలో మర్చిపోలేని అనుభూతిని ఆస్వాదించినట్లు తెలిపారు. వివిధ ఆశ్రమాలను సందర్శించి వారి అనుభవాలను పంచుకోవడం ద్వారా తమ సమస్యలను మరచిపోయి వారి ఆనందంలో మమేకమైనట్లు కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ డాక్టర్ జి.ధాత్రి తెలిపారు. సామాజిక భాధ్యతలో సేవా కార్యక్రమాలు ముందుంటాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులను భాగస్తులను చేయడం ద్వారా వారికి సేవాగుణంతో పాటు సమాజం పట్ల అవగాహన కలుగుతుందని కళాశాల వైస్ఛైర్మన్ కె. శ్రీచైతన్య అభిప్రాయపడ్డారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ జి.రాజ్ కుమార్ మాట్లాడుతూ ఖమ్మం పట్టణంలో బల్లేపల్లిలోని మిషనరీస్ ఆఫ్ ఛారిటి బ్రదర్స్, కరుణగిరిలోని మిషనరీస్ ఆఫ్ ఛారిటి సిస్టర్స్, అల్లీపురంలోని దైవకృప ఆశ్రమం, ముస్తాఫనగర్లోని దుర్గాభవాని వృద్ధ ఆశ్రమంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించినట్లు తెలిపారు. ఆరోహన్-2026 లో భాగంగా గురువారం రక్తదాన శిబిరం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా అన్నదాన కార్యక్రమంలో భాగమైన విద్యార్థులను ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో కళాశాల అకడమిక్ డైరెక్టర్స్ గుండాల ప్రవీణ్ కుమార్, గంధం శ్రీనివాసరావు, డాక్టర్ ఎ.వి.వి. శివ ప్రసాద్, కోఆర్డినేటర్ ఖాసిం పాషా, వివిధ విభాగాల అధిపతులు, అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## ఆర్టిసి సిబ్బంది నల్ల బ్యాడ్జీలతో నిరసన




**మధిర, ఏప్రిల్ 1(మనం న్యూస్):** కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన నాలుగు లేబర్ కోడ్లను తీవ్రంగా వ్యతిరేకిస్తూ, మధిర డిపో ఆధ్వర్యంలో బ్లాక్ డే లో భాగంగా బుధవారం ఆర్టీసీ సిబ్బంది నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. కార్మిక హక్కులను హరించే ఈ చట్టాలను వెంటనే ఉపసంహరించుకోవాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా జేఏసీ నాయకులు మాట్లాడుతూ, దేశవ్యాప్తంగా కార్మికుల సంక్షేమానికి విరుద్ధంగా ఉన్న ఈ లేబర్ కోడ్లు అమలు చేస్తే ఉద్యోగ భద్రత, వేతన హక్కులు తీవ్రంగా దెబ్బతింటాయని ఆందోళన వ్యక్తం చేశారు. కార్మిక వర్గాలపై భారాన్ని మోపే ఈ నిర్ణయాలను ప్రభుత్వం పునరాలోచించాలని కోరారు. ఈ నిరసన కార్యక్రమంలో నాయకులు నాగుల్ మీరా, కే అరుణకుమారి, రామచంద్ర రావు, కే. వెంకన్న, జె.పద్మావతి, ఎం.నరసింహారావు, ఎస్ అరుణ కుమారి, హరికృష్ణ, చినబాబు, రామారావు ,టి.శ్రీనివాసరావు కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

## యంగ్ ఇండియా ఇంటర్నేషనల్ పాఠశాలలపై సమీక్ష

- జిల్లా కలెక్టర్ అంకిత్
- ఏటీసీ కళాశాలల స్థల సమీకరణ, అనుమతుల పురోగతిపై సమీక్ష




**భద్రాద్రి కొత్తగూడెం, ఏప్రియల్ 01 (మనంప్రతినిధి):** జిల్లాలో యంగ్ ఇండియా ఇంటర్నేషనల్ పాఠశాలలు, ఏటీసీ కళాశాలల నిర్మాణానికి సంబంధించి స్థల సమీకరణ, అవసరమైన అనుమతుల పురోగతిపై జిల్లా కలెక్టర్ అంకిత్ సంబంధిత శాఖల అధికారులతో ఐడీఓసీ కార్యాలయంలో బుధవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఈ విద్యాసంస్థల ఏర్పాటుకు సంబంధించిన స్థల సమీకరణ ప్రక్రియను వేగవంతం చేయాలని, ఎలాంటి ఆలస్యం లేకుండా అవసరమైన అన్ని అనుమతులను త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులకు ఆదేశించారు. విద్యా రంగ అభివృద్ధికి ఈ సంస్థలు ఎంతో కీలకమని అన్నారు .

అనుమతుల జారీ ప్రక్రియలో ఎటువంటి ఆటంకాలు లేకుండా శాఖల మధ్య సమన్వయం పెంపొందించాలని, ప్రతి దశలో బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. పెండింగ్లో ఉన్న ఫైళ్లను వెంటనే పరిష్కరించి పనులను ముందుకు తీసుకెళ్లాలని తెలిపారు. సంబంధిత భూముల విషయంలో ఎలాంటి వివాదాలు లేకుండా సమగ్ర పరిశీలన జరిపి చర్యలు తీసుకోవాలని, అవసరమైతే ఉన్నతాధికారులతో సమన్వయం చేసుకోవాలని తెలిపారు. ఈ సమావేశంలో ఇల్లందు తహశీల్దార్ రవికుమార్, అశ్వారావుపేట తహశీల్దార్ రామకృష్ణ , ఈ సెక్షన్ సూపర్డెంట్ స్వర్ణలత, రామవరం ఐటిఐ కళాశాల ప్రిన్సిపల్ సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## వైభవంగా తుంబురు తీర్థ ముక్కోటి



- తీర్థ స్నానమాచరించిన
- 12, 235 మంది భక్తులు

**తిరుమల,ఏప్రిల్ 01,మనం న్యూస్:** తిరుమలలోని శేషాచల అడవుల్లో ప్రముఖ తీర్థంగా భాసిల్లుతున్న తుంబురు తీర్థ ముక్కోటిలో మార్చి 31 మరియు ఏప్రిల్ 01 తారీఖుల్లో 12 వేల మందికి పైగా భక్తులు పాల్గొని తీర్థ మార్చిస్నానాన్ని ఆచరించారు.

### టీటీడీ విస్తృత ఏర్పాట్లు

టీటీడీ అదనపు ఈవో సి.హెచ్.వెంకయ్య చౌదరి ఆదేశాల మేరకు అధికారులు తుంబురు తీర్థానికి వెళ్లే భక్తుల సౌకర్యార్థం పెద్ద ఎత్తున టీటీడీ అధికారులు ఏర్పాట్లు చేశారు. ఇందులో భాగంగా మార్చి 31వ తేదీ ఉదయం 6 గంటల నుండి నిరంతరాయంగా అన్న ప్రసాదాలు, మజ్జిగ, తాగునీరు భక్తులకు శ్రీవారి సేవకులు పంపిణీ చేశారు. ఇంజినీంగ్ విభాగం ఆధ్వర్యంలో భక్తులు భోజనం చేసేందుకు వీలుగా అవసరమైన షెడ్లు, మార్గమధ్యంలో నిచ్చెనలు, తాగునీటి కొళాయిలు ఏర్పాటు చేశారు. దీర్ఘకాలిక వ్యాధులు, ఆస్తమా, స్థూల కాయం, గుండె సంబంధిత వ్యాధులతో బాధపడే వారిని, 12 ఏళ్ల లోపు పిల్లలను తీర్థానికి అనుమతించలేదు. పాప వినాశనం వద్ద పార్కింగ్ సమస్య కారణంగా భక్తులను ఆర్టీసీ బస్సులలో మాత్రమే అనుమతించారు.మరోవైపు టీటీడీ భద్రతా విభాగం, పోలీసులు, అటవీశాఖ సిబ్బంది కలసి పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేపట్టారు. టీటీడీ కల్పించిన అన్నప్రసాదాలు, తాగునీరు, ఇతర ఏర్పాట్లపై భక్తులు సంతృప్తి వ్యక్తం చేశారు. టీటీడీ చేసిన ఏర్పాట్లను వివిధ విభాగాధిపతులు పర్యవేక్షించారు.

## మీ సేవ'ఆన్లైన్ సేవలకు తాత్కాలిక అంతరాయం

- ఛార్జీల పెంపు అమలు

మీ సేవ సులభంగా, వేగంగా

**భద్రాద్రి కొత్తగూడెం, ఏప్రియల్ 01 (మనంప్రతినిధి):** జిల్లాలో సర్వర్ నిర్వహణ పనుల నేపథ్యంలో 'మీ సేవ' ఆన్లైన్ సేవలకు తాత్కాలిక అంతరాయం ఏర్పడనున్నట్లు ఈ-డిస్ట్రిక్ట్ మేనేజర్ సైదేశ్వరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఏప్రిల్ 3వ తేదీ సాయంత్రం 5:00 గంటల నుంచి ఏప్రిల్ 5వ తేదీ ఉదయం 8:00 గంటల వరకు సర్వర్ నిర్వహణ పనులు కొనసాగనున్నట్లు వెల్లడించారు. సర్వర్ పనితీరు మెరుగుదల, భద్రతా వ్యవస్థల అప్గ్రేడ్, సాంకేతిక సమస్యల నివారణ కోసం ఈ నిర్వహణ చేపడుతున్నట్లు పేర్కొన్నారు. ఈ కాలంలో సంబంధిత విభాగాలకు చెందిన అన్ని ఆన్లైన్ సేవలు, డిజిటల్ లావాదేవీలు, వెబ్ పోర్టల్ సేవలు తాత్కాలికంగా నిలిపివేయబడతాయని తెలిపారు. ప్రజలు అత్యవసర సేవలను ముందుగానే వినియోగించుకోవాలని అధికారులు సూచించారు. నిర్వహణ పూర్తయిన అనంతరం సేవలు సాధారణ స్థితికి చేరుకుంటాయని తెలిపారు.

భవిష్యత్తులో వేగవంతమైన, అంతరాయం లేని సేవలను అందించేందుకు ఈ చర్యలు ఉపయుక్తమవుతాయని పేర్కొన్నారు. ఇక 'మీ సేవ' కేంద్రాల ద్వారా అందించే వివిధ ధ్రువపత్రాలు మరియు ఇతర సేవలకు సంబంధించిన సేవా ఛార్జీలను ప్రభుత్వం సవరించినట్లు తెలిపారు. సవరించిన ఛార్జీలు ఇవాళ్టి నుంచే అమల్లోకి వచ్చాయి. ఇప్పటివరకు రూ.35గా ఉన్న కనీస సేవా ఛార్జీని రూ.62కు పెంచినట్లు తెలిపారు. 'ఏ' కేటగిరీ సేవలకు రూ.62 చొప్పున, 'బీ' కేటగిరీ సేవలకు రూ.80 చొప్పున ఛార్జీలు నిర్ణయించినట్లు పేర్కొన్నారు. అదనంగా కరెంటు బిల్లులు, ఈ-పాస్ సేవలు, బయోమెట్రిక్ సేవలు, డ్రైవింగ్ లైసెన్సుకు సంబంధించిన సేవలకు కూడా సవరించిన ఛార్జీలు వర్తిస్తాయని వెల్లడించారు. ప్రజలు ఈ మార్పులను గమనించి సేవలను వినియోగించుకోవాలని ఆయన కోరారు.

# విభజన హామీలు అమలు చేయాలి..

- తెలంగాణకు న్యాయం చేయండి
- బయ్యారం స్టీల్ ప్లాంట్ ఏర్పాటు చేయాలి
- ఖమ్మం, పాలమూరును పట్టించుకోండి
- భద్రాచలం నుంచి ఆంధ్రాలో కలిసిన నాలుగు గ్రామపంచాయతీలను తిరిగి ఇచ్చేయండి
- కొత్తగూడెంలో విమానాశ్రయం ఏర్పాటు చేయాలి
- కేటీపీఎస్ విస్తరణపై దృష్టి సారించాలి
- లోక్సభలో కేంద్రాన్ని నిలదీసిన ఎంపీ రఘురాం రెడ్డి



**ఖమ్మం, ఏప్రిల్ 1(మనం బ్యూరో):** ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టం-2014 అమలుపై ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురాం రెడ్డి లోక్సభలో బుధవారం గళమెత్తారు. విభజన సమయంలో తెలంగాణ అభివృద్ధి కోసం ఇచ్చిన హామీలు ఇప్పటికీ పూర్తిస్థాయిలో అమలు కాలేదని పేర్కొంటూ కేంద్ర ప్రభుత్వాన్ని నిలదీశారు. సంస్థాగత, ఆర్థిక, మౌలిక రంగాలకు సంబంధించిన పలు కీలక అంశాలను సభ దృష్టికి తీసుకువచ్చారు.

విభజన చట్టంలో తెలంగాణ అభివృద్ధి కోసం అనేక హామీలు, కట్టుబాట్లు ఉన్నప్పటికీ, వాటి అమలు ఇంకా పూర్తికాలేదని రఘురాం రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. ఈ హామీలు కాగితాలకే పరిమితం కాకుండా అమలు చేయాలని డిమాండ్ చేశారు. తెలంగాణలో ఎన్ఐటి, ఐఐఎం, ఐఐఎస్ఇఆర్, సెంట్రల్ యూనివర్సిటీలు ఏర్పాటు చేయాలని కోరారు. ఇప్పటికే ఉన్న విద్యాసంస్థలను జాతీయ ప్రమాణాలకు తీసుకెళ్లాలని సూచించారు. ఇండస్ట్రియల్ కారిడార్ అభివృద్ధికి కేంద్రం మద్దతు ఇవ్వాలని, హైదరాబాద్ ఇప్పటికే ఐటీ హబ్గా ఉన్నందున దాన్ని మరింత విస్తరించేందుకు చర్యలు తీసుకోవాలని తెలిపారు.

### ఖమ్మం జిల్లా ప్రస్తావన

మహబూబ్నగర్, ఖమ్మం వంటి వెనుకబడిన జిల్లాల అభివృద్ధికి సెక్షన్ 94(2) కింద రావాల్సిన ఆర్థిక తోడ్పాటు ఇంకా పూర్తిగా అందలేదని పేర్కొన్నారు. ఈ ప్రాంతాలకు ప్రత్యేక ప్యాకేజీని అమలు చేయాలని డిమాండ్ చేశారు. సెక్షన్ 93 ప్రకారం బయ్యారం స్టీల్ ప్లాంట్ ఏర్పాటు హామీ ఇంకా నెరవేరలేదని పేర్కొంటూ దీనిపై స్పష్టత ఇవ్వాలని కేంద్రాన్ని కోరారు. గోదావరి, కృష్ణా నదులు తెలంగాణలోనే అత్యధికంగా ప్రవహిస్తున్నందున, రెండు రాష్ట్రాల్లో కృష్ణా, గోదావరి నది యాజమాన్య బోర్డులను ఏర్పాటు చేయాలని సూచించారు. పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకానికి జాతీయ హోదా కల్పించాలని కోరారు. కేటీపీఎస్ థర్మల్ పవర్ స్టేషన్కు అదనంగా 825 మెగావాట్ల సామర్థ్యాన్ని పునరుద్ధరించాలని సూచించారు. రీజనల్ రింగ్ రోడ్ (ఆర్ఆర్ఆర్) కోసం అదనపు నిధులు కేటాయించాలని కోరారు. వరంగల్కు విమానాశ్రయం ఇచ్చినందుకు ధన్యవాదాలు తెలుపుతూ, కొత్తగూడెం, ఆదిలాబాద్/పెద్దపల్లి ప్రాంతాల్లో కూడా విమానాశ్రయాలను ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. మూసీ నది పునరుజ్జీవన ప్రాజెక్టుకు కేంద్రం మద్దతు ఇవ్వాలని కోరారు. రెండో సవరణలో భద్రాచలం అసెంబ్లీ పరిధిలోని నాలుగు గ్రామ పంచాయతీలు ఆంధ్రప్రదేశ్లో విలీనం కావడంతో అక్కడి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఆ గ్రామాలను తిరిగి తెలంగాణలో కలపాలని కేంద్రాన్ని కోరారు. రాష్ట్ర విభజనను ఒక చీకటి రోజుగా చూడవద్దని సూచించారు. ఇది రెండు రాష్ట్రాల అభివృద్ధికి గొప్ప అవకాశమని పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్కు అదనపు నిధులు ఇవ్వడంపై తమకు ఎటువంటి అభ్యంతరం లేదని, అయితే అదే విధంగా తెలంగాణ అభివృద్ధికి కూడా ఈ బడ్జెట్లో తగిన నిధులు కేటాయించాలని కేంద్రాన్ని కోరారు. రెండు రాష్ట్రాలు సమానంగా అభివృద్ధి చెందేలా చూడాలని సూచిస్తూ తన ప్రసంగాన్ని ముగించారు.

# వయోవృద్ధులకు ఆసరాగా ప్రణామ్ డే కేర్ సెంటర్

● మంత్రి సీతక్క



ములుగు, ఏప్రిల్ 1, మనం ప్రతినిధిః ప్రణామ్ డే కేర్ సెంటర్ వయవృద్ధులకు ఆసరాగా నిలుస్తాయని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క అన్నారు. బుధవారం ములుగు జిల్లా కేంద్రంలోని సంక్షేమ భవనములో ఏర్పాటుచేసిన ప్రణామ్ వయవృద్ధుల డే కేర్ సెంటర్ ను రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క, జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి అనసూయ సీతక్క మాట్లాడుతూ డే కేర్ సెంటర్ లో వయోవృద్ధులు ఉదయం 10 నుండి సాయంత్రం 5 గంటల వరకు అహల్లాదకరమైన వాతావరణం కల్పించడం జరుగుతుందని, మానసిక ఉల్లాసానికి ఆటలు, రాగి జావా టి అందించడం జరుగుతుందని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం వయోవృద్ధుల సంక్షేమం కొరకు కొత్త చట్టం రూపొందించడం జరిగినదని ఎవరైనా ప్రభుత్వ, ప్రైవేటు ఉద్యోగులు వారి యొక్క తల్లిదండ్రుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే చట్టప్రకారం వారి జీతంలో 10 % నుండి 15 % వరకు కోత విధించడం జరుగుతుందని స్పష్టం చేశారు. వయోవృద్ధుల సంక్షేమం పిల్లల యొక్క బాధ్యత అని మంత్రి పేర్కొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ వయవృద్ధుల పట్ల వారి పిల్లలు నిర్లక్ష్యం వహించకూడదని అన్నారు. డే కేర్ సెంటర్ ల వయోవృద్ధులకు ఆరోగ్యం పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలు, మానసిక ఉల్లాస కార్యక్రమాలు, యోగ, మెడిటేషన్ కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని, డే కేర్ సెంటర్ ను వయవృద్ధులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథలయ సంస్థ చైర్మన్ బానోతు రవిచందర్, మార్కెట్ కమిటీ చైర్పర్సన్ రేగ కళ్యాణి, మున్సిపాలిటీ చైర్పర్సన్ చింత నిప్పుల చంద్రకళ, బి డబ్ల్యు ఓ ప్రేమలత, కౌన్సిలర్లు, రెడ్ క్రాస్ స్వచ్ఛంద సంస్థ సభ్యులు, సంబంధిత అధికారులు, స్థానిక ప్రజా ప్రతినిధులు, వయోవృద్ధులు, తదితరులు పాల్గొన్నారు.

# నాగర్ కర్నూల్ జిల్లాలో గురువారం రాష్ట్ర మంత్రుల పర్యటన

● నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్



ఉమ్మడి మహబూబ్ నగర్ ఏప్రిల్ 1 (మనం బ్యూరో)ః రాష్ట్ర రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి, రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, రాష్ట్ర దేవాదాయ ధర్మాదాయ, అటవీ శాఖ మంత్రి కొండా సురేఖ లు గురువారం జిల్లాలో పర్యటించనున్నారు. మంత్రులు అచ్చంపేట నియోజకవర్గ పరిధిలోని పదర మండలం మద్దిమడుగు గ్రామానికి చేరుకుని, ప్రసిద్ధ మద్దిమడుగు ఆంజనేయస్వామి ఆలయం లో స్వామి దర్శనం చేసుకోనున్నారు. అనంతరం అక్కడే అధికారులు, ప్రజాప్రతినిధులతో సమావేశమై అభివృద్ధి కార్యక్రమాలపై చర్చించనున్నారని నగర్ కర్నూలు జిల్లా కలెక్టర్ బాధావత్ సంతోష్ తెలిపారు. పర్యటన షెడ్యూల్ ప్రకారం, మంత్రులు హైదరాబాద్లోని మంత్రి నివాసం నుండి ఉదయం 08-10,బయలుదేరి, బేగంపేట్ విమా నాశ్రయం నుండి హెలికాప్టర్ ద్వారా ప్రయాణం ప్రారంభించి, ఉదయం 8:30 గంటలకు మద్దిమడుగు గ్రామానికి చేరుకోనున్నారు. మంత్రుల పర్యటన సజావుగా సాగేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. భద్రత, ట్రాఫిక్ నియంత్రణ, ప్రజల సౌకర్యాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు.

# రేషన్ కార్డుదారులకు గుడ్ న్యూస్

● 3 నెలల బియ్యం ఒకేసారి పంపిణీ



ములుగు, ఏప్రిల్ 1, మనం ప్రతినిధిఃరేషన్ కార్డు లబ్ధిదారుల విషయంలో రాబోయే వేసవి కాలం దృష్ట్యా ఒకేసారి మూడు నెలల సరిపడా రేషన్ బియ్యం లబ్ధిదారులకు పంపిణీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఏప్రిల్, మే, జూన్ ఈ మూడు నెలలకు సంబంధించిన బియ్యం ఏప్రిల్ నెలలోనే పంపిణీ జరిగేలా చూడాలని , మార్చి మొదటి వారంలోనే ఎండలు మండిపోతున్నాయి. రాబోయే రోజుల్లో ఉష్ణోగ్రతలు భారీగా నమోదయ్యే అవకాశం ఉందని వాతావరణ శాఖ అంచనా వేస్తోంది. ఈ నేపథ్యంలో రాబోయే ఎండలను దృష్టిలో ఉంచుకుని ఈ నిర్ణయం తీసుకుంది. దేశవ్యాప్తంగా తెలంగాణ రాష్ట్రంలోనే రేషన్ కార్డు లబ్ధిదారులకు సన్నబియ్యం పంపిణీ చేస్తున్నారు. ఒక్కో లబ్ధిదారుడికి నెలకు 6 కిలోల చొప్పున సన్నబియ్యం తెలంగాణ ప్రభుత్వం పంపిణీ చేస్తోంది. ములుగు జిల్లాలో దాదాపు 1 లక్ష 2 వేలకి పైగా కార్డులు ఉన్నాయి. ఒకేసారి మూడు నెలలకు సరిపడ కోటా 5,490క్వీట బియ్యం ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించినదని,తగు ఏర్పాట్లు చేసినామని జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి సయ్యద్షాఫైసల్ హుస్సేని తెలియపరిచినారు. ఒకేసారి మూడు నెలలకు సంబంధించి ఒక్కో కార్డుదారుడు 3 సార్లు వేలి ముద్ర (థంబ్) వేయాల్సి ఉందని, దీనికి తోడు సర్వర్ సమస్యలు రాకుండా తగు చర్య లు తీసుకుంటున్నామని జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి తెలియపరిచినారు.

# ప్రైవేట్ ఆసుపత్రులకు కలెక్టర్ కఠిన ఆదేశాలు

● రేట్ చార్టులు తప్పనిసరి
● నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు




ఉమ్మడి మహబూబ్ నగర్, ఏప్రిల్ 1 (మనం బ్యూరో )ః జిల్లాలోని ప్రైవేట్ ఆసుపత్రులు, క్లినిక్లు, స్కానింగ్ కేంద్రాలు క్లినికల్ ఎస్టాబ్లిష్మెంట్ యాక్ట్-2010 నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు. ముఖ్యంగా ప్రతి ఆసుపత్రిలో రేట్ చార్టులు స్పష్టంగా ప్రదర్శించాలని ఆయన సూచించారు. బుధవారం ఐడీఓసీ కాన్ఫరెన్స్ హాల్లో నిర్వహించిన ప్రైవేట్ హాస్పిటల్ రిజిస్ట్రేషన్ జిల్లా స్థాయి కమిటీ సమావేశంలో పలువురు దరఖాస్తులను సమీక్షించారు. మొత్తం 3 ఆసుపత్రులు, 3 క్లినిక్లు, 1 డయాగ్నస్టిక్ సెంటర్, 4 స్కానింగ్ కేంద్రాలకు సంబంధించిన దరఖాస్తులను పరిశీలించారు. కొత్తగా ఏర్పాటు కోసం దరఖాస్తు చేసుకున్న కిరణ్ గ్యాస్ట్రో లివర్ ఎండోస్కోపీ సెంటర్, డాక్టర్ మనీషా రెడ్డి పాలీ క్లినిక్, గాయత్రి డెంటల్ క్లినిక్లకు కమిటీ ఆమోదం తెలిపింది. అదేవిధంగా రవీంద్రబాబు హాస్పిటల్, హైందవ్ న్యూరో హాస్పిటల్, ఆర్య హాస్పిటల్ల స్థాపనకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఒక డయాగ్నస్టిక్ సెంటర్తో పాటు నాలుగు స్కానింగ్ కేంద్రాలకు (రెండు కొత్తవి, రెండు పునరుద్ధరణలు) కూడా అనుమతులు మంజూరు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఆసుపత్రులు నిబంధనలను తు.చ. తప్పకుండా పాటించాలని, సమయానికి రీన్యువల్ కోసం దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా పార్కింగ్ సదుపాయాలు కల్పించాలని ఆదేశించారు. ప్రతి ఆసుపత్రి, క్లినిక్లో రేట్ చార్టులు తప్పనిసరిగా ఉంచాలని స్పష్టం చేశారు. స్కానింగ్ కేంద్రాల్లో ఎట్టి పరిస్థితుల్లోనూ లింగ నిర్ధారణ పరీక్షలు నిర్వహించరాదని హెచ్చరించారు. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించిన వారిపై కఠిన చర్యలు తప్పవని పేర్కొన్నారు. ఇటువంటి ఘటనలు ఎక్కడైనా గమనించినట్లయితే అధికారుల దృష్టికి తీసుకురావాలని ప్రజలకు సూచించారు. సమావేశంలో జిల్లా వైద్య ఆరోగ్య అధికారి సాయినాథ్ రెడ్డి, డీఎస్పీ బాలాజీ నాయక్, డిప్యూటీ డీఎంహెచ్వో శ్రీనివాసులు, డాక్టర్ బాబు, ఆర్డీఎస్ అధ్యక్షురాలు చిన్నమ్మ తావుస్ తదితరులు పాల్గొన్నారు.

# గ్రామ సభలను పకడ్బందీగా నిర్వహించాలి

● జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్




ములుగు,ఏప్రిల్ 1, మనం ప్రతినిధిః ఏప్రిల్, 2న నిర్వహించబోయే గ్రామ సభలు, మున్సిపల్ వార్డుల్లో సభల నిర్వహణ పై బుధవారం మండల ప్రత్యేక అధికారులు, ఎంపీడీఓలు, తహసీల్దార్లు, మున్సిపల్ కమిషనర్లతో టెలి కాన్ఫరెన్స్ ద్వారా సూచనలు ఇచ్చారు. గ్రామ సభలు, మున్సిపల్ సభలు పండగ వాతావరణంలో నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసుకోవాలని, గ్రామ సభల్లో ప్రజలను, ప్రజా ప్రతినిధులను భాగస్వాములను చేయాలని ఆదేశించారు. అదేవిధంగా గ్రామాల్లో టామ్ టామ్ చేయించాలని :చించారు. ప్రభుత్వం ఏర్పడ్డాక ఈ రెండున్నర సంవత్సరాల్లో అనేక అభివృద్ధి పనులను చేపట్టిందని, అదేవిధంగా కొత్తగా మరికొన్ని పథకాలు చేపట్టబోతుంది. ఈ అభివృద్ధి, సంక్షేమ పథకాల ద్వార ఆయా గ్రామ పంచాయతీలు, వార్డు, మున్సిపాలిటీలో ఈమేరకు అభివృద్ధి పనులు జరిగాయి, తదితర విషయాలను గ్రామ సభ సందర్భంగా ప్రజలకు వివరించాలని సూచించారు. కొత్త పథకాల గురించి అవగాహన కల్పించాలని సూచించారు. ఆయా గ్రామాల్లో ఇచ్చిన రైతు భరోసా, రుణ మాఫీ, ధాన్యం సేకరణ, రైతులకు 500 రూపాయల బోనస్, ఇందిరమ్మ ఇళ్లు, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్తు పొందిన లబ్ధిదారులు ఎంతమంది ఉన్నారు, 500 రూపాయలకే సిలిండర్, గ్రామాల్లో చేపట్టిన అభివృద్ధి పనులు తదితర అన్ని వివరాలను తెలియ చేయాలని సూచించారు. లబ్ధిదారుల పేర్లు సైతం చదివి వినిపించాలని చెప్పారు. ఎవరైనా అర్జీలు ఇచ్చేవారు ఉంటే వాళ్లనుండి దరఖాస్తులు తీసుకునేందుకు ప్రత్యేకంగా హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేసి అర్జీలు తీసుకోవాలని సూచించారు. గ్రామ సభకు అత్యధికంగా ప్రజలు వచ్చే విధంగా చూడాలని, గ్రామ సభకు వచ్చే ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా టెంట్, షామియానా, మంచినీరు, ముఖ్యమంత్రి సందేశం చూసేందుకు టి.వి తదితర మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేయాలని చెప్పారు.

ప్రతి గ్రామ సభకు ఒక ప్రత్యేక అధికారిని నియమిస్తున్నట్లు తెలిపారు. ఈ టెలి కాన్ఫరెన్స్ లో అదనపు కలెక్టర్లు, జిల్లా అధికారులు, తహసీల్దార్లు, ఎంపీడీఓ లు, మున్సిపల్ కమిషనర్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# మండల పరిషత్ కార్యాలయంలో ప్రజా పాలన ప్రగతి ప్రణాళికపై సమీక్ష సమావేశం







మహాదేవపూర్, ఏప్రిల్ 1మనం న్యూస్ః జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాదేవపూర్ మండల ప్రజా పరిషత్ కార్యాలయం లో మండల అధికారుల ఆధ్వర్యంలో సర్పంచ్ లు మరియు పంచాయతీ అధికారుల తో సమావేశం నిర్వహించారు. మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమం పై ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి అందులో భాగంగా ఎంపీడీవో రవీంద్రనాథ్ మాట్లాడుతూ 99 రోజుల ప్రణాళిక లో భాగంగా ఏప్రిల్ 2 వ తేది న అన్ని గ్రామ పంచాయతీ ల యందు గ్రామ సభలు నిర్వహించాలని, గ్రామ సభల ద్వారా ప్రజల అభిప్రాయాలను నేరుగా తెలుసుకునే అవకాశం ఉంటుందని పాలనలో ప్రజల భాగస్వామ్యాన్ని పెంచడం గ్రామ సమస్యలను గుర్తించి తక్షణ పరిష్కారాలు కనుగొనడం, ప్రభుత్వ పథకాల అమలును సమీక్షించడం ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక యొక్క లక్ష్యమని తెలిపారు. అంతేకాకుండా గ్రామ సభల్లో ప్రజాప్రతినిధులు, అధికారులు, మహిళా సంఘాలు, రైతులు, యువత స్వయం సహాయక సంఘాల సభ్యులు, లబ్ధిదారులు తప్పనిసరిగా పాల్గొనేలా ముందస్తుగా గ్రామంలో టాంటాం చేయించి గ్రామ సభ నిర్వహించాలని సూచించారు. గ్రామసభల్లో తాగునీరు, మహిళలు, వృద్ధులకు ప్రత్యేక సౌకర్యాలు కల్పించాలని కూడా సూచించారు. గ్రామసభ యొక్క ఎజెండాను ప్రజలకు ముందస్తుగా సమాచారం అందించాలని, గ్రామసభలలో సమగ్ర చర్చ జరిగేలా చూడాలని కూడా సూచించడం జరిగింది . ఇట్టి గ్రామసభలలో రైతు భరోసా ఇందిరమ్మ ఇల్లు, మహాలక్ష్మి, గృహ జ్యోతి, పింఛన్లు, కళ్యాణ లక్ష్మి, షాది ముబారక్, మహిళా శక్తి వంటి పథకాలపై ప్రత్యేకంగా చర్చించాలని సూచించారు. అంతేకాకుండా 15వ ఆర్థిక సంఘం నిధులు విడుదల అయినందున గ్రామసభల ద్వారా త్రాగునీరు, పారిశుద్ధము వంటి పనులకు చేపట్టుటకు గ్రామసభల ద్వారా చర్చించి పనులు చేపట్టాలని పంచాయతీ కార్యదర్శులకు మరియు సర్పంచులకు పలు సూచనలు జారీ చేయడం జరిగినది. ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి కిరణ్, ఎంపీడీవో ఏ. రవీంద్రనాథ్, వివిధ గ్రామ పంచాయతీల సర్పంచులు, గ్రామ పంచాయతీల ప్రత్యేక అధికారులు మరియు పంచాయతీ కార్యదర్శులు, పాల్గొన్నారు

# చిన్నదగడ, అమ్మాయిపల్లిలో మంత్రి జూపల్లి పర్యటన



● మంత్రి ప్రజలతో ముఖాముఖి
● అధికారులకు దిశానిర్దేశం చేసిన మంత్రి జూపల్లి కృష్ణారావు

ఉమ్మడి మహబూబ్ నగర్ ఏప్రిల్ 1 (మనం బ్యూరో): కొల్లాపూర్ నియోజకవర్గంలోని చిన్నదగడ, అమ్మాయిపల్లి గ్రామాల్లో మంత్రి జూపల్లి కృష్ణారావు పర్యటించారు. ఈ సందర్భంగా గ్రామంలోని సమస్యలు, జరుగుతున్న అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాల అమలు, లబ్ధిదారుల ఎంపిక తదితర అంశాలపై మంత్రి స్థానిక అధికారులు, ప్రజలతో ముఖాముఖి సమావేశం నిర్వహించారు. ప్రజలు తమ గ్రామ సమస్యలను మంత్రికి వివరించారు. వాటి పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకోవాలని అధికారులకు మంత్రి ఆదేశించారు. అభివృద్ధి పనుల్లో వేగం పెంచాలన్నారు. నాణ్యతలో ఎలాంటి రాజీ పడవద్దని సూచించారు. సంక్షేమ పథకాల అమలు పారదర్శకంగా ఉండాలన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ ప్రయోజనాలు చేరేలా కృషి చేయాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. గ్రామ స్థాయిలో సమస్యలను గుర్తించి వెంటనే పరిష్కరించడంలో అధికారులు చురుకుగా వ్యవహరించాలని మంత్రి జూపల్లి సూచించారు.

# ఆర్కె పురం డివిజన్లో బీజేపీ పార్టీకి ఊహించని షాక్

● బీజేపీ పార్టీ నుండి కాంగ్రెస్ పార్టీలోకి భారీ చేరికలు
● కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించిన కే ఎల్ ఆర్ , దేప



రంగారెడ్డి, ఏప్రిల్ 1 (మనం న్యూస్)ః మహేశ్వరం నియోజకవర్గం రామకృష్ణ పురం డివిజన్ లో రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ప్రజా ప్రభుత్వంలో జరుగుతున్న అభివృద్ధి, సంక్షేమం రెండు కండ్లుగా భావించి భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని ముందు వెళుతున్న సదర్భంగా ఆర్కె పురం డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పున్న గణేష్ నేత, రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు చిలుక ఉపేందర్ రెడ్డి ఆధ్వర్యంలో మాజీ శాసన సభ్యులు మహేశ్వరం నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ బాధ్యులు కిచ్చేన్నగారి లక్ష్మారెడ్డి , టి పీసీసీ ప్రతినిధి దేప భాస్కర్ రెడ్డి సమక్షంలో బీజేపీ పార్టీ ఆర్కె పురం డివిజన్ ప్రధాన కార్యదర్శి కందుకూరి సుదర్శన్, మాజీ వార్డ్ సభ్యుడు గుణగంటి రమేష్ గౌడ్, ఎన్టీఆర్ నగర్ ఫేజ్ -ఐఐ అధ్యక్షుడు కర్రే రవి లు కాంగ్రెస్ పార్టీ లో చేరారు. వారికి పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా కేఎల్ఆర్ మాట్లాడుతూ రాష్ట్రంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలో సామాన్యుడికి అందుతున్న సంక్షేమ పథకాలు , అభివృద్ధిని చూసి ఇతర పార్టీల నేతలు స్వచ్ఛందంగా కాంగ్రెస్ వైపు వస్తున్నారని పేర్కొన్నారు. బీజేపీ నాయకత్వంపై నమ్మకం కోల్పోయి, ఆ పార్టీలోని క్రియాశీలక నాయకులు బయటకు వస్తున్నారని, రాబోయే రోజుల్లో మహేశ్వరంలో బీజేపీ నామరూపాలు లేకుండా పోతుందని వారు విమర్శించారు. పార్టీలో చేరిన వారికి సరైన గుర్తింపునిస్తామని, ప్రతి కార్యకర్తను గుండెల్లో పెట్టుకుని కాపాడుకుంటామని హామీ ఇచ్చారు. అందరం కలిసికట్టుగా పనిచేసి మహేశ్వరాన్ని అభివృద్ధిలో అగ్రగామిగా నిలుపుతామని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో ఏఎంసీ డైరెక్టర్ బండి మధుసూదన్ రావు, ఖిల్లా మైసమ్మ దేవాలయం చైర్మన్ సురేష్, ముప్పిడి లింగస్వామి గౌడ్, పెద్దపూర సైదులు , మహేందర్, పగడాల ఎల్లయ్య, రాజు నాయక్,వెంకటేశ్వర్లు, జ్ఞానేశ్వర్ ,దుబ్బాక శేఖర్,యాదవ రెడ్డి,అక్బర్, శేఖర్ ,అల్లేటి కిరణ్, మహమ్మద్, భూపాల్ రెడ్డి,షఫీ,పాష పటేల్,నబీ, సమ్మద్, రేణుక, మాధవి, ఈశ్వరమ్మ, పార్వతమ్మ, లావణ్య, స్వరూప పాల్గొన్నారు.

# రూ . 15000 లంచం తీసుకుంటూ ఏసీబీకి చిక్కిన ఏఎస్ఐ



రంగారెడ్డి ఏప్రిల్ 1 (మనం న్యూస్) మల్కాజ్గిరి కమిషనరేట్ చైతన్యపురి పోలీస్ స్టేషన్లో విధులు నిర్వహిస్తున్న ఏఎస్సై బాలయ్య అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) వలలో చిక్కారు. కాంప్రమైజ్ అయిన మహిళా వేధింపుల కేసును రంగారెడ్డి జిల్లా కోర్టులో లోక్ అదాలత్ ద్వారా క్లోజ్ చేయించడానికి రూ.15 వేల లంచం డిమాండ్ చేశారు..! ఈ కేసు కాంప్రమైజ్ అయిన అనంతరం దాన్ని లోక్ అదాలత్ ద్వారా క్లోజ్ చేయించడానికి ఏఎస్సై బాలయ్య లంచం డిమాండ్ చేశారు. బాధితుడు పల్లపు రాంబాబు ఏసీబీ అధికారులను ఆశ్రయించి ఫిర్యాదు చేయగా.. అధికారులు ముందస్తుగా ట్రాప్ ఏర్పాటు చేసి కోర్టు ప్రాంగణంలోనే బాలయ్య లంచం తీసుకుంటుండగా రెడ్హ్యాండెడ్గా పట్టుకున్నారు. అనంతరం ఆయనను అదుపులోకి తీసుకుని విచారణ చేపట్టారు.

# మంత్రి లక్ష్మణ్ కుమార్కి ఉప్పల శుభాకాంక్షలు



రంగారెడ్డి ఏప్రిల్ 1 (మనం న్యూస్) ఎస్సీ, ఎస్టీ , మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ పుట్టిన రోజు సందర్భంగా టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, అంతర్జాతీయ ఆర్య వైశ్య ఫెడరేషన్ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ ,రాష్ట్ర అధ్యక్షుడు ఉప్పల శ్రీనివాస్ గుప్త శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రికి ఆయురారోగ్యాలు, దీర్ఘాయుష్షు కలగాలని ప్రజాసేవలో మరింత విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

# సర్కిల్ కార్యాలయలలో విజిలెన్స్ అధికారుల తనిఖీలు



రంగారెడ్డి ఏప్రిల్ 1 (మనం న్యూస్) మల్కాజ్గిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని సరూర్ నగర్, ఎల్బీనగర్, హయత్ నగర్ సర్కిల్ లలో హైదరాబాద్ రూరల్ యూనిట్ విజిలెన్స్ ఎన్ఫోర్స్మెంట్ ఆధ్వర్యంలో పలు విభాగాలలో తనిఖీలు నిర్వహించారు. విజిలెన్స్ ఐజి శిఖా గోయల్ సూచనలతో రీజినల్ ఎన్ఫోర్స్మెంట్ అధికారి శ్రీనివాస్ రెడ్డి సహకారంతో రెవెన్యూ, టౌన్ ప్లానింగ్, సానిటేషన్, తదితర విభాగాలలో తనిఖీలు చేపట్టారు. అనంతరం అధికారులు మాట్లాడుతూ ఇవి సాధారణ తనిఖీలు అని ఇక్కడ ఉన్న లోటుపాట్లను పై అధికారులకు తెలియజేస్తామని తెలిపారు. ఉదయం 11 గంటల నుండి సాయంత్రం 6 గంటల వరకు తనిఖీలు నిర్వహించడం జరిగిందని తెలిపారు.

# కాంగ్రెస్ 'యువరాజు'కు వందోసారి ఓటమి



● ప్రధాని నరేంద్ర మోడీ

**డిస్పూర్, ఏప్రిల్ 1:** అస్సాంలో బీజేపీ మూడోసారి హ్యాట్రిక్ కొట్టడం ఖాయమని ప్రధాని నరేంద్ర మోడీ అన్నారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీని ఉద్దేశిస్తూ.. 'ఆ పార్టీ యువరాజుకు వందోసారి కూడా ఓటమి తప్పదు' అని ఎద్దేవా చేశారు. అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో మోడీ అస్సాంలో పర్యటించారు. ఈ సందర్భంగా గోగముఖ్లో జరిగిన బహిరంగ సభలో మాట్లాడారు. 'అస్సాం మాజీ సీఎం సర్బానంద సోనోవాల్ నాయకత్వంలో, ప్రస్తుత సీఎం హిమంత బిశ్వశర్మ నాయకత్వంలో రాష్ట్రం చాలా అభివృద్ధి చెందింది. ఈసారి కూడా ఎన్డీయే ప్రభుత్వం హ్యాట్రిక్ కొట్టడం ఖాయం. అలాగే కాంగ్రెస్ కూడా వరుసగా మూడోసారి ఓటమి చవిచూడాల్సి వస్తుంది. ఆ పార్టీ యువరాజుకు వందోసారి కూడా ఓటమి తప్పదు' అని వ్యంగ్యాస్త్రాలు విసిరారు. కాంగ్రెస్ విభజన విధానాలను అనుసరిస్తోందని ఆరోపించారు. ఈ సందర్భంగా బీజేపీవిడుదల చేసిన మ్యానిఫెస్టో గురించి ప్రధాని ప్రస్తావించారు. అస్సాంలో ఉమ్మడి పౌర స్మృతి (యూసీసీ)ని అమలుచేస్తామని ప్రధాని మోడీ పేర్కొన్నారు. రాష్ట్రంలోని ఆదివాసీల హక్కులను కాపాడతామన్నారు.

అంతకుముందు దిబ్రుగఢ్ జిల్లాలోని ఒక తేయాకు తోటను ప్రధాని మోడీ సందర్శించారు. అక్కడి మహిళా కార్మికులతో కలిసి తేయాకు ఆకులను కోశారు. వారితో సెల్ఫీలు కూడా దిగారు. ఈ ఫొటోలను మోడీ తన అధికారిక ఎక్స్ ఖాతాలో పంచుకున్నారు.


# అల్లర్లు సృష్టించేందుకు బీజేపీ ప్లాన్

● తమిళనాడు సీఎం స్టాలిన్



**చెన్నై ,ఏప్రిల్ 1 :** తమిళనాడు అసెంబ్లీ ఎన్నికలకు సమయం దగ్గరపడుతున్న నేపథ్యంలో రాజకీయ పార్టీల మధ్య ఆరోపణలు, ప్రత్యారోపణలు వెల్లువెత్తుతున్నాయి. తాజాగా బీజేపీ లక్ష్యంగా రాష్ట్ర ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ ఘాటు వ్యాఖ్యలు చేశారు. యూపీ, మణిపూర్‌లో మాదిరిగా.. తమిళనాడులోనూ అల్లర్లు సృష్టించేందుకు బీజేపీకుట్ర పన్నిందని ఆరోపించారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా తిరుచ్చిలో జరిగిన బహిరంగ సభలో స్టాలిన్ మాట్లాడారు. బీజేపీపాలిత రాష్ట్రాల్లో కన్పించే ఘర్షణలు, మూక దాడులు తమిళనాడులో లేవన్నారు. ఈ సందర్భంగా యూపీ, మణిపుర్ పేర్లను ఆయన ప్రస్తావించారు. అయితే, తమిళనాడులో కూడా అలాంటి హింసాత్మక పరిస్థితులను సృష్టించేందుకు బీజేపీ కుట్ర పన్నిందని ఆరోపించారు. కానీ తమ పార్టీ ఆ కుట్రను భగ్నం చేసిందన్నారు. ఇక, రాష్ట్రంలో తమ పార్టీ అధికారంలోకి వస్తే.. మహిళలు తమకు నచ్చిన గృహోపకరణాలు కొనుగోలు చేసుకునేందుకు వీలుగా రూ.8వేల కూపన్‌ను అందిస్తామన్నారు. దీంతో పాటు ప్రతినెలా మహిళలకు రూ.2వేల ఆర్థికసాయం, కళాశాల విద్యార్థులకు రూ.1,500 ఇస్తామని హామీ ఇచ్చారు.

## ఇంధన ట్యాంకర్లే లక్ష్యంగా..
# ఖతార్, కువైట్‌పై డ్రోన్ దాడి



**కువైట్, ఏప్రిల్ 1:** పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు రోజురోజుకు తీవ్రంగా మారుతున్నాయి. తాజాగా ఖతార్‌లోని దోహాకు సమీపంలో ఓ ట్యాంకర్‌పై గుర్తుతెలియని క్షిపణి దాడి చేసింది. ఈ మేరకు యూకే సముద్ర వ్యవహారాల అథారిటీ వివరాలు వెల్లడించింది.

పోర్టు పక్కన నిలిచిఉన్న ఇంధన ట్యాంకర్‌పై జరిగిన దాడి కారణంగా నౌక ఎడమవైపు భాగం దెబ్బతింది. అయితే, దీనివల్ల చమురు లీకేజీకి, పర్యావరణానికి ఎలాంటి నష్టం కలగలేదని అథారిటీ పేర్కొంది. యుద్ధం మొదలైన నాటినుంచి అరేబియా గల్ఫ్, హర్మూజ్ జలసంధి, ఒమన్ గల్ఫ్‌తోపాటు వాటి పరిసర ప్రాంతాల్లోని నౌకలే లక్ష్యంగా దాదాపు 26 దాడులు జరిగినట్లు యూకే మారిటైమ్ ట్రేడ్ ఆపరేషన్స్ వెల్లడించింది.

మరోవైపు, కువైట్ అంతర్జాతీయ ఎయిర్‌పోర్టులోని ఇంధన ట్యాంకర్లే లక్ష్యంగా ఇరాన్ డ్రోన్ దాడి చేసింది. దీంతో ఆ పరిసర ప్రాంతాల్లో భారీ అగ్ని ప్రమాదం సంభవించింది. ఈ మేరకు దేశ పౌర విమానయాన శాఖ వెల్లడించింది. ఈ దాడిలో ఎవరికీ గాయాలు కాలేదు. కానీ ఇంధన ట్యాంకర్లకు గణనీయమైన నష్టం వాటిల్లినట్లు అంతర్జాతీయ మీడియా కథనాలు పేర్కొన్నాయి. ఘటనా స్థలంలో సహాయక చర్యలు కొనసాగుతున్నాయి.

# 4000 టార్గెట్లు.. 16 వేల బాంబులు
## ఇరాన్‌పై ఇజ్రాయెల్ పిడుగులు



**జరూసలెం, ఏప్రిల్ 1:** దాదాపు నెల రోజులకు పైగా ఇరాన్, దాని మిత్ర దేశాలపై అమెరికా సహకారంతో ఇజ్రాయెల్ విరుచుకుపడుతోంది. ఈ దాడులకు సంబంధించిన వివరాలను తాజాగా ఐడీఎఫ్ పంచుకుంది. యుద్ధం ప్రారంభమైన నాటినుంచి ఇప్పటివరకు 800 సార్లు తమ యుద్ధ విమానాలు ఇరాన్‌పైకి దూసుకెళ్లాయని ఇజ్రాయెల్ మిలిటరీ వెల్లడించింది. ఈ ఫైటర్‌జెట్లు 16వేలకు పైగా బాంబులను జారవిడిచినట్లు తెలిపింది.

''ఇరాన్ ప్రముఖ నాయకులు, మిలిటరీ కమాండర్లు, హెడ్‌క్వార్టర్లు, అణు స్థావరాలు, ఆయుధ తయారీ కేంద్రాలు, బాలిస్టిక్ క్షిపణి లాంచర్లు, ఎయిర్ డిఫెన్స్ వ్యవస్థలను ధ్వంసం చేశాం. యుద్ధం మొదలైన నాటినుంచి 4వేల లక్ష్యాలపై 10వేలకు పైగా దాడులు చేశాం. దాదాపు 16వేల బాంబులను జారవిడిచాం. ఈ దాడుల్లో ఇరాన్‌కు చెందిన 2వేల మందికి పైగా సైనికులు, కమాండర్లు హతమయ్యారు. కేవలం 40 సెకన్లలోనే 40 మందికి పైగా సీనియర్ అధికారులను అంతమొందించాం'' అని ఐడీఎఫ్ వెల్లడించింది. మరో 5వేల కొత్త టార్గెట్లను కూడా గుర్తించినట్లు తెలిపింది. ఇరాన్, దాని అనుబంధ గ్రూప్లు తమపై బెదిరింపులకు పాల్పడుతున్నాయని, వాటిని అడ్డుకోవడమే తమ లక్ష్యమని ఐడీఎఫ్ పునరుద్ఘాటించింది. మరోవైపు అమెరికా సెంట్రల్ కమాండ్ కూడా యుద్ధంపై స్పందించింది. ఇరాన్‌లోని భూగర్భ లక్ష్యాలను కూడా ఛేదించినట్లు వెల్లడించింది. ఇందుకు సంబంధించిన ఓ వీడియోను తాజాగా విడుదల చేసింది.

# ఎల్డీఎఫ్ గెలుపునకు మోడీ ప్రయత్నం

## రాహుల్ గాంధీ ఆరోపణ



**కోళికోడ్, ఏప్రిల్ 1:** కేరళలో లెఫ్ట్,బీజేపీలు కలిసి పని చేస్తున్నాయని, ఎల్డీఎఫ్ గెలవాలని ప్రధాని మోడీ కోరుకుంటున్నారని కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్ గాంధీ ఆరోపించారు. ఎల్డీఎఫ్, బీజేపీ ఉమ్మడి శత్రువును తమ కూటమి యూడీఎఫ్ ఎదుర్కొంటోందని పేర్కొన్నారు. కోళికోడ్ జిల్లాలోని కన్నూర్, కల్లాచి, పెరంబ్ర, కోయిలాండిలలో జరిగిన ఎన్నికల ప్రచార సభల్లో ఆయన మాట్లాడారు. ఆయన వెంట సీపీఎం మాజీ నేతలు వి.కునిహికృష్ణన్, టీకే గోవిందన్ ఉన్నారు. వారిద్దరు స్వతంత్ర అభ్యర్థులుగా పోటీ చేస్తున్నారు. వారికి యూడీఎఫ్ మద్దతిస్తోంది. 'ఈ ఎన్నికలు రెండు సిద్ధాంతాల మధ్య జరుగుతున్నాయి. తొలిసారిగా బీజేపీ, ఎల్డీఎఫ్ పొత్తు పెట్టుకోవడాన్ని చూస్తున్నాం. లెఫ్ట్ పార్టీలు మితవాదులతో పొత్తు పెట్టుకోవడం ఆశ్చర్యాన్ని కలిగిస్తోంది. వారి సిద్ధాంతాలు పూర్తిగా వైరుధ్యంతో కూడుకున్నవి. ఈ పొత్తు నచ్చకే సీనియర్ నేతలు బయటకు వచ్చి స్వతంత్రంగా పోటీ చేస్తున్నారు' అని వ్యాఖ్యానించారు. ఇతర చోట్ల మతం, దేవుడి గురించి మాట్లాడే మోడీ.. కేరళలో ఆ విషయాలను ప్రస్తావించరని విమర్శించారు.

# తుక్కు నౌకలు.. మడ్డి చమురు..



## ఇవే ఇరాన్ రహస్య ఆయుధాలు

## కారు చౌకగా క్రిప్టో మైనింగ్.. ఆపై కనకవర్షం..!

**టెహ్రాన్, ఏప్రిల్ 1:** వేల కొద్దీ అంతర్జాతీయ ఆంక్షలు.. అమెరికాకు భయపడి అంటీముట్టనట్లుండే మిత్రులు డాలర్‌తో పోలిస్తే పాతాళానికి పడిపోయిన కరెన్సీ.. మరోవైపు ఆధునిక కాలంలో యుద్ధం అంటే కరెన్సీ కట్టలను కుప్పలు పోసి తగలపెట్టడం లాంటిదే.. సొంతంగా ఆయుధాలు తయారు చేసుకోవాలన్నా భారీగా సొమ్ములు అవసరం. దాదాపు నెల రోజులుగా ఇరాన్ తనపై ఇజ్రాయెల్, అమెరికా చేస్తున్న దాడులకు బలంగా సమాధానం ఇస్తోంది. ఆ దేశం వద్ద ఆదాయానికి ఉన్న మార్గాలు మొత్తం మూసుకుపోయినా ఎలా సాధ్యమైంది. ఇరాన్ ఆంక్షలకు రాటుదేలిపోయింది.. తన వద్ద ఉన్న వనరులను వాడుకొని వాటికి ప్రత్యామ్నాయ మార్గాలను కనుగొని చురుగ్గా ఉపయోగించుకుంటోంది. దీంతో అమెరికా, ఇజ్రాయెల్‌ను ఎదురు దాడులతో ఉక్కిరిబిక్కిరి చేస్తోంది.

ఇరాన్ నుంచి కొన్నేళ్లుగా అంతర్జాతీయ చమురు ఎగుమతులు నిలిచిపోయాయి. కానీ, ఆ దేశం వద్ద చమురు నిల్వలు పుష్కలంగా ఉన్నాయి. మరోవైపు క్రిప్టో మైనింగ్‌కు భారీగా విద్యుత్తు అవసరం. ఇక్కడే టెహ్రాన్ తెలివిగా ఆలోచించింది. చైనా సహకారంతో బిట్కాయిన్ మైనింగ్‌కు పెట్టుబడులను సాధించింది. 2019లో ఇరాన్‌లో క్రిప్టో మైనింగ్ చట్టబద్ధం చేసి.. లైసెన్స్‌లను జారీ చేయడం మొదలుపెట్టింది. వీరికి అవసరమైన విద్యుత్తును అధిక రేట్లకు విక్రయించింది. ప్రభుత్వ సాయంతో కూడా మైనింగ్ కొనసాగింది. ఇరాన్‌కు చెందిన రివల్యూషనరీ గార్డ్స్ కోర్ కూడా దీనిలో చురుకైన పాత్ర పోషించింది. ఇరాన్‌లో 2020లో బిట్కాయిన్ మైనింగ్‌కు 600 మెగావాట్ల విద్యుత్తును వాడినట్లు బైనాన్స్.కామ్ పేర్కొంది. ఇది కోటి బ్యారెళ్ల చమురుతో సమానం. ఇరాన్‌కు ఒక బిట్కాయిన్ మైనింగ్‌కు 1,300 డాలర్లు మాత్రమే ఖర్చవుతుందని అమెరికాకు చెందిన క్రిప్టో స్ట్రాటజిస్ట్ జాక్ పెర్రీ వెల్లడించారు. ఇదే అంతర్జాతీయ మార్కెట్లో 60,000-75,000 డాలర్ల మధ్యలో ట్రేడవుతోంది. పైగా దీనిపై అమెరికా డాలర్ వలే ప్రపంచ బ్యాంకింగ్ వ్యవస్థలోని అమెరికా ట్రెజరీ, స్విఫ్ట్ వ్యవస్థ ఆంక్షలు దీనిపై పనిచేయవు.

2025 నాటికి ఇరాన్ వద్ద 7.78 బిలియన్ డాలర్లు విలువైన క్రిప్టో సామ్రాజ్యం ఉన్నట్లు బ్లాక్‌చైన్ ఎనాలసిస్ సంస్థ అంచనా వేసింది. వీటిల్లో సగానికి పైగా ఐఆర్జీసీ నుంచే వచ్చాయి. ఒక్క 2025లోనే 3 బిలియన్ డాలర్ల విలువైన క్రిప్టోను తరలించేశారు. అమెరికా దాడులు మొదలయ్యాక ఇరాన్ అతిపెద్ద క్రిప్టో ఎక్స్ఛేంజి నోబిటెక్స్ నుంచి మొదటి మూడురోజుల్లో 10 మిలియన్ డాలర్ల విలువైన బిట్కాయిన్‌లు విదేశీ ఎక్స్ఛేంజిలకు వెళ్లిపోయాయి. ఇది ఆ ఎక్స్ఛేంజి సాధారణ సగటు కంటే 873% అధికం.

పాత నౌకలను యజమానులు తుక్కు కింద విక్రయిస్తారు. ఇరాన్‌కు చెందిన డీలర్లు హాంకాంగ్, యూఏఈ వంటి దేశాల్లో వీటిని కొనుగోలు చేసి పెయింటింగ్, పేర్లు మార్పులు చేసి పనామా, మార్షల్ ఐలాండ్స్ వంటి చోట్ల రిజిస్టర్ చేస్తుంటారు. కొన్ని సందర్భాల్లో పాత నౌకలను అలానే చమురు లోడ్ చేసి వినియోగిస్తారు. కొన్ని సందర్భాల్లో అరేబియా సముద్రం మధ్యలో లేదా మలేసియా జలాల్లో పాత ట్యాంకర్ నుంచి మరో ట్యాంకర్ నౌకలోకి చమురును లోడింగ్ చేస్తుంటారు. ఒక ఏడాదిలో ఇరాన్ నుంచి ఈ షాడో ఫ్లీట్ 1,000 ట్రిప్స్ వేసినట్లు వాల్‌స్ట్రీట్ జర్నల్ ఈ ఏడాది జనవరిలో ప్రచురించిన కథనంలో వెల్లడించింది. కెప్లర్ అంచనాల ప్రకారం ఒక్క 2025లోనే ప్రపంచ వ్యాప్తంగా ఈ షాడో ఫ్లీట్ 3.7 బిలియన్ బ్యారెళ్ల చమురును తరలించి ఉంటుందని కెప్లెర్ అంచనా వేసింది. వీటిలో ఇరాన్, రష్యా, వెనుజువెలా చమురే అత్యధికం. ఈ ఏడాది ఫిబ్రవరిలో భారత్ ఇటువంటి నౌకలనే భారత కోస్టార్డ్ అడ్డుకొన్న విషయం తెలిసిందే.

ఇరాన్ చమురు, ఆయుధాలు, ఆదాయం మొత్తం నెట్‌వర్క్‌ను దుబాయ్ కేంద్రంగా 'హెచ్' లేదా హెక్టార్ పేరిట పిలిచే వ్యక్తి నిర్వహిస్తున్నట్లు బ్లూమ్‌బర్గ్ పరిశోధనాత్మక కథనంలో వెల్లడించింది. ఈ వ్యక్తి ఎవరో కాదు.. హుస్సేన్ షంఖానీ అని బ్లూమ్‌బర్గ్ ధ్రువీకరించుకొంది. ఇరాన్‌లోని ఖమేనీ తర్వాత అత్యంత శక్తిమంతమైన నేతల్లో ఒకరైన అలీ షంఖానీ తనయుడు. ఖమేనీపై దాడి జరిగిన రోజే అలీ కూడా మృతి చెందారు. వాస్తవానికి అలీ ఇరాన్-ఇరాక్ యుద్ధంలో నౌకాదళాన్ని కమాండ్ చేశారు. ఆ తర్వాత ఇరాన్‌లో చాల కీలకమైన వ్యక్తిగా ఎదిగి నేషనల్ సెక్యూరిటీ కౌన్సిల్ కార్యదర్శి స్థాయికి చేరారు.ఇరాన్ చమురు ఆధారిత ఆర్థిక వ్యవస్థ. అక్కడ ఆయిల్‌పై ఎవరి పెత్తనం ఉంటే వారిదే అధికారం. ఆ దేశంలో విప్లవానికి కూడా చమురే ఓ రకంగా కారణం. ఇరాన్ -ఇరాక్ యుద్ధం తర్వాత ఐఆర్జీసీ అనుకున్నదాని కంటే బలంగా తయారై విస్తరించింది. వివిధ రంగాల్లో అడుగుపెట్టింది. ఇరాన్ పాలనలో హైబ్రీడ్ విధానం కనిపిస్తుంది. కొంత ప్రభుత్వ పాలనలో ఉంటే.. మరికొంత శక్తిమంతమైన అధికారుల కుటుంబాల వద్ద ఉంటుంది. అఘూజాదే (ఉన్నత వర్గం పిల్లలు) అనే వ్యవస్థను ఇరాన్ అనుసరిస్తుంది. శక్తిమంతమైన స్థానాల్లో వారి కుటుంబ సభ్యులు కీలక స్థానాల్లో ఉంటారు. ఇక్కడ నియామకాలకు విశ్వసనీయతే ప్రామాణికం.

# మెజారిటీ రాకపోతే విజయ్‌తో కలుస్తాం

● కేంద్ర సహాయ మంత్రి రామ్ దాస్ అథావలె



**చెన్నై, ఏప్రిల్ 1:** తమిళనాడులో మెజారిటీ రాకపోతే సినీ నటుడు,టీవీకే అధ్యక్షుడు విజయ్‌తో కలిసి కూటమి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తామని కేంద్ర సహాయ మంత్రి రామ్ దాస్ అథావలె తెలిపారు. పుదుచ్చేరిలో ఆయన విలేకరులతో మాట్లాడుడారు. పుదువైలో మళ్లీ కూటమి పాలన ఏర్పాటుకు పార్టీ తోడ్పడుతుందున్నారు. కేరళలో సీపీఎం పాలనపై ప్రజలకు నమ్మకం పోయిందని, అక్కడ బీజేపీ విజయం సాధిస్తుందన్నారు. పశ్చిమబెంగాల్లో మమతా పాలన ముగిసిపోతుందని చెప్పారు. తమిళనాడులో మళ్లీ డీఎంకే అధికారంలోకి రాదని తెలిపారు. ఎన్నికల ఫలితాల తర్వాత పాలనకు మెజారిటీ లేకపోతే టీవీకే అధ్యక్షుడు విజయ్‌తో చర్చించి ఎన్డీయే కూటమి అధికారం చేపడుతుందన్నారు.

# కుప్పకూలిన విమానం




**మాస్కో, ఏప్రిల్ 1:** రష్యాలో ఘోర ప్రమాదం చోటుచేసుకుంది. ఆ దేశ సైనిక రవాణా విమానం కుప్పకూలింది. ఈ ఘటనలో 29 మంది ప్రాణాలు కోల్పోయారు. రష్యా విదేశాంగ అధికారులను ఉటంకిస్తూ ఆ దేశ మీడియా ఈ విషయాన్ని వెల్లడించింది. దాని ప్రకారం.. రష్యా సైనిక విభాగానికి చెందిన ఏఎన్-26 విమానం క్రిమియా మీదుగా వెళ్తుంది.

ఈక్రమంలో దాని సంబంధాలు తెగిపోయాయి. ఆ తర్వాత అది కుప్పకూలిపోయింది. ఈ ఘటనలో 23 మంది ప్రయాణికులతో సహా ఆరుగురు సిబ్బంది ప్రాణాలు కోల్పోయారు. సాంకేతిక సమస్య వల్లే ఈ ప్రమాదం జరిగిందని రష్యా రక్షణశాఖ పేర్కొంది. విమానంపై దాడి జరిగినట్లుగా ఎలాంటి ఆధారాలు లేవని తెలిపింది. ఈ ప్రమాదానికి గల కారణాలు తెలుసుకునేందుకు దర్యాప్తు ప్రారంభించినట్లు వెల్లడించింది.

# ఇరాన్ దిశగా మూడో విమాన వాహక నౌక

## అమెరికా రక్షణ మంత్రి పీట్ హెగ్సెత్




**వాషింగ్టన్, ఏప్రిల్ 1:** రాబోయే రోజుల్లో ఇరాన్‌పై దాడులు మరింత భీకరంగా ఉంటాయని అమెరికా హెచ్చరించిన వేళ కీలక పరిణామం చోటుచేసుకుంది. అగ్ర రాజ్యానికి చెందిన మరో విమాన వాహక నౌక పశ్చిమాసియాలో మోహరించనుంది. యూఎస్ఎస్ హెచ్‌డబ్ల్యూ బుష్ నౌక పశ్చిమాసియా దిశగా బయల్దేరిందని అమెరికా రక్షణ మంత్రి పీట్ హెగ్సెత్ వెల్లడించారు.

వర్జీనియాలోని నార్‌ఫోల్క్ నుంచి ఈ విమాన వాహక నౌక బయల్దేరింది. ఇప్పటికే పశ్చిమాసియాలో యూఎస్ఎస్ జెరాల్ ఆర్ ఫోర్డ్, యూఎస్ఎస్ అబ్రహం లింకన్ అనే రెండు విమాన వాహక నౌకలు మోహరించిన సంగతి తెలిసిందే. వాటికి అదనంగా యూఎస్ఎస్ హెచ్‌డబ్ల్యూ బుష్ రంగంలోకి దిగనుంది. యూఎస్ఎస్ జెరాల్ ఆర్ ఫోర్డ్‌లో సమస్యలు ఎదురైనట్లు ఇటీవల వార్తలు వచ్చినవేళ.. ఈ పరిణామం చోటుచేసుకోవడం గమనార్హం.

ఇరాన్‌లో దాదాపు నెల రోజులకు పైగా సాగుతోన్న యుద్ధంలో అత్యంత కీలకమైన రోజులు త్వరలో ప్రారంభం కానున్నాయని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఇటీవల హెచ్చరించారు. ఈనేపథ్యంలో వేలాది మంది అమెరికా సైనికులు పశ్చిమాసియా వైపు వెళ్తున్నారని అంతర్జాతీయ మీడియా కథనాలు రాసుకొచ్చాయి. ఇరాన్‌లో భూతల దాడుల కోసమే వీరిని పంపుతున్నట్లు అంచనాలు వెలువడుతున్నాయి.

# వయసుతో పాటు పెరుగుతున్న రొమ్ము క్యాన్సర్.!



## సవివర మ్యాప్‌ను రూపొందించిన శాస్త్రవేత్తలు

**ఢిల్లీ,ఏప్రిల్ 1:** రొమ్ము కణజాలానికి సంబంధించిన సవివర మ్యాప్‌ను శాస్త్రవేత్తలు అభివృద్ధి చేశారు. మహిళలకు వయసు మీదపడే కొద్దీ కణాలు క్షీణించడంతోపాటు వాటి వృద్ధి తక్కువగా ఉంటున్నట్లు ఇవి స్పష్టంచేస్తున్నట్లు వివరించారు. తద్వారా ఒక సూక్ష్మ వాతావరణం ఏర్పడుతుందని, అందులో క్యాన్సర్ కణాలు వృద్ధికి అనుకూల పరిస్థితులు ఉంటాయని తెలిపారు. కేంబ్రిడ్జ్ విశ్వవిద్యాలయ శాస్త్రవేత్తలు ఈ పరిశోధన చేశారు.

ప్రపంచవ్యాప్తంగా ఏటా 20 లక్షల మందికిపైగా మహిళలు రొమ్ము క్యాన్సర్ బారినపడుతున్నా.. ఆ సమస్య ఎప్పుడు, ఎందుకు వస్తుందన్నదానిపై అస్పష్టత నెలకొందని తాజా పరిశోధనకు నాయకత్వం వహించిన పుల్కిత్ గుప్తా తెలిపారు. ''కణాలు విభజనకులోనై, స్వీయ ప్రతులను సృష్టించుకునే క్రమంలో వాటిలో ఉత్పరివర్తనలు పోగుపడతాయి. అవి క్యాన్సర్కు కారణం కావొచ్చు. అయితే చిన్న వయసులో ఉన్నప్పుడు ఈ ఉత్పరివర్తనలను శరీరం ఎలా వదిలించుకోగలుగుతోంది? వయసు మీదపడ్డాక ఆ పనిచేయడానికి ఎందుకు కష్టపడుతోందన్నది అంతుచిక్కకుండా ఉంది'' అని పేర్కొన్నారు. మహిళలను పీడిస్తున్న క్యాన్సర్లలో రొమ్ము క్యాన్సర్ వాటా ఎక్కువ. 80 శాతం కేసులు.. 50 ఏళ్లు పైబడ్డ అతివల్లోనే చోటుచేసుకుంటున్నాయి. వయసు మీదపడేకొద్దీ ఈ క్యాన్సర్ బారినపడే ముప్పు పెరుగుతూనే ఉంటుంది.

ఇమేజింగ్ విధానాల సాయంతో.. 15 నుంచి 86 ఏళ్ల మధ్య ఉన్న 500 మంది మహిళల రొమ్ము కణజాలాన్ని శాస్త్రవేత్తలు విశ్లేషించారు. ఈ చిత్రాలను హార్మోన్ గ్రాహకాలు, రోగనిరోధక కణాలు, కణజాల తీరుతెన్నులతో కలిపి ఒక మ్యాప్ను వారు తయారుచేశారు. కాలక్రమంలో రొమ్ము కణజాలం ఎలా మారుతుందన్నది కళ్లకు కట్టారు. ''వయసు మీదపడేకొద్దీ కణజాలంలో తక్కువ సంఖ్యలో కణాలు ఉంటున్నాయి. చాలా తక్కువగా విభజన చెందుతున్నాయి. పాలను ఉత్పత్తి చేసే లోబ్యూల్స్ తగ్గిపోవడమో, అదృశ్యం కావడమో జరుగుతోంది. డక్టు.. దట్టమైన సపోర్టింగ్ పొరలతో మరింత పెద్దగా మారుతున్నాయి. కొవ్వు కణాలు పెరుగుతున్నాయి. రక్తనాళాలు తగ్గుతున్నాయి'' అని గుప్తా పేర్కొన్నారు. మెనోపాజ్ దశలో రొమ్ము కణజాలంలో నాటకీయ మార్పులు జరుగుతున్నట్లు గుర్తించామన్నారు. 20లు, 30ల్లో ఉన్న మహిళల రొమ్ముల్లో బి కణాలు, క్రియాశీల టి కణాలు ఎక్కువగా ఉన్నాయని చెప్పారు. ఈ రోగ నిరోధక కణాలు.. క్యాన్సర్ కణాలను గుర్తించి, చంపడంలో సాయపడతాయని పేర్కొన్నారు.

# ప్రతి నెల వందకుపైగా ఫోన్స్ రికవరీ




- జిల్లాలో 11వ సారి బాధితులకు మొబైల్స్ అందజేత
- పోలీసు ప్రజల భద్రతలో కృతనిచ్చయంతో పని చేస్తుంది
- ప్రతి ఒక్కరూ చట్టపరిదిలో బాధ్యతగా నడుచుకోవాలి
- తప్పులు చేసే వాళ్లకు ఫ్రెండ్లీ పోలీస్ ఉండదు
- ఆర్థిక పరమైన అంశాలకు మొబైల్ ప్రదాన్యమైనది
- సంవత్సర కాలంలో 1540 మొబైల్స్‌ను బాధితులకు అందించాం
- మొబైల్ కేంద్రంగా సైబర్ మోసాలు ఫోన్ వినియోగించడంలో జాగ్రత్తలు పాటించాలి
- జిల్లా ఎస్పీ కే నరసింహ

**సూర్యాపేట ఏప్రిల్ 01 (మనం ప్రతినిధి):** ప్రయాణ సమయంలో జాగ్రత్తలు పాటించాలి వాహనాలు నడిపేటప్పుడు డిఫెన్సివ్ డ్రైవింగ్ చేయాలి, ప్రతి ప్రయాణం సురక్షిత గమ్యం చేరడం లక్ష్యంగా అరైవ్ అలైవ్ రోడ్డు భద్రత ఉద్యమం అవగాహన కార్యక్రమం నిర్వహిస్తున్నాం అని జిల్లా ఎస్పీ కె.నరసింహ అన్నారు.బుధవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో సెల్ ఫోన్ రికవరీ మేళా ఏర్పాటు చేసి జిల్లాలో ప్రజలు వివిధ రూపాల్లో పోగొట్టుకున్న సుమారు 20 లక్షల రూపాయల విలువ గల 106 ఫోన్ల ను గుర్తించి రికవరీ చేసి జిల్లా ఎస్పీ నరసింహ ఐపిఎస్ గారి చేతుల మీదుగా 11వ సారి సంబంధిత మొబైల్ ఫోన్ల యజమానులకు (భాదితులకు) అందజేయడం జరిగింది ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ....ప్రస్తుత రోజుల్లో మొబైల్ ఫోన్ ప్రతి ఒక్కరికీ నిత్యవసరమైనది, దీనిని కమ్యూనికేషన్ కోసం, ఆన్లైన్ విద్య కోసం, ఆర్థిక పరమైన అంశాలకు వినియోగిస్తున్నాం, మన యొక్క విలువైన సమాచారం బ్యాంక్ అకౌంట్స్, పాస్ వర్డ్స్, సోషల్ మీడియా అకౌంట్స్, వ్యక్తిగత ఫోటోలు మొదలైన వంటివి ఫోన్ లో నిక్షిప్తం చేసుకుంటున్నాము అన్నారు, మొబైల్ చోరికి గురైనా, పోగొట్టుకున్నా అందులో ఉన్న సమాచారం పోతుంది. నేరగాళ్లు మొబైల్ దొంగిలించి, వీక్ పాస్ వరడ్స్ లను బ్రేక్ చేసి ఫోన్ పే, గూగుల్ పే తదితర మద్యమాల ద్వారా డబ్బులు కాజేస్తున్నారన్నారు. మొబైల్ ఫోన్ పోగొట్టుకున్న వ్యక్తులు కేవలం మొబైల్ ఫోన్ మాత్రమే కాకుండా తమ వ్యక్తిగత సమాచారంతో సహ డబ్బులను కూడా కోల్పోవడం జరుగుతున్నారు. ఒక్కో మొబైల్ రికవరీ చేయడానికి సైబర్ వారియర్స్ పోలీస్, టెక్నికల్ టీం పోలీసు సిబ్బంది చాలా కృషి చేశారు, ఇతర రాష్ట్రాల వారి నుండి ఈ మొబైల్స్ ను రికవరీ చేశారు. ₹పోలీసు ప్రజల ఆస్తుల రక్షణలో అనుక్షణం ప్రజల పక్షాన పని చేస్తుంది, తప్పుడు ప్రవర్తన కలిగిన వ్యక్తులకు, నేరాలకు పాల్పడే వారికి ఫ్రెండ్లీ పోలీస్ ఉండదు, సామాన్యుల పట్ల మాత్రమే ఫ్రెండ్లీ పోలీస్ అన్నారు.₹ ఎవరైన మొబైల్ పోగొట్టుకున్న లేదా దొంగిలించబడిన వెంటనే ఇఉఐఖ పోర్టల్ ( జ్టిఇట//ఠీఠీఠీ.ఛ్ఛిజీట.జౌఠి.జీ ) నందు నమోదు చేసుకోవాలి, మొబైల్ ను బ్లాక్ చేసి, మీ సేవా ద్వారా ధరఖాస్తు సంభందిత పోలీసు స్టేషన్ లో సమాచారం ఇవ్వాలని సూచించారు. పోలీసు శాఖ కృత నిచ్చయంతో పని చేసి ఈరోజు పెద్దమొత్తంలో ఫోన్స్ రికవరీ చేసి ఇక్కడ భాదితులకు అందించడం జరిగినది అన్నారు.

### రోడ్డు భద్రత చర్యలు పాటించాలి

ప్రయాణ సమయంలో జాగ్రత్తలు పాటించాలి, వాహనాలు నడిపేటప్పుడు డిఫెన్సివ్ డ్రైవింగ్ చేయాలి, ప్రతి ప్రయాణం సురక్షిత గమ్యం చేరడం లక్ష్యంగా ₹అరైవ్ అలైవ్₹ రోడ్డు భద్రత ఉద్యమం అవగాహన కార్యక్రమం నిర్వహిస్తున్నాం. రోడ్లపై ప్రయాణం చేసే సమయంలో అత్యంత అప్రమత్తంగా వాహనాలు నడపాలి, కుటుంబ పెద్ద కు రోడ్డు ప్రమాదం సంభవించి ప్రాణాలు కోల్పోయే కుటుంభం పెద్ద దిక్కు కోల్పోతుంది పేర్కొన్నారు .రోడ్డు భద్రత, రోడ్డు ప్రమాదాల నివారణ కోసం పోలీసు శాఖ అరైవ్ అలైవ్ అనే భద్రత మహా ఉద్యమ కార్యక్రమాన్ని నిర్వహిస్తూ రోడ్డు భద్రత అపై విస్తృతంగా అవగాహన కల్పిస్తున్నాం అని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఐ టి.కోర్ ఆర్ఎస్ఐ రాజశేఖర్, ఐటి కోర్ సిబ్బంది, మొబైల్ పోగొట్టుకున్న బాధితులు ఉన్నారు.

# పాత జీఓ ప్రకారం అక్రిడేషన్ కార్డులు ఇవ్వాలి

## పట్టణాల్లో అక్రిడేషన్ కార్డుల సంఖ్యను పెంచాలి

## జిల్లా కలెక్టర్ కు జర్నలిస్టు సంఘాల వినతి పత్రం అందజేత




**సూర్యాపేట, ఏప్రిల్ 01 (మనం ప్రతినిధి):** ప్రభుత్వ నూతన జీవోతో అక్రిడేషన్ కార్డులను తగ్గించడం సరి కాదని పాత జీవో ప్రకారం అర్హులైన ఆందరికి అక్రిడేషన్ కార్డులు ఇవ్వాలని కోరుతూ జర్నలిస్టు సంఘాల ఆధ్వర్యంలో బుదవారం స్థానిక కలెక్టరేట్లో జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవర్ కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జర్నలిస్టు సంఘాల నాయకులు వజ్జ వీరయ్య, గుండా శ్రీనివాస్ గుప్తా, మిక్కిలినేని శ్రీనివాసరావులు మాట్లాడుతూ.. పాత జీవో ప్రకారం పట్టణంలో పని చేసే ప్రతి విలేకరికి అక్రిడేషన్ కార్డులు అందజేయాలని మండలాల విలేకరులకు యదావిధిగా కార్డులు ఉన్నప్పటికి పట్టణాల్లో కార్డుల సంఖ్యను తగ్గించడం సరి కాదన్నారు. బీట్ల పరంగా చూసుకుంటే పట్టణాల్లో మున్సిపాల్టీ, కలెక్టరేట్, క్రైం తదితర విలేకరులు విధులు నిర్వహిస్తుంటారు. దీన్ని దృష్టిలో పెట్టుకొని సమాచార శాఖ ప్రభుత్వ అనుమతితో వారందరికి అక్రిడేషన్ కార్డులు ఇవ్వాలన్నారు. దీనిపై రాష్ట్ర సర్కార్ పునరాలోచించి కొత్త జీవో ద్వారా కాకుండా పాత జీవో పరిగణంలోకి తీసుకొని జర్నలిస్టులకు అక్రిడేషన్ కార్డులు కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో జర్నలిస్టు సంఘాల నాయకులు వాసా చంద్రశేఖర్, నాయిని శ్రీనివాసరావు, షేక్ జహంగీర్, శ్యాంసుందర్రెడ్డి, రాంబాబు, వల్లాస్ ప్రవీణ్, బుక్క రాంబాబు, శేఖర్, గునగంటి సురేష్, చౌగాని నరేందర్, యాకయ్య, పి.సైదిరెడ్డి, దేవరగట్ల సతీష్, సుంకరబోయిన వెంకటయ్య, కందుల నాగరాజు, రవి, పడిసిరి వెంకట్, పిన్నెల్లి వెంకటేష్ తదితరులు ఉన్నారు.

# శాలిగౌరారం మండలంలో కలెక్టర్ చంద్రశేఖర్ సుడిగాలి పర్యటన

- ప్రభుత్వ సంస్థల తనిఖీ
- ప్రభుత్వ పథకాల అమలుపై క్షేత్రస్థాయిలో సిబ్బందికి సూచనలు

**నల్లగొండ-- ఏప్రిల్ 1 (మనం ప్రతినిధి ):** ఉపాధి హామీ పనులు చేసే చోట కూలీలకు నీడతోపాటు, తాగునీరు, ఇతర సౌకర్యాలు ఏర్పాటు చేయాలని జిల్లా కలెక్టర్ బి .చంద్రశేఖర్ జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారిని ఆదేశించారు.వన మహోత్సవం కింద రానున్న వర్షాకాలంలో మొక్కలు నాటేందుకుగాను అన్ని గ్రామాలలో మొక్కలు నాటే స్థలాలను గుర్తించాలని, నర్సరీలలో పెంచుతున్న మొక్కల గురించి గ్రామసభలలో ప్రజలకు తెలియజేసి వారి అభిప్రాయాలను తీసుకోవాలని సూచించారు. బుధవారం జిల్లా కలెక్టర్ నల్గొండ జిల్లా, శాలిగౌరారం మండలం, వల్లాల, అడ్లూరు గ్రామాలలో పర్యటించి పలు ప్రభుత్వ సంస్థలను,ప్రభుత్వ పనులను తనిఖీ చేశారు. ముందుగా వల్లాల గ్రామంలో గ్రామీణ అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో పెంచుతున్న వనమహోత్సవం నర్సరీని తనిఖీ చేశారు. నర్సరీలో పెంచుతున్న మొక్కలు,వాటి రకాలు, గ్రామపంచాయతీ ద్వారా వాన కాలంలో నాటనున్న మొక్కల టార్గెట్, మొక్కలు నాటే స్థలాల గుర్తింపు, గృహాలకు పంపిణీ చేసే మొక్కలు, జియో ట్యాగింగ్ తదితర వివరాలన్నింటిని ఏపీఎం శంకరయ్య ,ఎపీవో జంగమ్మ, వన సేవకుడు తంబయ్య ద్వారా అడిగి తెలుసుకున్నారు. నర్సరీలో పెంచుతున్న మొక్కలకు ఎప్పటికప్పుడు నీరు పోస్తూ సంరక్షించాలని, నర్సరీలో పెంచుతున్న మొక్కల విషయాలను గ్రామసభలో గ్రామస్తులకు చదివి వినిపించి వారి అభిప్రాయం సేకరించి గ్రామానికి అవసరమైన మొక్కలను పెంచేందుకు ప్రణాళిక రూపొందించాలని, వానకాలంలో నాటనున్న మొక్కలకు ముందే స్థలాలను గుర్తించి ప్రణాళిక రూపొందించాలని, గ్రామానికి నిర్దేశించిన 13800 మొక్కలు నాటేందుకు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. అనంతరం పక్కనే ఉన్న పల్లె ప్రకృతి వనాన్ని జిల్లా కలెక్టర్ తనిఖీ చేసి గ్రామస్తుల ఉదయం నడకకు అవసరమైన చర్యలు చేపట్టాలని సూచించారు. అనంతరం వల్లాల గ్రామ చెరువులో ఉపాధి హామీ పథకం కింద కూలీలు ఫిష్ పాండ్ తవ్వుతుండగా తనిఖీ చేశారు. కాగా ఉపాధి హామీ పథకం కింద 6 లక్షల రూపాయల అంచనా వ్యయంతో 3000 పని దినాలు కల్పించేందుకు ఫిష్ పాండ్ పనులు చేపట్టగా, కూలీలతో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఎంతమంది వస్తున్నారని? పని ఎప్పుడు ప్రారంభించారని? మెజర్మెంట్ ఎంత తీసుకున్నారని? అడిగారు. ఎండలకు పనిచేయలేకపోతున్నామని కూలీలు జిల్లా కలెక్టర్ కు తెలుపగా ఉదయం వచ్చి పని చేసుకోవాలని, తక్కువ పని చేస్తే తక్కువ వేతనం వస్తుందని, అలా కాకుండా ఎక్కువ పనులు చేసుకున్నప్పుడు ఎక్కువ వేతనం వచ్చేలా చూడాలని ఫిష్ పాండ్ తో పాటు, ఫీడర్ ఛానల్ ,ఇతర పనులు చేసుకోవాలని చెప్పారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మస్టర్, ఇతర రిజిస్టర్లను పరిశీలించారు .ఉపాధి హామీ పనులు చేసే చోట కూలీలకు నీడతోపాటు, తాగునీటిని కల్పించాలని డిఆర్డిఓ శేఖర్ రెడ్డిని ఆదేశించారు. ఆ తర్వాత జిల్లా కలెక్టర్ గ్రామంలో కట్టగూరు సుధారాణి అనే లబ్ధిదారు నిర్మించుకున్న ఇందిరమ్మ ఇంటిని పరిశీలించారు. అనంతరం గ్రామపంచాయతీని సందర్శించి ప్రజాపాలన- ప్రగతి ప్రణాళిక లో భాగంగా గురువారం నిర్వహించనున్న గ్రామ సభకు సంబంధించి సర్పంచి తిరుపతమ్మ, పంచాయతీ కార్యదర్శి, ఇతర అధికారులతో చర్చించారు. గ్రామసభకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలని, గ్రామ అధికారులు అందరికీ తెలియజేయాలని, అదేవిధంగా సర్పంచ్, ఉప సర్పంచ్, వార్డు సభ్యులు అందర్నీ గ్రామసభకు ఆహ్వానించాలని, మినిట్స్ రికార్డు చేయాలని ,గ్రామ సభలో ఏమైనా గ్రామ సమస్యలు ఉన్నట్లయితే చర్చించాలని తెలిపారు. కాగా గ్రామానికి సంబంధించి పాఠశాల సమస్యను, విద్యుత్ సమస్యను , పాత బిల్లుల విషయాన్ని సర్పంచ్ జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. అనంతరం జిల్లా కలెక్టర్ గ్రామంలో ఉన్న తెలంగాణ మోడల్ స్కూల్ ను సందర్శించి యోగ తరగతి గదిని తనిఖీ చేశారు. పాఠశాలలోని తాగునీటి ఆరో ప్లాంట్ పనిచేయడం లేదని తెలుసుకొని తక్షణమే మరమ్మతులు చేయించాలని, పిఎంసి బోర్డు ఏర్పాటు చేయాలని, డ్యూయల్ డేస్కులను తక్షణమే ఫిట్ చేయించాలని ప్రిన్సిపల్ కృష్ణమోహన్ ను ఆదేశించారు. అనంతరం వంటగదిని, డైనింగ్ ను పరిశీలించి కట్టెలపై వంట వండుతుండడాన్ని గమనించిన జిల్లా కలెక్టర్ తక్షణమే కట్టెల ద్వారా వండడాన్ని నిలిపివేసి గ్యాస్ పై వండాలని వంట మనుషులను, పాఠశాల ప్రిన్సిపాల్ ను ఆదేశించారు. తెలంగాణ మోడల్ స్కూల్ పిఎం శ్రీ కింద చేపట్టినందున మోడల్ స్కూల్ గా తీర్చిదిద్దాల్సిన అవసరం ఉందని కలెక్టర్ ఆదేశించారు. ఆ తర్వాత జిల్లా కలెక్టర్ ఇదే మండలంలోని అడ్లూరు గ్రామంలోని అంగన్వాడి కేంద్రాన్ని సందర్శించి కేంద్రంలో ఉన్న పిల్లలు, గర్భిణీ స్త్రీలు, బాలింతలు, శామ్,మామ్ పిల్లల వివరాలను అడిగి తెలుసుకున్నారు. అంగన్వాడీ కేంద్రాన్ని ప్రైవేటు భవనంలో నిర్మిస్తుండగా ప్రభుత్వము ఎన్ఆర్ఈజీఎస్ ద్వారా అంగన్వాడి కేంద్రం మంజూరు చేసిందని తెలుసుకొని తక్షణమే పనులు ప్రారంభించి పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ సందర్భంగా గర్భిణీ స్త్రీలతో మాట్లాడుతూ అంగన్వాడి కేంద్రం ద్వారా అందిస్తున్న పౌష్టికాహారం వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఆరోగ్యానికి జాగ్రత్తగా చూసుకోవాలని చెప్పారు. కేంద్రంలోని స్టాక్ రిజిస్టర్ లను, గుడ్లు, బియ్యం, ఆయిల్ తదితర వంట సరుకులను తనిఖీ చేశారు. అనంతరం ఇదే గ్రామంలో నిర్మాణంలో ఉన్న గ్రామ సమాఖ్య భవనాలను తనిఖీ చేశారు . గతంలో గ్రామానికి 50 డబుల్ బెడ్ రూమ్ లు మంజూరు కాగా, 25 మాత్రమే పూర్తయ్యాయని, తక్కినవి ఆగిపోవడాన్ని సర్పంచ్ లక్ష్మి ,వెంకట్ రెడ్డి జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. అలాగే మిషన్ భగీరథ నీరు సగం గ్రామానికి వస్తున్నదని, సమస్యను పరిష్కరించాలని కోరారు. గ్రామ సమాఖ్య భవనానికి ఎస్ బి ఎంలో టాయిలెట్లు మంజూరు చేయాలని డిఆర్డిఓ ను కలెక్టర్ ఆదేశించారు. ఎంపీడీవో జ్యోతిలక్ష్మి, తహసిల్దార్ వరప్రసాద్, వల్లాల పంచాయతీ కార్యదర్శి కృష్ణయ్య, ఎంఈఓ సైదులు, తెలంగాణ మోడల్ స్కూల్ ప్రిన్సిపల్ కృష్ణమోహన్, తదితరులు జిల్లా కలెక్టర్ వెంట ఉన్నారు.

# అయ్యప్ప స్వామి జన్మ నక్షత్రం ప్రత్యేక పూజలు



**నేరేడుచర్ల ఏప్రిల్ 01 మనం న్యూస్ :** సూర్యాపేట జిల్లా నేరేడుచర్ల పట్టణ కేంద్రంలో గల శ్రీ అయ్యప్ప స్వామి ఆలయం నందు స్వామి జన్మ నక్షత్రమైన ఉత్తర నక్షత్రం సందర్భంగా బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయానికి ఉదయం నుండే భక్తులు తరలిరాగా స్వామివారికి అభిషేకాలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అఖిలభారత అయ్యప్ప దీక్ష ప్రచార సమితి రాష్ట్ర సభ్యులు చిన్నపల్లి శ్రీనివాస్ , అయ్యప్ప స్వామి ఆలయ కమిటీ చైర్మన్ కొనతం కృష్ణారెడ్డి, మున్సిపాలిటీ చైర్మన్ కొనతం చిన్న వెంకటరెడ్డి , నాగండ్ల శ్రీధర్, లక్ష్మారెడ్డి, యామినివీరయ్య దొంతి రెడ్డి వెంకటరమణ రెడ్డి, కర్ణాకర్ రెడ్డి , ప్రభాకర్ రెడ్డి, శ్రీనివాస్ , గణేష్ రెడ్డి , చింతకుంట్ల పూర్ణచంద్రారెడ్డి, సత్యనారాయణ రెడ్డి దుర్గారావు ,కిషోర్ , సురేష్ , శేఖరా చారి సంధ్య ,సీతమ్మ తదితరులు పాల్గొన్నారు.

# ఆయుష్మాన్ ఆరోగ్య శిబిరం టిబి ఎక్స్‌రే క్యాంప్



**సూర్యాపేట, ఏప్రిల్ 01 (మనం ప్రతినిధి):** యూపీహెచ్సీ అంబేద్కర్ నగర్లో ఆయుష్మాన్ ఆరోగ్య శిబిరంతో పాటు క్షయవ్యాధి (టిబి) నిర్ధారణ కోసం ఎక్స్‌రే క్యాంప్‌నువిజయవంతంగా నిర్వహించారు. టిబి వ్యాధిని ముందస్తుగా గుర్తించి, నివారణ చర్యలు చేపట్టడం ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశ్యంగా నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా టిబి లక్షణాలు ఉన్న రోగులకు ఛాతీ ఎక్స్‌రేలు నిర్వహించగా, అనుమానిత రోగుల నుంచి కఫం (స్పుటం) నమూనాలను సేకరించి తదుపరి పరీక్షల కోసం పంపించారు. క్యాంప్ను 17వ వార్డు కౌన్సిలర్ శ్రీమతి బైరబోయిన శ్రీదేవి. 35వ వార్డు కౌన్సిలర్ శ్రీమతి శ్రీవిద్య కర్ణాకర్ . సందర్శించి రోగులతో మాట్లాడి, వారి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు. ప్రభుత్వం అందిస్తున్న వైద్య సేవలను వినియోగించుకోవాలని ప్రజలను ప్రోత్సహించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ ...వైద్య సిబ్బంది సేవలను ప్రశంసిస్తూ, టిబి నిర్మూలనలో ప్రజల సహకారం అవసరమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమం డా. అమూల్య నిమ్మల గారు, మెడికల్ ఆఫీసర్ ఆధ్వర్యంలో నిర్వహించబడగా, ఆరోగ్య సిబ్బంది అందరూ పాల్గొని సేవలు అందించారు.టిబి రహిత సమాజ నిర్మాణానికి ఇలాంటి శిబిరాలు దోహదపడతాయని నిర్వాహకులు స్పష్టం చేశారు.

# నేరేడుచర్ల నియోజకవర్గం సాధించుటయే లక్ష్యం



**నేరేడుచర్ల ఏప్రిల్ 1 మనం న్యూస్ :** కేంద్ర ప్రభుత్వం త్వరలో చేపట్టనున్న నియోజకవర్గాల పునర్విభజన లో నేరేడుచర్లను నియోజకవర్గ కేంద్రంగా ఏర్పాటు చేయడమే లక్ష్యంగా పోరాటం చేయాలని అఖిలపక్ష నాయకులు తీర్మానం చేశారు. నేడేడుచర్ల విశ్వబ్రాహ్మణ సంఘం కార్యాలయంలో జరిగిన సకల జనుల సమావేశంలో వివిధ పార్టీల, ప్రజాసంఘాల నాయకులు మాట్లాడుతూ నేరేడుచర్ల నియోజకవర్గం అయేంతవరకు మడమ తిప్పని పోరాటం చేద్దామని అందుకు నేరేడుచర్ల గరిడేపల్లి పాలకవీడు పెన్ పహాడ్ లోని అన్ని గ్రామాల్లోని యువకులను సమీకరించి ఉద్యమ బాట పట్టించాలని నిర్ణయించారు. నేరేడుచర్లలు నియోజకవర్గంగా ఏర్పాటు చేయడానికి అన్ని అర్హతలు ఉన్నాయని నేషనల్ హైవే మీద ఉండటం మూసి నది మరియు కష్టా నది పరివాహక ప్రాంతం కావడం జాన్ పహాడ్ లాంటి చారిత్రక దర్గా ఇక్కడే ఉండడం విద్యాసంస్థలు అలాగే త్వరలో రైలు సౌకర్యం ఏర్పడే అవకాశం ఉన్నదని ఇప్పటికే జాన్ పహాడ్ కు గూడ్స్ రైలు సౌకర్యం ఉన్నదని, నియోజకవర్గంగా ఏర్పడితే మహంకాళి గూడెంపై హై లెవెల్ బ్రిడ్జి పొందవచ్చని, పోలీస్ సర్కిల్ కార్యాలయం ఏర్పడుతుందని అనేక ప్రభుత్వ కార్యాలయాలు ఐటిఐ కాలేజీలు, లాంటివి నియోజకవర్గానికి వచ్చే అవకాశం ఉన్నదని నియోజకవర్గ అభివృద్ధి నిధులు కూడా రావడం ద్వారా అన్ని గ్రామాలకు మెరుగైన సౌకర్యాలు అన్ని గ్రామాలకు బస్సు సౌకర్యం కల్పించడం కాకపోతే మరో 30 సంవత్సరాల వరకు అయ్యే అవకాశం ఉండదని అందువల్ల ఈ ప్రాంత ప్రజలు పాలకులను ఒప్పించి అధికారులను ఒప్పించి నియోజకవర్గ సాధించేందుకు కృషి చేయాలని అందుకు స్థానిక మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి అండదండలు కావాలని కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపితో పాటు రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ ఈ రెండు పార్టీలు కూడా ప్రజల అభిప్రాయాన్ని స్వీకరించి గౌరవించి అవకాశా కల్పించాలని వారి కోరారు సమావేశానికి సామాజిక కార్యకర్త ధూళిపాళ ధనుంజయ నాయుడు అధ్యక్షత వహించగా.... మాజీ ఎంపీపీ చెన్నబోయిన సైదులు, సరికొప్పుల నాగేశ్వరరావు ఎస్.కె ఖలీల్ రాపోలు నవీన్ ఆకారపు వెంకటేశ్వర్లు, కొదమగుండ్ల నగేష్ బాల వెంకటేశ్వర్లు నరి నాయక్ బొడ్డుపల్లి సుందరయ్య వాస పల్లయ్య ఎస్.కె ఇబ్రహీం పెరుమాళ్ళ సతీష్ ఇంజమూరి వెంకటయ్య జింకల భాస్కర్ రాజేష్ రెడ్డి కొనతం నాగిరెడ్డి ఎడవల్లి అరుణ్ కుమార్ కత్తి శ్రీనివాసరెడ్డి రావుల సత్యం ముళ్ల జానయ్య తక్కెళ్ళ నాగార్జున కొమ్రరాజు వెంకట్ బత్తిని శ్రీనివాస్ గౌడ్ ఏ లక్ష్మి నక్క రమాదేవి అంబటి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

# యాండ్ర కల్పన బంగారు మైసమ్మ దేవాలయంలో ప్రత్యేక పూజలు



**రంగారెడ్డి ఏప్రిల్ 1 (మనం న్యూస్):** టీ టీడీపీ రాష్ట్ర తెలుగు మహిళా అధికార ప్రదినిది, నేషనల్ సావిత్రి బాయి పూలే అధ్యక్షురాలు యాండ్ర కల్పన లోకేశ్వరరావు జన్మదినము సందర్బంగా సరూర్నగర్ లో బంగారు మైసమ్మ కాశీ వైద్య నాద దేవాలయం లో పూజలు చేసి అన్నదానం నిర్వహించారు. ఈ సందర్బంగా దేవాలయం నిర్వాహకులు బేర బాలకిషన్ (బాలన్న) కల్పన ని సన్మానించారు. కల్పన మాట్లాడుతూ రాజకీయాలుకు అతీతంగా నన్ను గౌరవిస్తున్న అందరికి కృతజ్ఞతలు తెలియజేసారు.

# ఒంటిమిట్ట శ్రీ కోదండరామునికి పట్టువస్త్రాలు సమర్పించిన రాష్ట్ర ముఖ్యమంత్రి



**ఒంటిమిట్ట/ తిరుపతి,ఏప్రిల్ 01, మనం న్యూస్:** కడప జిల్లా ఒంటిమిట్టలోని శ్రీ కోదండరామాలయ బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం శ్రీ సీతారాముల కల్యాణం సందర్భంగా రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సతీ సమేతంగా ఆలయంలో స్వామివారికి పట్టువస్త్రాలు సమర్పించారు. ముందుగా ఆలయం వద్దకు చేరుకున్న గౌ.ముఖ్యమంత్రి దంపతులకు టిటిడి చైర్మన్ బీఆర్ నాయుడు, అడిషనల్ ఈవో సిహెచ్ వెంకయ్య చౌదరి, టిటిడి బోర్డు సభ్యులు, అర్చకులు పూర్ణకుంభ స్వాగతం పలికారు. ఆలయంలో దర్శన ఏర్పాట్లు చేశారు. ఈ సందర్భంగా సీఎంకి శేషవస్త్రం అందించి వేద పండితులు వేదాశీర్వచనం చేశారు. అనంతరం స్వామివారి తీర్థప్రసాదాలు, ఒంటిమిట్ట రాములవారి చిత్రపటం అందజేశారు.

# హనుమాన్ శోభయాత్ర విజయవంతం చేద్దాం



- ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి

**రంగారెడ్డి ఏప్రిల్ 1 (మనం న్యూస్):** హనుమాన్ శోభయాత్రను విజయవంతం చేద్దాం ఎల్బీనగర్ శాసనసభ్యులు దేవీ రెడ్డి సుధీర్ రెడ్డి అన్నారు. ఆయన మాట్లాడుతూ గురువారం హనుమాన్ జయంతి సందర్బంగా సాయంత్రం 4:00 గంటలకు బి.ఎన్.రెడ్డి.నగర్ చౌరస్తా నుండి సాహెబ్ నగర్ త్రినేత్ర ఆంజనేయ స్వామి దేవాలయం వరకు శోభాయాత్ర నిర్వహించనున్నట్లు తెలిపారు. భక్తి,శక్తి,ఐక్యతకు ప్రతీకగా నిర్వహించే ఈ భవ్య హనుమాన్ శోభాయాత్రలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా గౌరవ తెలంగాణ రాష్ట్ర మాజీ మంత్రి తన్నీరు హరీష్ రావు హాజరవుతున్నట్లు తెలిపారు.

# మల్లంపల్లి గ్రామాన్ని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దాలి

- ప్రభుత్వం అధిక ప్రాధాన్యతతో జిల్లా అభివృద్ధి
- త్వరలోనే మల్లంపల్లి మండల పోలీస్ స్టేషన్ ఏర్పాటు
- మంత్రి సీతక్క



**ములుగు, ఏప్రిల్ 1, మనం ప్రతినిధిః** మల్లంపల్లి గ్రామాన్ని ఆదర్శవంతమైన గ్రామంగా తీర్చిదిద్దాలని, ములుగు జిల్లా ప్రత్యేక చొరవతో అభివృద్ధి లో ముందుకు సాగాలని, త్వరలోనే మండల పోలీస్ స్టేషన్ ఏర్పాటు చేస్తున్నామని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క తెలిపారు. బుధవారం ములుగు జిల్లా మల్లంపల్లి మండల కేంద్రంలో రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క, జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. తో కలిసి పంచాయతీ రాజ్ ఇంజనీరింగ్ విభాగం ఉపాధి హామీ పథకం పది లక్షల రూపాయల నిధులతో గ్రామైక్య సంఘం భవన నిర్మాణానికి, సి ఆర్ ఆర్ 72.50 లక్షల రూపాల నిధులతో అంతర్గత సిసి రోడ్డు నిర్మాణాలకు శంకుస్థాపన చేశారు.అనంతరం పంచాయతీ రాజ్ ఇంజనీరింగ్ విభాగం, ఉపాధి హామీ పథకం 20 లక్షల రూపాయలతో నూతనంగా నిర్మించిన శ్రీనగర్ గ్రామ పంచాయతీ కార్యాలయాన్ని మంత్రి దనసరి అనసూయ సీతక్క, జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్., శ్రీనగర్ సర్పంచ్ మల్లేష్ యాదవ్ లతో కలిసి ప్రారంభించారు.ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ ములుగు జిల్లా అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేసిందని మల్లంపల్లిని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దుతాం అని మంత్రి సీతక్క అన్నారు. ముఖ్యమంత్రి పాదయాత్రలో ఇచ్చిన మాట ప్రకారం ప్రభుత్వం ఏర్పడగానే మల్లంపల్లిని ప్రత్యేక మండలంగా ప్రకటించి, ఇచ్చిన మాట నిలబెట్టుకున్నామని హర్షం వ్యక్తం చేశారు. నూతన మల్లంపల్లి మండల కేంద్రం లో మండల సమైక్య భవనాలు రెండు నిర్మిస్తున్నామని, పరిపాలన సౌలభ్యం కోసం ఎంపీడీఓ, ఎంఆర్ఓ ఆఫీసులను ఒకే చోట మండల సముదాయ భవనం నిర్మించేందుకు ప్రణాళిక సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. గ్రామంలోని అంగడి స్థలాన్ని మాస్టర్ ప్లాన్ తో ప్రజల అవసరాల కోసం అభివృద్ధి చేస్తామని, త్వరలోనే పోలీస్ స్టేషన్ మరియు అవసరమైన సిబ్బందిని కూడా కేటాయిస్తామని హామీ ఇచ్చారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ పెన్షన్లు అందించేలా గ్రామసభల ద్వారా దరఖాస్తులను తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. మహిళా సంఘంలోని సభ్యురాలు ప్రమాదవశాత్తు చనిపోతే రూ. 10 లక్షలు, సహజ మరణానికి రూ. 5 లక్షలు రూపాయలు అందించే విధంగా 'ఇందిరమ్మ జీవిత బీమా' పథకాన్ని అమలు చేస్తున్నట్లు తెలిపారు. 'అక్షరమాల' కార్యక్రమంలో భాగంగా రాష్ట్రంలో 7 లక్షల మంది మహిళలు చదువుకోవడం గర్వకారణమని, ములుగు జిల్లా నుంచి పరీక్ష రాసిన మహిళలను అభినందించారు. ఈ నెల 14న ఫలితాలు రాగానే ఉత్తీర్ణులైన వారిని సత్కరించి బహుమతులు అందజేస్తామని పేర్కొన్నారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. మాట్లాడుతూ జిల్లాలో ఉపాధి హామీ పథకం ద్వారా 18 కోట్ల రూపాయల నిధులతో అభివృద్ధి పనులను చేపట్టినట్లు వివరించారు. సిఆర్ఆర్, ఎంఆర్ నిధులతో జిల్లాలో 60 నుండి 70 శాతం మేర రోడ్ల పనులు పూర్తయ్యాయని, జిల్లాలో 40 వీఓ భవనాలు, కొత్తగా మంజూరు అయినా గ్రామపంచాయతీ కార్యాలయాలు, అంగన్వాడీ భవనాల నిర్మాణానికి అధిక ప్రాధాన్యత ఇస్తూ త్వరలోనే పూర్తి చేస్తామని పేర్కొన్నారు. జిల్లాలో నీటి వనరుల వినియోగం కోసం వాగులపై చెక్ డాం నిర్మాణాలకు ప్రణాళికలు సిద్ధం చేసామని తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు సంపత్ రావు, గ్రంధాలయ సంస్థ చైర్మన్ బానోతు రవిచందర్, ఆత్మ కమిటీ చైర్మన్ రవీందర్ రెడ్డి, డి ఆర్ డి ఓ, శ్రీనివాస్, పంచాయతీ రాజ్ ఈ ఈ అజయ్ కుమార్, అడిషనల్ డి ఆర్ డి ఓ శ్రీనివాస్, ఆర్డబ్ల్యూఎస్ డి ఈ సునీత, మండల ప్రత్యేక అధికారి కృపాకర్, సర్పంచ్ శ్యామ్ రావు, యం పి ఓ, సంబంధిత అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## మహిళ ఆర్థిక, సామాజిక అభివృద్ధికి అధిక ప్రాధాన్యత




- మహిళా సంఘాలకు ఆధునిక భవనాలు
- మంత్రి సీతక్క

**ములుగు, ఏప్రిల్ 1, మనం ప్రతినిధిః** మహిళ ఆర్థిక, సామాజిక అభివృద్ధికి ప్రజా ప్రభుత్వం అధిక ప్రాధాన్యత కల్పిస్తుందని, మహిళా సమాఖ్య భవనాల నిర్మాణంతో వారికి మెరుగైన సౌకర్యాలు లభిస్తాయని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క అన్నారు. బుధవారం ములుగు మండలం మదనపల్లి గ్రామంలో రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క, జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. తో కలిసి పంచాయతీ రాజ్ ఇంజనీరింగ్ విభాగం ఉపాధి హామీ పథకం 10 లక్షల రూపాయల నిధులతో మహిళా సమాఖ్య భవన నిర్మాణానికి, జగ్గంపేట గ్రామం లో పంచాయతీ రాజ్ ఇంజనీరింగ్ విభాగం సి ఆర్ ఆర్ 150.00 లక్షల రూపాయల నిధులతో అంతర్గత సిసి రోడ్లు, డ్రెయిన్స్ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ముందుగా మదనపల్లి గ్రామంలో ఆవునూరి భాగ్య మొగిలి ఇందిరమ్మ ఇల్లు గృహప్రవేశ కార్యక్రమానికి మంత్రి అనసూయ సీతక్క, జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ తో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ జగ్గన్నపేట గ్రామంలో రోడ్డు విస్తరణ పనులు పూర్తి కావడం పట్ల సంతోషం మంత్రి సీతక్క సంతోషం వ్యక్తం చేశారు. రోడ్డు విస్తరణలో ఇళ్లు కోల్పోయిన వారికి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. ఒక కోటి 50 లక్షల రూపాయల నిధులతో డ్రైనేజీ వ్యవస్థ, సీసీ రోడ్ల నిర్మాణం చేపడుతున్నామని, త్వరలోనే మిగిలిన సీసీ రోడ్ల పనులు పూర్తి చేయడం జరుగుతుందని తెలిపారు. ప్రతి గ్రామంలో మహిళలు సమావేశాలు నిర్వహించుకోవడానికి అత్యాధునిక మహిళ సమైక్య భవనాలు నిర్మిస్తున్నామని తెలిపారు. మహిళా సంఘాలకు వడ్డీ లేని రుణాలు అందజేస్తున్నామని, ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను ప్రజలు సద్వినియోగించుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు సంపత్ రావు, గ్రంధాలయ సంస్థ చైర్మన్ బానోతు రవిచందర్, మార్కెట్ కమిటీ చైర్పర్సన్ రేగ కళ్యాణి, జగ్గన్నపేట గ్రామ సర్పంచ్ ఎ.వెంకన్న, మదనపల్లి గ్రామ సర్పంచ్ నేత కరుణ, పంచాయతీరాజ్ ఈ ఈ అజయ్ కుమార్, సంబంధిత అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

## భద్రాచలం ఆలయ బోర్డు డైరెక్టర్‌కు ఘన సన్మానం




**మంగపేట,ఏప్రిల్ 1మనం ప్రతినిధి :** తెలంగాణ అంబేద్కర్ సంఘం మంగపేట మండల అధ్యక్షులు యెంపెల్లి వీరస్వామి అధ్యర్యంలో తిమ్మంపేట గ్రామ కమిటీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి దుర్గం శివప్రసాద్, బోడ శివయ్య అధ్యక్షతన నూతనంగా భద్రాచలం శ్రీ కొందండ రామాలయం బోర్డు డైరెక్టర్ గా నియామకం అయినా పూజారి లక్ష్మి నర్సయ్య రాజకీయ వారసుడు పూజారి సురేందర్ బాబు తిమ్మంపేటలో అంబేద్కర్ సంఘం ఆధ్వర్యంలో సన్మానం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధులుగా అంబేద్కర్ సంఘం మండల వ్యవస్థాపకులు పగిడిపెల్లి వెంకటేశ్వర్లు, యెంపెల్లి సమ్మయ్య, మంగపేట అంబేద్కర్ విగ్రహం ధాత చెట్టుపెల్లి వెంకటేశ్వర్లు, అంబేద్కర్ సంఘం జిల్లా అధ్యక్షులు ఎడ్ల నరేష్,డివిజన్ అధ్యక్షులు బాసారికాని హరికృష్ణ, మరియు మండలం ప్రధాన కార్యదర్శి మండల నాయకులు దాసరి ఎల్లన్న మైప లాలయ్య, బోడ బొర్రయ్య, బాసారికారీ నాగార్జున్, పుల్లూరి తిరుపతి,గోనె నాగేష్ కమలాపురం గ్రామ అధ్యక్షులు దాసరి బుజ్జి, గోమసు నర్సింహ రావు, గడల శ్రీకాంత్, గోమాసు లక్ష్మీనారాయణ, బొంబోతుల మురళి, తదితరులు పాల్గొన్నారు.

## వేసవి కాలంలో త్రాగు నీటి ఎద్దడి లేకుండా చూడాలి

- యుద్ధప్రాతిపదికన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయాలి
- జిల్లాలో ప్రతి ఎకరాకు సాగునీరు అందేలా చూడాలి
- మంత్రి సీతక్క



**ములుగు, ఏప్రిల్ 1, మనం ప్రతినిధిః** వేసవి కాలం లో త్రాగు నీటి ఎద్దడి తలెత్తకుండా చూడాలని, యుద్ధ ప్రతిపాదికన ఇందిరమ్మ నిర్మాణాలు పూర్తి చేసే విధంగా చూడాలని, జిల్లాలో ప్రతి ఎకరాకు సాగునీరు అందే విధంగా ప్రత్యేక ప్రణాళిక రూపొందించాలని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో మంత్రి సీతక్క, జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. తో కలిసి త్రాగు, సాగు నీటి సరఫరా, ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలపై జిల్లా ఉన్నత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించి దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ వేసవి కాలంలో త్రాగునీటి ఎద్దడి తలెత్తకుండా చూడాలని, గుత్తికోయ ప్రాంతాలలో ప్రత్యేక ప్రణాళికల చేతి పంపు, ట్రాక్టర్ ట్యాంక్ ద్వారా త్రాగునీరు సరఫరా చేయాలని పేర్కొన్నారు. ప్రతి గ్రామపంచాయతీలో చలివేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగిందని స్పష్టం చేశారు.యుద్ధ ప్రతిపాదికన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు పూర్తి అయ్యేలా అధికారులు చూడాలని లబ్ధిదారులతో సమన్వయ సమావేశాలు ఏర్పాటు చేసుకొని నిర్మాణాలలో వేగం పెంచేలా చూడాలని, మంజూరు అయిన ఇండ్ల లబ్ధిదారులు ఇప్పటివరకు గ్రౌండింగ్ చేయకపోతే దానికి గల కారణాలు సేకరించి లబ్ధిదారులు మహిళ సంఘం లో ఉంటే వారికి వెంటనే లక్ష రూపాయల రుణం అదే విధంగా చూడాలని అన్నారు. జిల్లాలోని ప్రతి ఎకరాకు సాగునీరు అందించాలని ఉద్దేశంతో మొట్టమొదటిసారిగా 200 కోట్ల రూపాయల నిధులతో గోదావరి జలాలను జిల్లాకు మళ్లించడం జరుగుతుందని స్పష్టం చేశారు. అధికారులు అప్రమత్తంగా ఉంటూ బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించాలని, గ్రామ పంచాయితీలకు మంజూరు చేసిన నిధులను నియమ నిబంధనల ప్రకారం మాత్రమే ఉపయోగించుకోవాలని ఎట్టి పరిస్థితుల్లో ప్రజాధనాన్ని వృధా కాకుండా చూసుకోవాలని సూచించారు. చిన్న అభివృద్ధి పనుల ద్వారా ప్రజలకు పెద్ద మొత్తంలో ప్రయోజనాలు చేకూరుతాయని, జిల్లా అభివృద్ధి కోసం మెరుగైన ప్రణాళికలను సిద్ధం చేయాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు సంపత్ రావు, గ్రంధాలయ సంస్థ చైర్మన్ భానోత్ రవిచందర్, మార్కెట్ కమిటీ చైర్మన్ రేగ కళ్యాణి, ఆర్డీవో వెంకటేష్, ఆర్ డబ్ల్యూ ఎస్ సి ఈ సురేష్, ఈ ఈ మాణిక్య రావు, ఇరిగేషన్ ఈ ఈ నారాయణ, సంబంధిత అధికారులు, పాల్గొన్నారు.

## అంగన్వాడి పిల్లలకు ప్రభుత్వ దుస్తులను పంపిణీ



**మహాదేవపూర్ ఏప్రిల్01 మనం న్యూస్ః** జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాదేవపూర్ మండల కేంద్రంలోని ఎనిమిదవ అంగన్వాడీ కేంద్రంలో పిల్లలకు బుధవారం రోజున సర్పంచ్ హసీనాబాన్ అక్బర్ ఖాన్ ప్రభుత్వ దుస్తులను పంపిణీ చేయడం జరిగింది. మండల కేంద్రంలోని ఎనిమిదవ అంగన్వాడీ కేంద్రంలో ఆరోగ్యలక్ష్మి కమిటీ మీటింగ్ లో భాగంగా అంగన్వాడి పిల్లలకు దుస్తులను పంపిణీ చేయడంతో పాటు అక్షరాభ్యాసం నిర్వహించారు అనంతరం కమిటీ ఏర్పాటుచేసి సభ్యులను ఎన్నుకొన్న అనంతరం సర్పంచ్ మాట్లాడుతూ పిల్లలు ఆరోగ్యంగా ఉండేలా ఆహారంతో పాటు పిల్లల పెరుగుదల, ఎత్తు, బరువు ఎప్పటికప్పుడు పట్టికలను తయారుచేసి కొలతలను నమోదు చేస్తూ ఆరోగ్యకరంగా ఉండేలా చూడడమే ఆరోగ్యలక్ష్మి అని అన్నారు. ఈ కార్యక్రమంలో చిలుములరుద్ర, కొయ్యల సరిత, రామ్ టైంకి రాజేశ్వరి, తిరుపతి రెడ్డి, బండెల శ్వేత, పిన్నింటి సుజాత కన్వీనర్ అంగన్వాడి తోపాటు పలువురు పాల్గొన్నారు.

## నేడు వార్డు సభ

**ములుగు, ఏప్రిల్ 1 మనం ప్రతినిధి :** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న ప్రజా పాలనా ప్రగతి ప్రణాళికలో నేడు గురువారం రోజున ఉదయం 10 గంటలకు కలెక్టర్ ఆఫీస్ వెనక గల బిట్స్ స్కూల్ పక్కన నిర్వహించడం జరుగుతుంది. అందులో భాగంగా మన 14వ వార్డులో ప్రజలందరూ అధిక సంఖ్యలో పాల్గొని మీ సమస్య లు(ఇందిరమ్మ ఇల్లు, పెన్షన్లు గృహజ్యోతి, కొత్త రేషన్ కార్డులు, వార్డు సమస్యలు) తెలియజేయాలని వైస్ చైర్మన్ ఆసియా షాహిన్ రియాజ్ మీర్జా తెలిపారు.

## మంత్రి సీతక్కను కలిసిన భద్రాద్రి పాలకమండలి సభ్యుడు



**మంగపేట,ఏప్రిల్ 1మనం ప్రతినిధి :** కాంగ్రెస్ పార్టీ ములుగు జిల్లా ప్రచార కమిటీ చైర్మన్ పూజారి సురేందర్ బాబు దక్షిణ అయోధ్య భద్రాచల శ్రీ సీతారాముల గుడి పాలకమండలి సభ్యులుగా నియమితులైన సందర్భంగా బుధవారం తెలంగాణ రాష్ట్ర పంచాయతీరాజ్ గ్రామీణ అభివృద్ధి స్త్రీ శిశు సంక్షేమ, గ్రామీణ మంచినీటి సరఫరాల శాఖ మంత్రి డాక్టర్ ధనసరి అనసూయ సీతక్క సురేందర్ బావను శాలువాతో సన్మానించారు. భవిష్యత్తులో ఉన్నత పదవులను అధిరోహించాలని మంత్రి సీతక్క ఆశాభావం వ్యక్తం చేశారు.

## రైతులకు ఇబ్బందులు లేకుండా ధాన్యం కొనుగోళ్లు

- అదనపు కలెక్టర్ సి.హెచ్. మహేందర్



**ములుగు,ఏప్రిల్ 1మనం ప్రతినిధి :** మండలంలో ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వహణలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా జిల్లా యంత్రాంగం ప్రత్యేక చర్యలు తీసుకుంటుందని అదనపు కలెక్టర్ మహేందర్ తెలిపారు.బుధవారం మండల కేంద్రంలోని రైతు వేదికలో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లాలో సహకార సంస్థల ద్వారా 81, ఐకేపీ ద్వారా 52, ఎఫ్పీఓల ద్వారా 7 కేంద్రాలు కలిపి మొత్తం 140 ధాన్యం కొనుగోలు కేంద్రాలు పనిచేస్తున్నట్లు వెల్లడించారు. ఈ కేంద్రాల ద్వారా కొనుగోలు చేసిన ధాన్యాన్ని రైస్ మిల్లులకు తరలిస్తూ, రైతుల వివరాలను ఆన్లైన్లో నమోదు చేసి చెల్లింపులు వారి ఖాతాల్లో జమ అయ్యేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా భారీ స్థాయిలో ధాన్యం కొనుగోళ్లు జరుగుతున్న నేపథ్యంలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రభుత్వం దృష్టి సారించింది. కేంద్రాల్లో మౌలిక వసతులు కల్పిస్తూ రైతులకు అసౌకర్యం కలగకుండా అన్ని శాఖల సమన్వయంతో పని చేస్తున్నామని ఆయన తెలిపారు. హార్వెస్టర్ యజమానులు, తహసీల్దారులు, ఆదర్శ రైతులు, కొనుగోలు కేంద్రాల నిర్వాహకులకు ఏటూరునాగారం, తాడ్వాయి, ములుగు రైతు వేదికలలో శిక్షణ కార్యక్రమాలు నిర్వహించినట్లు చెప్పారు. ఈ సమావేశంలో డీసీఎస్ఓ ఫైజల్ హుస్సేన్, డీఎం కృష్ణవేణి, సహకార శాఖ అధికారులు, ఐకేపీ, ఎఫ్పీఓ ప్రతినిధులు, స్థానిక తహసీల్దారులు, వ్యవసాయ మరియు పౌర సరఫరాల శాఖ అధికారులు పాల్గొన్నారు. జిల్లా స్థాయిలో పర్యవేక్షణ పెంచి ధాన్యం కొనుగోళ్లలో ఎలాంటి సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నట్లు అధికారులు తెలిపారు.



## గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు ప్రారంభించిన సర్పంచ్

**మహాదేవపూర్ ఏప్రిల్ 1 మనం న్యూస్ః** మహాదేవ్పూర్ గ్రామపంచాయతీ పరిధిలో పశువైద్య మరియు పశుసంవర్ధక శాఖ ద్వారా నిర్వహించబడుతున్న గాలికుంటు ఎఫ్ఎండి వ్యాధి నివారణ టీకాలు గ్రామ సర్పంచ్ హసీనా భాను అక్బర్ ఖాన్ ప్రారంభించారు, ప్రతి రైతు తమ పశువులకు తప్పనిసరిగా టీకాలు వేయించుకోవాలని తెలుపడం జరిగింది, పశుసంపద ఆరోగ్యంగా ఉంటేనే రైతు కుటుంబాలు ఆర్థికంగా బలపడతాయని తెలిపారు. పశువులు రైతుల ప్రాణ నేస్తాలు కాగా, గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు ప్రధాన ఆధారం. మానవాళి మరియు జంతుజాలం మధ్య ఉన్న అవినాభావ సంబంధాన్ని కాపాడటం ప్రతి ఒక్కరి బాధ్యతగా పేర్కొన్నారు. ప్రతి కుటుంబం ఆర్థికంగా అభివృద్ధి చెందాలంటే పశుపోషణకు ప్రాధాన్యత ఇవ్వాలని, పెరటి కోళ్ల పెంపకం, పాడి పశువుల పెంపకం ద్వారా జీవనోపాధి సాధ్యమవుతుందని వివరించారు. పశుసంవర్ధక శాఖ ద్వారారైతులకు పశుసంపద పరిరక్షణకు ముందస్తు జాగ్రత్తలు అత్యంత ముఖ్యమనిచికిత్స కన్నా నివారణే మేలుఅనే సూత్రాన్ని పాటించి గాలికుంటు వ్యాధి నివారణకు టీకాలు వేయించడం ఒక్కటే సమర్థమైన మార్గం అని స్పష్టంచేయడమైనది. ఈ కార్యక్రమం ద్వారా పశువులను వైరస్ వ్యాధి నుండి రక్షించి రైతులకు ఆర్థిక నష్టాలను తగ్గించవచ్చని తెలిపడం జరుగుతుంది.ఈ కార్యక్రమంలో పశుసంవర్ధకశాఖ అధికారి రాజబాపు సిబ్బంది నాగభూషణం, ఆదిల్, లావణ్యతో పాటు రైతులు పాల్గొన్నారు.

## సీసీ రోడ్లు డ్రైనేజీ పనులను ప్రారంభించిన కాంగ్రెస్ నాయకులు



**ఏటూర్ నాగారం ,ఏప్రిల్ 1 మనం ప్రతినిధి :** రామన్నగూడెం సర్పంచ్ గద్దల నవీన్ ఆధ్వర్యంలో మంత్రి సీతక్క చొరవతో రామన్నగూడెం గ్రామానికి కోటి అరువై లక్షలు (1.60)సీఆర్ఆర్ నిధులతో మంజూరైనటువంటి సీసీ రోడ్స్, సైడ్ డ్రైనేజీ పనులను బుధవారం మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు కొబ్బరికాయ కొట్టి పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా రోడ్డు మంజూరు చేసిన మంత్రి సీతక్క కు గ్రామ ప్రజల పక్షాన కృతజ్ఞతలు తెలిపారు. రోడ్డు మంజూరు తో రామన్నగూడెం ప్రాంత అభివృద్ధికి దోహదంఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు ఇర్సవడ్ల వెంకన్న, పిఎసిఎస్ వైస్ చైర్మన్ చెన్నూరి బాలరాజు, మండల ప్రధాన కార్యదర్శి వావిలాల ఎల్లయ్య, స్థానిక నాయకులు, సీనియర్ నాయకులు, జిల్లా మండల గ్రామ నాయకులు, మహిళా నాయకులు, యూత్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.


## ప్రోటోకాల్ ప్రకారంగా గ్రామ సభలు నిర్వహించాలి

### మండల స్పెషల్ ఆఫీసర్ శ్రీనివాస్ రావు



**దుగ్గొండి. ఏప్రిల్01 మనం న్యూస్ః** ప్రజాపాలన - ప్రగతి ప్రణాళికలో భాగంగా 99 రోజుల పాటు నిర్వహించనున్న గ్రామ సభలను ప్రభుత్వ ప్రోటోకాల్ ప్రకారం సమగ్రంగా నిర్వహించాలని మండల స్పెషల్ ఆఫీసర్ శ్రీనివాస్ రావు సూచించారు. బుధవారం దుగ్గొండి మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో గ్రామ పంచాయతీ కార్యదర్శులు, ప్రత్యేక అధికారులతో గ్రామ సభల నిర్వహణపై అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ఎంపిడిఓ లెక్కల అరుంధతి అధ్యక్షత వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ సభలను విజయవంతంగా నిర్వహించేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. గ్రామ సభలను ఆరుబయట ఏర్పాటు చేయాలని, సంక్షేమ పథకాల కోసం లబ్ధిదారుల దరఖాస్తుల స్వీకరణకు ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేయాలని తెలిపారు. ఎండాకాలాన్ని దృష్టిలో ఉంచుకొని షామియానాలు, తాగునీరు తదితర సౌకర్యాలు కల్పించాలని సూచించారు. గ్రామ సభలను తెలంగాణ గీతంతో ప్రారంభించాలని తెలిపారు.గ్రామ సభల నిర్వహణకు సంబంధించిన ఫోటోలను నిర్ణయ్ యాప్లో తప్పనిసరిగా అప్లోడ్ చేయాలని, గ్రామ సభలకు ప్రజలు అధిక సంఖ్యలో హాజరయ్యేలా ముందస్తుగా విస్తృత ప్రచారం, అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. గ్రామ సభల్లో రైతు భరోసా, కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్, ఇందిరా క్రాంతి, ఇందిరమ్మ ఇళ్లు, సన్నబియ్యం, ఇందిరమ్మ చీరలు పంపిణీ, మహాలక్ష్మి ఉచిత బస్సు, పాఠశాలల్లో సన్నబియ్యం ఉచిత అన్నం, ఇంటర్మీడియట్ విద్యార్థులకు స్కూటీ పథకం తదితర పది ముఖ్య అంశాలపై చర్చలు నిర్వహించాలని ఆయన తెలిపారు.ఈ కార్యక్రమంలో ఎమ్మార్వో సమ్మక్క, ఎంపీఓ మోడెం శ్రీధర్ గౌడ్, ఎంఈఓ వెంకటేశ్వర్లు, ఎస్సై రణధీర్ రెడ్డి, వివిధ శాఖల అధికారులు, గ్రామ పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

## ఇంద్రమ్మ లబ్ధిదారులు త్వరగా పూర్తి చేయాలి



- ఎంపీడీవో వీరేశం

**భీమదేవరపల్లి ఏప్రిల్ 1 మనం న్యూస్:** తెలంగాణ రాష్ట్రంలో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ముల్కనూర్ లో ఇందిరమ్మ ఇల్లుగృహప్రవేశం జరిగింది. బుధవారం రోజున ఇంద్రమ్మ ఇల్లు గృహప్రవేశా కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎంపీడీవో వీరేశం హాజరై ఇందిరమ్మ ఇల్లు లబ్ధిదారులు అయినా ముష్కు రజిత పూర్ణచందర్ ను అభినందించిన అనంతరం వారు మాట్లాడుతూ ఇంద్రమ్మ ఇల్లు పొందిన లబ్ధిదారులు త్వరగా తిన పూర్తి చేయాలని ఆదేశించారు. ముల్కనూర్లో 66 ఇంద్రమ్మ ఇల్లు మంజూరు కాగా 29 ఇంద్రమ్మ ఇల్లు స్లాబ్ వరకు పూర్తికాగా, 18 బేస్ మీట్ లెవెల్ లో ఉండగా, ఆరు ఇంద్రమ్మ ఇల్లు మంజూరై నిర్మాణం చేపట్టకుండా ఉన్నాయని అన్నారు. ఇందిరమ్మ ఇల్లు మంజూరైన లబ్ధిదారులు పూర్తి చేయాలని, పేదవాడి గూడుకల నెరవేర్చేది కాంగ్రెస్ ప్రభుత్వమే అని సర్పంచ్ జాలి ప్రమోద్ రెడ్డి అన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి పూర్ణచందర్, పంచాయతీ సిబ్బంది బాబన్న, గుడికందుల వెంకట్, తదితరులు పాల్గొన్నారు.





## ర్యాంకింగ్స్‌లో దుమ్ము లేపిన సౌతాఫ్రికా ప్లేయర్..

ఐసీసీ తాజాగా ప్రకటించిన టీ20 ర్యాంకింగ్స్ లో టీమిండియా స్టార్ బ్యాటర్లు అభిషేక్ శర్మ, ఇషాన్ కిషన్ తమ టాప్-2 స్థానాలను నిలబెట్టుకున్నారు. అభిషేక్ 875 పాయింట్లతో అగ్రస్థానంలో కొనసాగుతుండగా.. కిషన్(848) రెండో స్థానంలో నిలిచాడు. మూడో స్థానంలో పాకిస్తాన్ ఓపెనర్ సాహిబ్జాదా ఫర్హాన్(848) ఉన్నాడు. ఇక ఇటీవల న్యూజిలాండ్ తో జరిగిన టీ20 సిరీస్ లో దుమ్ములేపిన సౌతాఫ్రికా వికెట్ కీపర్ బ్యాటర్ కానర్ ఎస్టర్ హ్యూజెన్.. ఇప్పుడు ఐసీసీ ర్యాంకింగ్స్ లో కూడా సత్తాచాటాడు. ఎస్టర్ హ్యూజెన్ ఏకంగా 64 స్థానాలు ఎగబాకి 39వ ర్యాంక్ కు చేరుకున్నాడు. ప్రోటీస్ సిరీస్ లో ఎస్టర్ హ్యూజెన్ 300 పరుగులు చేసి ప్లేయర్ ఆఫ్ది సిరీస్ గా నిలిచాడు. ఇక టాప్-10లో స్వల్ప మార్పులు చోటు చేసుకున్నాయి. ఇంగ్లండ్ మాజీ కెప్టెన్ జోస్ బట్లర్ జోస్ బట్లర్ ఒక స్థానం మెరుగుపరుచుకుని 8వ ర్యాంకుకు చేరుకోగా, కివీస్ బ్యాటర్ టిమ్ సీఫెర్ట్ 9వ స్థానానికి పడిపోయాడు. న్యూజిలాండ్ వికెట్ కీపర్ టిమ్ రాబిన్సన్ రెండు స్థానాలు ఎగబాకి 32వ స్థానంలో నిలిచాడు. మరోవైపు బౌలింగ్ ర్యాంకింగ్స్ లో అఫ్గానిస్తాన్ స్టార్ రషీద్ ఖాన్ తన అగ్రస్థానాన్ని పదిలం చేసుకున్నాడు. న్యూజిలాండ్ సిరీస్ లో రాణించిన దక్షిణాఫ్రికా బౌలర్లు తమ ర్యాంక్ లను మెరుగుపరుచుకున్నారు. జెరాల్ కోయెట్జీ ఏకంగా 36 స్థానాలు ఎగబాకి 52వ ర్యాంకును కైవసం చేసుకోగా.. ఒట్నీల్ బార్ట్ మాన్ 10 స్థానాలు మెరుగుపరుచుకుని 56వ స్థానానికి చేరుకున్నాడు. ఇక ఆల్ రౌండర్ల జాబితాలో జింబాబ్వే కెప్టెన్ సికందర్ రజా నంబర్ వన్ స్థానంలో కొనసాగుతున్నాడు.



# అరంగేట్రంలోనే అదరగొట్టాడు..

ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) ఎందరో అనామక ఆటగాళ్లను వెలుగులోకి తీసుకొచ్చింది. ప్రతీ సీజన్ లో తమ అరంగేట్రం మ్యాచ్ ల్లో అదరగొట్టే ప్రదర్శన నమోదు చేసే ఆటగాళ్లు అరుదుగా ఉంటారు. ఆ జాబితాలో చేరిపోయాడు పంజాబ్ కింగ్స్ ప్లేయర్ కూపర్ కనోలీ. తాను ఆడుతుంది తొలి ఐపీఎల్ మ్యాచ్ అయినప్పటికీ ఎలాంటి బెరుకు లేకుండా కడదాకా నిలిచి 72 పరుగుల అజేయ ఇన్నింగ్స్ తో పంజాబ్ ను గెలిపించాడు.

ఆడిన తొలి మ్యాచ్ లోనే అందరూ మెచ్చే ఇన్నింగ్స్ ఆడిన కనోలీ 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ గా' నిలిచాడు. తద్వారా ఐపీఎల్ లో అరంగేట్రం మ్యాచ్ లో అత్యధిక పరుగులు సాధించిన ఆటగాళ్ల జాబితాలో కూపర్ ఐదో స్థానంలో ఉన్నాడు. కూపర్ కంటే ముందు మెక్ కల్లమ్ (158 నాటౌట్), మైక్ హస్సీ (116 నాటౌట్), షాన్ మార్ష్ (84 నాటౌట్), కైల్ మిల్స్ (73) వరుసగా తొలి నాలుగు స్థానాల్లో ఉన్నారు.

ఇక మంగళవారం గుజరాత్ టైటాన్స్ తో మ్యాచ్ లో పంజాబ్ కింగ్స్ ఒక దశలోఈజీగా గెలవాల్సిందే. కానీ ప్రసిధ్ క్రిష్ణ సూపర్ స్పెల్ వేసి శ్రేయస్, స్టోయినిస్, శశాంక్ సింగ్ లను ఔట్ చేసి పంజాబ్ కు షాక్ ఇచ్చాడు. ఈ దశలో వన్ డౌన్ లో వచ్చిన కూపర్ కనోలీ కడదాకా నిలిచి కీలక ఇన్నింగ్స్ ఆడాడు.

44 బంతుల్లో 72 పరుగులు చేసిన కూపర్ ఇన్నింగ్స్ లో 5 ఫోర్లు, 5 సిక్సర్లు ఉన్నాయి. ఆల్ రౌండర్ గా గుర్తింపు ఉన్నా వెన్ను గాయం కారణంగా లీగ్ లో అతను బౌలింగ్ చేయడని, స్పెషలిస్ట్ బ్యాటర్ గానే ఆడతాడని పంజాబ్ ప్రకటించింది. ఈ నేపథ్యంలో కనోలీ కీలక ఇన్నింగ్స్ ఆడి పంజాబ్ నమ్మకాన్ని నిలబెట్టాడు.

**ఎవరీ కూపర్ కనోలీ?**

ఆస్ట్రేలియాకు చెందని కూపర్ కనోలీ 2003, ఆగస్టు 22న పెర్త్ లో జన్మించాడు. 22 ఏళ్ల కూపర్ ఆస్ట్రేలియా తరఫున 2024 సెప్టెంబర్ లో తొలి అంతర్జాతీయ మ్యాచ్ ఆడాడు. అరంగేట్రం చేసిన నాలుగు నెలల్లోనే అన్ని అంతర్జాతీయ ఫార్మాట్లలో మ్యాచ్ లు ఆడిన క్రికెటర్ గా కూపర్ అరుదైన ఘనత సాధించాడు. 2022-23 బీబీఎల్ ఫైనల్లో కూపర్ ప్రదర్శన అతడికి గుర్తింపునిచ్చింది. కూపర్ ఆస్ట్రేలియా తరఫున ఒక టెస్టు, 8 వన్డేలు, 11 టీ20 మ్యాచ్ లు ఆడాడు.



## ఏం ఫర్వాలేదు.. అంతా బాగుంది: గాయంపై శ్రేయస్ అయ్యర్

గుజరాత్ టైటాన్స్ తో జరిగిన మ్యాచ్ లో పంజాబ్ కింగ్స్ కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ చేతికి గాయమైంది. ఇన్నింగ్స్ 12వ ఓవర్ లో రషీద్ ఖాన్ వేసిన బంతిని స్ట్రైకర్ లోని కూపర్ కనోలీ కొట్టాడు. అది నేరుగా వెళ్లి నాన్ స్ట్రైకర్ శ్రేయస్ అయ్యర్ చేతికి బలంగా తాకింది. దీంతో స్టేడియంలోని పంజాబ్ అభిమానులు కలవరానికి గురయ్యారు. బాధతో విలవిలాడిన శ్రేయస్ ప్రాథమిక చికిత్స చేయించుకున్నాడు. అయినా సరే, బాధతో ఇబ్బందిపడుతూనే బ్యాటింగ్ కొనసాగించేందుకు ప్రయత్నించాడు. అయితే, 18 పరుగులకే పెవిలియన్ కు చేరాడు. కనోలీ కీలక ఇన్నింగ్స్ తో పంజాబ్ తొలి మ్యాచ్ లో విజయం సాధించింది. మ్యాచ్ అనంతరం తన గాయంపై శ్రేయస్ స్పందించాడు.

''తొలి మ్యాచ్ లోనే విజయం సాధించడం బాగుంది. బంతి బలంగా తాకడంతో బాగా నొప్పి వచ్చింది. అయితే, ఇప్పుడు అంతా బాగానే ఉంది. గెలిచిన ఉత్సాహంలో ఉన్నప్పుడు అపశకునం మాటలు మాట్లాడకూడదు. నేనెప్పుడూ పాజిటివ్ దృక్పథంతోనే ఉంటా. ప్రతీది మన మంచికేనని ఆశిస్తా. కనోలీ ఆటను ఎదురుగా ఉండి చూడటం బాగుంది. నాణ్యమైన షాట్లు కొట్టాడు. స్వల్ప వ్యవధిలో వికెట్లు పడినా కనోలీ మాత్రం చివరివరకూ క్రీజ్ లో ఉండి జట్టును గెలిపించడం అభినందనీయం. త్వరగా వికెట్లు కోల్పోవడం మమ్మల్ని కాస్త టెన్షన్కు గురిచేసింది. నేను పెవిలియన్ కు చేరిన తర్వాత నా చేతి గురించి ఆలోచిస్తూ ఉండిపోయా. దానికి ఐస్ పెడుతూ కాస్త సపర్యలు చేశా. ఈలోగా రెండు వికెట్లు టపటపా పడ్డాయి. ఐపీఎల్ లో ఇలాంటి పరిస్థితులు కొత్తేం కాదు. వాటిని అధిగమించి కూపర్ ఇన్నింగ్స్ ను ముందుకు తీసుకెళ్లాడు'' అని అయ్యర్ తెలిపాడు.

# దుమ్ములేపిన ఢిల్లీ బౌలర్లు...

## లక్నో స్కోర్ ఎంతంటే?



ఢిల్లీతో జరుగుతోన్న మ్యాచ్ లో లక్నో చిత్తయింది. నిర్ణీత 20 ఓవర్లలో కేవలం 141 పరుగులు మాత్రమే చేసి ఆలౌట్ అయింది పంత్ సేన. ఈ మ్యాచ్ ప్రారంభం నుంచి ఢిల్లీ బౌలర్లు అదరగొట్టారు. ప్రత్యర్థి లక్నో జట్టుకు చుక్కలు చూపించారు. ఏ ఒక్కరు కూడా భారీ స్కోర్ చేయకుండా కట్టడి చేశారు. ఈ క్రమంలోనే 141 పరుగులకు ఢిల్లీ దెబ్బకు లక్నో ఆలౌట్ అయింది.ఈ మ్యాచ్ లో లక్నో ఆటగాడు మిచెల్ మార్ష్ 35 పరుగులు సాధించగా, అబ్దుల్ సమద్ 36 పరుగులు చేసి జట్టును ఆదుకునే ప్రయత్నం చేశారు. ఇక మిగిలిన బ్యాటర్లందరూ అట్టర్ ఫ్లాఫ్ అయ్యారు. ఢిల్లీ బౌలర్లలో లుంగీ ఎంగిడీ, నటరాజన్ తలో మూడు వికెట్లు తీశారు. కుల్దీప్ యాదవ్ రెండు వికెట్లు పడగొట్టగా కెప్టెన్ అక్షర్ పటేల్ ఒక వికెట్ తీశాడు. ఇక నిర్ణీత 20 ఓవర్లలో 142 పరుగులు చేస్తే లక్నోపై ఢిల్లీ విజయం సాధిస్తుంది.

# ఫ్యూచరిస్టిక్ రొమాంటిక్ డ్రామాగా ప్రదీప్ రంగనాథన్ LIK

తమిళ హీరో ప్రదీప్ రంగనాథన్, విఘ్నేష్ శివన్ దర్శకత్వంలో తెరకెక్కిన సరికొత్త చిత్రం 'లవ్ ఇన్సూరెన్స్ కంపెనీ'. ఈ సినిమాలో అందాల భామ కృతి శెట్టి హీరోయిన్ గా నటిస్తుండగా, ఏప్రిల్ 10న తమిళంతో పాటు తెలుగులోనూ ఈ చిత్రం గ్రాండ్ గా విడుదల కానుంది. ఈ నేపథ్యంలో చిత్ర బృందం తాజాగా తెలుగు టీజర్ ను విడుదల చేసింది. దాదాపు ఏడు నెలల క్రితమే తమిళంలో వచ్చిన ఈ టీజర్, ఇప్పుడు చిన్నపాటి మార్పులతో తెలుగు ప్రేక్షకులను ఆకట్టుకుంటోంది.

ఇక ఈ టీజర్ విషయానికి వస్తే.. 2040 నాటి కాలానికి సంబంధించిన ఫ్యూచరిస్టిక్ అంశాలతో కూడిన ఫన్ అండ్ రొమాంటిక్ ఎంటర్టైనర్ గా కనిపిస్తోంది. ప్రస్తుత కాలంలోని ఇన్స్టంట్ రిలేషన్ షిప్స్ ఇష్టపడని ధీమా(కృతి శెట్టి), పాతకాలం నాటి స్వచ్ఛమైన ప్రేమను కోరుకుంటుంది. అయితే, వీరి ప్రేమకథకు అడ్డుపడే 'లవ్ ఇన్సూరెన్స్ కంపెనీ' యజమాని సూర్య (ఎస్.జె. సూర్య) పాత్ర ఆసక్తికరంగా ఉంది. అసలు అతను వీరిని ఎందుకు అడ్డుకుంటున్నాడు అనే అంశం వెండితెరపైనే చూడాలి.

లేడీ సూపర్ స్టార్ నయనతారతో పాటు ఎస్.ఎస్. లలిత్ కుమార్ నిర్మిస్తున్న ఈ చిత్రానికి అనిరుధ్ రవిచందర్ సంగీతాన్ని అందించాడు. యోగి బాబు, సీమన్, గౌరీ కిషన్ ఇతర కీలక పాత్రల్లో నటించిన ఈ సినిమాను తెలుగులో శ్రీ పద్మిని సినిమాస్ విడుదల చేస్తోంది. విభిన్నమైన కాన్సెప్ట్ తో వస్తున్న ఈ చిత్రం యూత్ను ఏ మేరకు మెప్పిస్తుందో వేచి చూడాలి.



# సల్మాన్ కోసం నయన్ ఎంట్రీ..



బాలీవుడ్ స్టార్ సల్మాన్ ఖాన్ తో సినిమా అనౌన్స్ చేసి దర్శకుడు వంశీ పైడిపల్లి అందరినీ ఆశ్చర్యపరిచాడు. గత కొంతకాలంగా వీరిద్దరి మధ్య చర్చలు జరుగుతుండగా, తాజాగా ఈ క్రేజీ కాంబినేషన్ అధికారికంగా ఖరారైంది. ఈ భారీ ప్రాజెక్టుకు సంబంధించి అందుతున్న తాజా సమాచారం ప్రకారం, సౌత్ ఇండియన్ స్టార్ నయనతార ఈ సినిమాలో సల్మాన్ సరసన హీరోయిన్ గా నటించనుంది.

ఈ విషయాన్ని తెలియజేస్తూ చిత్ర యూనిట్ సోషల్ మీడియా వేదికగా వెల్కమ్ నోట్ విడుదల చేసింది. 'అద్భుతమైన నటనతో అలరించే నయనతార, సల్మాన్ ఖాన్-వంశీ పైడిపల్లి చిత్రంలో భాగం కావడం మాకు గర్వకారణం. ఈ స్పెషల్ ప్రాజెక్టులోకి ఆమెకు స్వాగతం' అంటూ మేకర్స్ పేర్కొన్నారు. దీంతో ఈ సినిమాపై అంచనాలు ఒక్కసారిగా పెరిగాయి.

ఈ భారీ బడ్జెట్ ఎంటర్టైనర్ షూటింగ్ ఏప్రిల్ 2026 నుండి ప్రారంభం కానుంది. శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ బ్యానర్ పై దిల్ రాజు మరియు శిరీష్ ఈ చిత్రాన్ని భారీ బడ్జెట్ తో నిర్మిస్తున్నారు. పాన్-ఇండియా స్థాయిలో రూపొందుతున్న ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద ఎలాంటి సంచలనాలు సృష్టిస్తుందో చూడాలి.

## మరో క్రేజీ ప్రాజెక్ట్‌ను లైన్‌లో పెడుతున్న బాలయ్య

గాడ్ ఆఫ్ మాసెస్ నందమూరి బాలకృష్ణ ప్రస్తుతం వరుసబెట్టి సినిమాలు ఓకే చేస్తూ దూసుకుపోతున్నాడు. ఇప్పటికే ఆయన దర్శకుడు గోపీచంద్ మలినేని డైరెక్షన్ లో సినిమాలో నటిస్తున్నాడు. ఈ సినిమాను పక్కా మాస్ యాక్షన్ ఎంటర్ టైనర్ గా మేకర్స్ రూపొందిస్తున్నారు. ఇక ఈ సినిమాను దసరా కానుకగా రిలీజ్ చేయాలని చిత్ర యూనిట్ ప్లాన్ చేస్తోంది. కాగా, ఈ సినిమా తర్వాత బాలయ్య తన నెక్స్ట్ చిత్రాన్ని దర్శకుడు వివేక్ ఆత్రేయ డైరెక్షన్ లో చేయబోతున్నాడు. మైత్రీ మూవీ మేకర్స్ ప్రొడ్యూస్ చేయనున్న ఈ చిత్రాన్ని దసరాకు ప్రారంభించాలని చూస్తున్నారు. ఇదిలా ఉండగా, బాలయ్య ఇప్పుడు మరో డైరెక్టర్ కు గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు తెలుస్తోంది. ప్రముఖ నిర్మాత సుధాకర్ చెరుకూరి బాలయ్యతో ఓ సినిమా చేసేందుకు సిద్ధమయ్యారు. ఈ చిత్రానికి విజయ్ కనకమేడల డైరెక్షన్ చేయబోతున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే విజయ్ కనకమేడల బాలయ్యకు కథను వినిపించాడని.. దానికి బాలయ్య గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు సినీ సర్కిల్స్ లో టాక్ వినిపిస్తోంది. ఈ చిత్రాన్ని వచ్చే ఏడాది ప్రారంభంలో స్టార్ట్ చేసేందుకు చిత్ర యూనిట్ ప్లాన్ చేస్తోంది. దీనికి సంబంధించిన అఫీషియల్ అనౌన్స్ మెంట్ త్వరలోనే రానుందట.



## బైకర్ ప్రీమియర్ షోలకు సాలిడ్ రెస్పాన్స్..!

శర్వానంద్ హీరోగా నటించిన తాజా చిత్రం 'బైకర్' బాక్సాఫీస్ వద్ద సందడి చేసేందుకు రెడీ అయింది. మోటార్ రేసింగ్ నేపథ్యంలో తెరకెక్కిన ఈ సినిమా ఏప్రిల్ 3న విడుదల కానుంది. అయితే, ఒక రోజు ముందుగానే అంటే ఏప్రిల్ 2న హైదరాబాద్ లోని పలు థియేటర్లలో పెయిడ్ ప్రీమియర్స్ ఏర్పాటు చేశారు. ఈ షోలకు సంబంధించిన టిక్కెట్లు హాట్ కేకుల్లా అమ్ముడైపోయి, అప్పుడే అన్ని చోట్లా హౌస్ ఫుల్ బోర్డులు కనిపిస్తున్నాయి. ప్రేక్షకుల నుండి వస్తున్న ఈ భారీ రెస్పాన్స్ చూసి చిత్ర యూనిట్ మరిన్ని థియేటర్లలో అదనపు ప్రీమియర్ షోలను ప్లాన్ చేస్తోంది. శర్వానంద్ ఈ సినిమా కోసం చేసిన మేకోవర్ మరియు కొత్త రకమైన కథాంశం ప్రేక్షకుల్లో మంచి బజ్ క్రియేట్ చేశాయి. యూవీ క్రియేషన్స్ నిర్మిస్తున్న ఈ చిత్రంలో మాళవిక నాయర్ హీరోయిన్ గా నటించగా, సీనియర్ నటుడు రాజశేఖర్ ఒక ముఖ్య పాత్రలో కనిపించనున్నాడు. దర్శకుడు అభిలాష్ రెడ్డి రూపొందించిన ఈ 'బైకర్' కేవలం రేసింగ్ మాత్రమే కాకుండా మంచి ఎమోషనల్ రైడ్ గా ఉండబోతోంది. విజువల్స్ మరియు సౌండ్ పరంగా సరికొత్త అనుభూతినిచ్చే ఈ చిత్రం, శర్వానంద్ కెరీర్లో పెద్ద హిట్ అవుతుందని ట్రేడ్ వర్గాలు భావిస్తున్నాయి.



## ఆ డైరెక్టర్‌తో అల్లు అర్జున్ సూపర్ హీరో మూవీ..?

ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ ప్రస్తుతం పలు క్రేజీ ప్రాజెక్టులను తెరకెక్కిస్తూ బిజీగా ఉన్నాడు. ఇప్పటికే దర్శకుడు అట్లీ డైరెక్షన్ లో అఅ22 చిత్రంలో నటిస్తున్నాడు బన్నీ. ఈ సినిమాకు సంబంధించిన టైటిల్, పోస్టర్ ను బన్నీ బర్త్ డే ట్రీట్ గా రిలీజ్ చేసేందుకు మేకర్స్ రెడీ అవుతున్నారు. ఈ సినిమా తర్వాత దర్శకుడు లోకేష్ కనగరాజ్ డైరెక్షన్ లో అఅ23 అనే ప్రాజెక్ట్ ను ఇప్పటికే ప్రకటించాడు.

ఇక ఇప్పుడు మలయాళ యాక్టర్ కమ్ డైరెక్టర్ బాసిల్ జోసెఫ్ దర్శకత్వంలో బన్నీ ఓ సినిమా చేయబోతున్నాడట. ఈ సినిమాను త్వరలోనే అధికారికంగా ప్రకటిస్తారని చిత్ర వర్గాల టాక్. ఈ సినిమా కోసం బాసిల్ జోసెఫ్ స్క్రిప్టు పనుల్లో బిజీగా ఉన్నాడని.. ఈ చిత్రాన్ని ఓ సూపర్ హీరో మూవీగా ఆయన రూపొందించనున్నాడని తెలుస్తోంది. ఈ సినిమా కోసం ఇప్పటికే బాసిల్ గీతా ఆరట్స్ నుంచి అడ్వాన్స్ కూడా తీసుకున్నట్లు తెలుస్తోంది.

అయితే, ఈ ప్రాజెక్ట్ అల్లు అర్జున్ కెరీర్ లో 25వ చిత్రంగా రాబోతుందని తెలుస్తోంది. ఈ సినిమాలో బన్నీని మునుపెన్నడూ చూడని విధంగా ప్రెజెంట్ చేయబోతున్నారట. ఇక ఈ సినిమాను అధికారికంగా ప్రకటించిన తర్వాత అల్లు అర్జున్ కెరీర్ లోని 24వ చిత్రాన్ని ఎవరితో చేయబోతున్నాడనే విషయంపై క్లారిటీ వచ్చే అవకాశం ఉందని సినీ సర్కిల్స్ లో చర్చ సాగుతోంది.



Printed and Published by VUPPARI RAMESH KUMAR on behalf of Navatharam Publications Private Limited, Printed at Sree Seshasai Enterprises Plot No:19, IDA Balanagar, Medchal-Malkajgiri Dist, Hyderabad-500037.Telangana state and Published From : Samrat Complex, Block A , Flat No : 8A, Saifabad, OPP : A G Office, Beside: Aranya Bhavan, Hyderabad, Pin : 500004, Telangana State, EDITOR: VUPPARI RAMESH KUMAR. RNI Reg No.TELTEL/2016/72952.